అట్టహాసంగా కోదండరాముని కల్యాణం

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన టిటిడి ఇఒ ధర్మారెడ్డి

9

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 258 | విజయవాడ, మంగళవారం 23 ఏప్రిల్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 23 April 2024 | Rs

లెనిన్ స్ఫూర్తితో ముందుకు

- జయంతి కార్యక్రమంలో బివి రాఘవులు, ఎ.వనజ

9

పదో తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్

మెరిసిన బాలికలు

- 'పది' ఫలితాల్లో వారిదే పైచేయి
- 599 మార్కులు సాధించిన నాగ మనస్వి
- మొత్తం 86.69శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో బాలికలు పై చేయి సాధించారు. పరీక్షలకు బాలికలు 3,02,005 మంది హాజరవ్వగా 2,69,307(89.17శాతం) ఉత్తీర్ణుల య్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 84.32 మాత్రమే కావడం గమనార్హం. మొత్తం 3,14,610 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 2,65,267 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏలూరు జిల్లా నూజివీడులోని ముసునూరు మండలం రమణక్క పేటకు చెందిన ఆకుల వెంకటసాయి నాగ మనస్వి అత్యధికంగా 599 మార్కులు సాధించారు. మార్చి 18వ తేది నుంచి 30వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ సోమవారం విజయవాడలోని విడుదల చేశారు. 6,23,128 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 6,16,615 మంది హాజరయ్యారు. వీరిలో 5,34,574 మంది (86.69శాతం) ఉత్తీర్ణులయినట్లు ఆయన తెలిపారు. గతేడాది 72.74శాతం ఉత్తీర్ణత రాగా, ఈ ఏడాది 86.69శాతం నమోదైంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎపి రెసిడెన్షియల్, ఎపి బిసి వెల్ఫేర్ పాఠశాలలు 98.43శాతం సాధించాయి. ప్రైవేట్ పాఠశాలల్లో 96.72శాతం నమోదైంది. జిల్లా పరిషత్ పాఠశాలల్లో 79.38శాతం, మున్సిపల్ పాఠశాలల్లో 75.42శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 74.40శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 2803 పాఠశాలల్లో అందరూ ఉత్తీర్ణులవ్వగా , 17 పాఠశాలల్లో ఒక్కరూ కూడా పాస్ కాలేదు. 4,27,067 మంది ప్రథమ శ్రేణి, 73,200 మంది ద్వితీయ శ్రేణి, 34,307శాతం మంది తృతీయ శ్రేణి సాధించారు. ఫలితాల్లో 96.37శాతంతో పార్వతీపురం మన్యం, 93.35శాతంతో శ్రీకాకుళం జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. 62.47శాతంతో చివరి స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది. తెలుగు మాధ్యమంలో 1,61,881 మంది హాజరవ్వగా 1,15,060 (71.08శాతం) మంది, ఇంగ్లీష్ మీడియంలో 4,50,304 మందికి గానూ 4,15,743(92.32శాతం) మంది, హిందీలో రాసిన 12 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉర్దూలో రాసిన 2,616 మందిలో 2300(87.92శాతం), కన్నడలో 658 మందికి 374(56.84శాతం), తమిళంలో 260 మందికి 246(96.42శాతం), ఒడియాలో 884 మందికి 839(94.91శాతం) చొప్పున ఉత్తీర్ణత శాతం నమోదైంది. తెలుగు సబ్జెక్టులో 96.47శాతం, హిందీలో 99.24శాతం, ఇంగ్లీష్‌లో 98.52శాతం, గణితంలో 93.33శాతం, జనరల్ సైన్స్‌లో 91.29శాతం, సోషల్ స్టడీస్‌లో 95.34శాతం పాసయ్యారు. మార్కుల జాబితాలను నాలుగు రోజుల తర్వాత అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంటాయన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ లాగిన్ నుంచి మార్కుల మెమోరాండం, వ్యక్తిగత షార్ట్‌మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు www.results.bse. ap.gov.in వెబ్‌సైట్ నుంచి స్కూల్‌కు వెళ్లకుండానే షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఫెయిలైన విద్యార్థులకు మే 24 నుంచి జూన్ 3 వరకు సప్లిమెంటరీ ఫలితాలను నిర్వహిస్తామని కమిషనర్ సురేష్‌కుమార్ వెల్లడించారు. సప్లిమెంటరీకి హాజరయ్యేందుకు, రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఈ నెల 23 నుంచి 30 వరకు ఫీజు చెల్లించాలని తెలిపారు. అపరాధ రుసుం రూ.50లతో మే 1 నుంచి 23 వరకు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డి, సిమ్యాట్ డైరెక్టర్ విఎన్ మస్తానయ్య, సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి కెవి శ్రీనివాసులురెడ్డి, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి ప్రతాప్ రెడ్డి, కెజిబివి కార్యదర్శి డి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ కోడ్ ఉల్లంఘనే

ముస్లింలపై విద్వేషపు వ్యాఖ్యలను రిపీట్ చేసిన మోడీ

- బహు సంతానం కలిగిన సమాజమంటూ ఛీత్కారం
- చొరబాటుదారులంటూ నిందలు
- మోడీ పై చర్యకు ప్రతిపక్షాల డిమాండ్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో చేసిన ప్రసంగం 30 ఏళ్లలో అత్యంత విద్వేషపూరితమైనదని, ఇందుకుగాను ఆయనపై చర్య తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో మోడీ అవే వ్యాఖ్యలను సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ సభలో రిపీట్ చేశారు. ప్రధాన మంత్రి వంటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి ఇలా ఒక మతాన్ని టార్గెట్‌గా చేసుకుని ఈ విధంగా విద్వేషాలను రెచ్చగొట్టడం ముమ్మాటికీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనే. ముస్లింలపై విషం గక్కిన మోడీ ప్రసంగంపై కేసు నమోదు చేసేందుకు ఢిల్లీ పోలీసులు నిరాకరించడం, ఇటువంటి ప్రసంగాలపై కొరడా ఝుళిపించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం బెల్లం కొట్టిన రాయిలా మిన్నకుండడం వల్లే ఆయన అంతకంతకూ రెచ్చిపోతున్నారు. రాజకీయ లబ్ధి కోసం సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్న మోడీ పై ఎన్నికల సంఘం వెంటనే చర్య తీసుకోవాలని రాజకీయ పార్టీలు, పౌర సంస్థలు, ఎన్నికలవాచ్‌డాగ్ ఎడిఆర్ వంటివి డిమాండ్ చేశాయి. చివరికి దీర్ఘకాలం బిజెపితో చెలిమి చేసి రైతు ఉద్యమం సందర్భంగా తెగతెంపులు చేసుకుని బయటకొచ్చిన శిరోమణి అకాలీదళ్ కూడా మోడీ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాన్స్‌వాడా ఎన్నికల బహిరంగ సభలో మోడీ చేసిన ఎన్నికల ప్రసంగం ముస్లింలపై విషం చిమ్మింది. "దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌కు అధికారమిస్తే మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ఎక్కువమంది పిల్లలను గనేవారికి పంచిపెడతారు. వారు చొరబాటు దారులకు పంపిణీ చేయాలని అనుకుంటున్నారు. మీరు దీనిని అంగీకరిస్తారా?" అని ర్యాలీలో పాల్గొన్నవారిని ప్రశ్నించారు. గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన ప్రసంగాన్ని అసందర్భంగా, తప్పుడు రీతిలో ఉదహరించారు. వనరులపై ముస్లింలకు మొదటి హక్కు ఉండాలని మన్మోహన్ సింగ్ గతంలో ఎప్పుడో అన్నట్లు మోడీ ఇప్పుడు చెప్పారు. ఒకవేళ కాంగ్రెస్‌ను ఎన్నుకుంటే గిరిజనుల సంపదను 'చొరబాటుదారుల'కు ధారాదత్తం చేస్తుందని హెచ్చరించారు. మైనారిటీ ముస్లింలను బిజెపి నేతలు తరచూ చొరబాటుదారులుగా అభివర్ణిస్తుంటారన్న విషయం తెలిసిందే. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా మత విద్వేష ప్రచారానికి అంబాసిడర్‌గా ఎలా వ్యవహరించిందీ చూశాం. ప్రధాని హోదాలో అంతకన్నా దారుణమైన రీతిలో ఆదివారం ఆయన ప్రసంగం చేశారు. ఈ ప్రసంగం ఆంగ్ల అనువాదం అధికారిక వెబ్‌సైటులో ఉంచారు. 'కాంగ్రెస్ పార్టీ మన తల్లులు, సోదరీమణుల మంగళసూత్రాలను సైతం లాక్కొని ముస్లింలకు ఇస్తుంది' అనే రెచ్చగొట్టే వ్యాఖ్యలను అందులోంచి తొలగించారు.

వాస్తవిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడ!

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు వాకిట నిలవడం కష్టమేనని బిజెపి నాయకత్వానికి అర్థమైపోయింది. బిజెపి అయోధ్యలో నూతన రామమందిర నిర్మాణ అంశాన్ని ముందుకు తెచ్చి ప్రతిపక్షాలపై హిందూ వ్యతిరేకులుగా, ముస్లిం అనుకూలురుగా ముద్ర వేసేందుకు ప్రయత్నించింది. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టడానికి మందిర నిర్మాణం ఒక సమర్థవంతమైన సాధనంగా ఉపయోగపడుతుందని బిజెపి తొలుత భావించింది. కానీ అది ఫలించేలా లేదు. లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగులో తక్కువ ఓటింగ్ శాతం నమోదు కావడం దీనినే తెలియజేస్తోంది.. ఎన్డీయే యేతర పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలతో పోలిస్తే ఎన్డీయే సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలలోనే ఓటింగ్ శాతం బాగా తక్కువగా నమోదు అయిందని, తమ జీవనానికి సంబంధించిన అంశాలకే ఓటర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని దీనివల్ల అర్థమవుతోందని రాజకీయ శాస్త్రవేత్త యోగేంద్ర యాదవ్ తెలిపారు. బిజెపి నాయకులు, కార్యకర్తల్లో సైతం ఎక్కడా ఉత్సాహం కన్పించడం లేదు.

గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్ల సమయంలో మోడీ ఇచ్చిన ఓ ప్రకటనను ఇప్పుడు అందరూ గుర్తు చేసుకుంటున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ముస్లింలకు సహాయ శిబిరాలు ఏర్పాటు చేసేందుకు ఆయన నిరాకరించారు. 'మేము ఇద్దరం...మాకు పాతిక మంది' అని నమ్మే ఓ సమాజానికి ఈ శిబిరాలు సంతాన కేంద్రాలుగా మారడం తనకు ఇష్టం లేదంటూ ముస్లింలను అవమానించారు. ఆనాడు మత ఘర్షణల్లో బాధితులైన ముస్లింలకు వ్యతిరేకంగా ఆయన విద్వేషాలను ఎలా రెచ్చగొట్టారో ఇప్పుడు కూడా బాన్స్‌వారాలో అదే పని చేశారు. ముస్లిం శరణార్థులను చొరబటు దారులుగా అభివర్ణించారు. ఆయన ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి ఇది విరుద్ధంగా ఉంది. ఈ చట్టం దేశంలోని ముస్లిమేతర శరణార్థులను స్వాగతించడమే కాకుండా వారికి భారత పౌరసత్వాన్ని కల్పిస్తామని గ్యారంటీ ఇచ్చింది.

అనుమానాలు రేకెత్తిస్తున్న ఇసి విశ్వసనీయత

పౌర సమాజ సంస్థలు, ఏడీఆర్ ఎన్నికల పరిశీలకుడు జగదీప్ చక్రవరి ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఓ ఫిర్యాదు పంపారు. మోడీ ప్రసంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేదిగా ఉందని, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 123 (3), (3ఏ), 125 సెక్షన్లకు కూడా విరుద్ధంగా ఉన్నదని ఆయన అందులో తెలిపారు. ఐపీసీ సెక్షన్ 153-ఏను కూడా ఇది ఉల్లంఘిస్తోందని వివరించారు. ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనందున ఎలాంటి కాలయాపన లేకుండా వెంటనే చర్య తీసుకోవాలని కోరారు. అయితే ఇప్పటికే దీనిపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించిన ఇసి, ఏవైనా చర్యలు తీసుకుంటుందా అన్నది అనుమానమే. సాక్షాత్తూ ప్రధానమంత్రే హిందూ ఓట్లను దండుకోవడానికి ఇలాంటి నీచమైన ప్రచారానికి దిగుతుంటే ఎన్నికల సంఘం గుడ్లప్పగించి చూడడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏది ఏమైనా తన స్వతంత్రతపై వస్తున్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. తద్వారా ప్రజల దృష్టిలో దానిపై కొంత నమ్మకం ఏర్పడుతుంది.

మోడీపై చర్య తీసుకోవాలి

"రాజస్థాన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన విద్వేషపూరిత ప్రసంగం ఎన్నికల నియమావళిని బాహాటంగా ఉల్లంఘించడమే. సుప్రీంకోర్టు సుమోటోగా ఈ కేసును చేపట్టాలి. మోడీ వ్యాఖ్యలు దారుణం. ఎన్నికల కమిషన్ మౌనం మరింత దారుణం. విద్వేష ప్రసంగాలపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కూడా ఇది ఉల్లంఘిస్తోంది. ఇది కఠిన చర్యలకు, కోర్టు ధిక్కరణకు యోగ్యమైనది'

- ఎక్స్‌లో సీతారాం ఏచూరి ట్వీట్

నో కామెంట్...

- మోడీ ప్రసంగంపై ఇసి సమాధానం ఇదే
- కమిషన్ స్వతంత్రతపై కమ్ముకుంటున్న నీలినీడలు

ఆదివారం రాజస్థాన్‌లోని ఓ ఎన్నికల బహిరంగ సభలో మోడీ చేసిన ప్రసంగంపై ప్రతిపక్షాలు, రాజకీయ విశ్లేషకులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఎన్నికల కమిషన్ మాత్రం మౌనాన్ని వీడడం లేదు. మోడీ ప్రసంగంపై మాట్లాడాల్సిందిగా సోమవారం ఉదయం నుండి పలువురు మీడియా ప్రతినిధులు పదేపదే ప్రశ్నించినప్పటికీ ఎన్నికల కమిషన్ ప్రతినిధి నుండి ఒకే ఒక సమాధానం వస్తోంది. అదేమిటంటే 'వ్యాఖ్యానించడానికి నిరాకరిస్తున్నాము'. ఎన్నికల కమిషన్ ఇంతకుముందు శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు నోటీసు ఇచ్చింది. ఆయన తన ఎన్నికల ప్రచారంలో ఉపయోగించిన 'హిందూ', 'జై భవాని' పదాలను ఉపసంహరించుకోవాలని సూచించింది. అయితే అందుకు ఉద్ధవ్ నిరాకరించారు. ముందుగా మోడీకి నోటీసు పంపాలని ఇసికి సలహా ఇచ్చారు. ఏదేమైనా ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల కమిషన్ పైనే ఉంది. దాని స్వతంత్రతపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ప్రధాని ప్రసంగం తప్పుడు వాదనలు, విద్వేషపూరిత వ్యాఖ్యలతో నిండి ఉంది. ఇంతకంటే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన మరొకటి ఉండబోదు.

సామరస్యంగా వ్యవహరించండి!

- కేంద్ర, రాష్ట్రాలకు మరోసారి సుప్రీం సూచన
- కర్ణాటక కరువు పరిష్కారానికి వారం గడువు కావాలన్న కేంద్రం

న్యూఢిల్లీ : ఫెడరల్ వ్యవస్థలో తలెత్తే విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని సుప్రీం కోర్టు సోమవారం మరోసారి కేంద్రానికి, కర్ణాటక రాష్ట్రానికి గుర్తు చేసింది. కర్ణాటక కరువు కాటకాల ఆందోళనలను పరిష్కరించడానికి ఏదో ఒకటి చేస్తామని, అందుకు వారం రోజులు గడువు కావాలని కేంద్రం కోరిన నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

'సామరస్యంగా పరిష్కరించుకోండి, మనది ఫెడరల్ వ్యవస్థ, కేంద్రం, రాష్ట్రం రెండూ సమాన భాగస్వాములే" అని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ కేంద్రం తరపున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, కర్ణాటక తరపున వాదనలు వినిపిస్తున్న కపిల్ సిబల్‌లనుద్దేశించి వ్యాఖ్యానించింది. వారం రోజులు వేచి చూసేందుకు రాష్ట్రం కూడా సిద్ధంగానే వుందని కపిల్ సిబల్ తెలిపారు. ఏప్రిల్ 8న గత విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు, పదే పదే రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుకు రావడాన్ని ప్రస్తావిస్తూ కేంద్రం ధోరణిని ప్రశ్నించింది. ఇటీవలే, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు కేంద్ర వైఖరిని విమర్శిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. విపత్తు సహాయక నిధులను విడుదల చేయకుండా తమిళనాడు ప్రజల పట్ల కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందని తమిళనాడు ప్రభుత్వం విమర్శించింది. కేరళ కూడా కేంద్రానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తూ , రాష్ట్రం రుణ పరిమితిని పెంచకుండా ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లోకి నెట్టివేస్తోందని విమర్శించింది.

లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున కర్ణాటకకు సంబంధించిన వ్యవహారాల్లో నిర్ణయాలు తీసుకోవడానికి ముందుగా ఎన్నికల కమిషన్‌ను కేంద్రం సంప్రదించాల్సి వుందని వెంకటరమణి తెలిపారు.

తీవ్ర మానవతా సంక్షోభం

తమ సంక్షోభాన్ని అధిగమించేందుకు కేంద్రాన్ని ఆర్థిక సాయం కోరుతూ చేసిన అభ్యర్థనకు ఎదురు దెబ్బ తగిలిందని కర్ణాటక తన పిటిషన్‌లో పేర్కొంది. జాతీయ విపత్తు సహాయక నిధి కింద రూ.18,171.44 కోట్లు సాయం ఇవ్వాల్సిందిగా ఆరు మాసాల క్రితం రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. దానికి మౌనమే సమాధానమైంది. మొత్తంగా రాష్ట్రంలో పంటల నష్టం రూ.35,162.05కోట్లుగా వుందని ఆ పిటిషన్‌లో కర్ణాటక పేర్కొంది. రాష్ట్రం తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంటోందని ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని న్యాయవాది డిఎల్ చందన పేర్కొన్నారు. వివిధ పద్దుల కింద కరువు సాయం అందించాల్సిందిగా ఇప్పటికి మూడుసార్లు మెమొరాండాలు అందించామని తెలిపింది.

రాజ్యాంగంలోని 21వ సెక్షన్ కింద ప్రజలకు హామీ కల్పించబడిన ప్రాథమిక హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై వుందని, కానీ కేంద్రం ఆర్థిక సాయాన్ని నిరాకరించడం వల్ల రాజ్యాంగంలోని 14వ అధికరణ (సమానత్వ హక్కు), 21వ అధికరణ (జీవన హక్కు)ల కింద కర్ణాటక ప్రజల ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని ఆ పిటిషన్‌లో రాష్ట్రం పేర్కొంది.

కేజ్రీవాల్‌ను పరీక్షించేందుకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయండి

- అవసరమైన వైద్యాన్ని అందించాలి
- జైలు అధికారులకు రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశం

సర్టిఫికెట్లలో తప్పల సవరణ చర్యలు సులభంగా ఉండాలి

- హైకోర్టు తీర్పు

• లోపలి పేజీలో..

'విశాఖ ఉక్కు'ను మేనిఫెస్టోలో చేర్చండి

- టిడిపి, వైసిపిలకు సిపిఎం డిమాండ్
- ఎన్నికల ప్రచారంలో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్న
- మోసపూరిత మౌనంతో బిజెపి కుట్రకు వైసిపి పరోక్ష మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై వైసిపి మోసపూరిత మౌనాన్ని అనుసరిస్తోందని పేర్కొన్న సిపిఎం రాష్ట్ర కమిటీ ఆ చర్యను ఖండించింది. దీనిని బిజెపి కుట్రకు పరోక్షంగా మద్దతు ఇవ్వడమేనని పేర్కొంటూ తీవ్రంగా నిరసిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో విశాఖ ఉక్కును పరిరక్షిస్తామని టిడిపి, వైసిపిలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీలుప్లాంటును మోడీ ప్రభుత్వం అమ్మేస్తుంటే చంద్రబాబు, జగన్‌లు విశాఖ ఎన్నికల ప్రచారంలో ఎందుకు మాట్లాటడం లేదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై టిడిపి, వైసిపిల వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు, భరోసా అంటూ ఊదరగొట్టారని, స్టీలుప్లాంటు ప్రైవేటీకరణపై మాత్రం ప్రస్తావన చేయలేదని తెలిపారు. ఎన్నో త్యాగాలతో ఏర్పాటు చేసుకున్న స్టీలుప్లాంటును కాపాడుకోవాలని చంద్రబాబుకు లేకపోవడం గర్హనీయమని తెలిపారు. లోకేష్ కూడా విశాఖ వరకూ పాదయాత్ర చేసి కనీసం స్టీలుప్లాంటు కార్మికుల నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించపోగా ఉద్దేశపూర్వకంగా దాటేయడం అవకాశవాదమని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మేస్తుంటే స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జగన్, చంద్రబాబు స్పందించడం లేదని, రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపి విధానాలకు వంతపాడుతున్నారని విమర్శించారు. మరోవైపు గాజువాక టిడిపి, వైసిపి అసెంబ్లీ అభ్యర్థులు ఓట్ల కోసం స్టీలు ప్లాంటును కాపాడుతాం అంటూ ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు. స్టీలు ప్లాంటుకు ముడి ఖనిజం అందకుండా మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రశ్నించాలని కోరారు.

జగన్ తరుపున నామినేషన్ వేస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి

పులివెందులలో జగన్ తరఫున నామినేషన్

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తరపున ఆయనకు బాబాయ్ వరుసయ్యే వైఎస్.మనోహర్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వెంకటేష్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25న జగన్‌మోహన్‌రెడ్డి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. అనంతరం పులివెందులలో భారీ బహిరంగ సభ జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావుకు మద్దతుగా నిర్వహిస్తున్న ర్యాలీ (ఇన్‌సెట్‌లో నామినేషన్ పత్రాలను అందజేస్తున్న శివశంకరరావు)

2

ప్రజలను మోడీ బెదిరిస్తున్నారు : బివి రాఘవులు

పార్లమెంట్ స్థానాలకు 142 నామినేషన్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 25 పార్లమెంట్ స్థానాలకు గాను 142 నామినేషన్లు అందాయి. నామినేషన్లు వేసిన వారిలో పలువురు ప్రముఖులు ఉన్నారు. గుంటూరు ఎంపిగా చంద్రశేఖర్ పెమ్మసాని, ఒంగోలు నుంచి మాగుంట శ్రీనివాసులరెడ్డి, తిరుపతి నుంచి బిజెపి అభ్యర్థిగా వరప్రసాద్ , రాజంపేట వైసిపి ఎంపి అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల విషయానికి వస్తే పులివెందులలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తరపున ఆయన బంధువు మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

కూల్చివేత సంస్కృతి మార్చుకోరా?

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూల్చివేత సంస్కృతిని మార్చుకోరా? అని వైసిపిని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ఇళ్ల నిర్మాణాల కూల్చివేతను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇళ్లను నిర్మించి ఇవ్వడం చేతకాని ప్రభుత్వానికి కూల్చే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. తమ హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లను ఐదేళ్లయినా వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇవ్వలేకపోయారని విమర్శించారు. గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షులు కోపూరి లక్ష్మి తన వేలిని కోసుకున్నారన్న వార్త తనను కలచివేసిందని మరో ప్రకటనలో తెలిపారు. తను నివసించే ప్రాంతంలోని అక్రమాల గురించి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి ఉంటే ఈ దారుణం జరిగి ఉండేది కాదన్నారు. నిర్వేదంతో, నిస్పృహతో ఇలాంటి ఘటనలకు పాల్పడొద్దని కోరారు.

వారిది కూటమి కాదు.. అతుకుల బొంత

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి అతుకుల బొంతలా తయారైందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సిఎం జగన్‌ను దూషించడం తప్ప ప్రజలకు చెప్పుకునేందుకు వారికి ఒక విధానం అంటూ లేదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ మూడు పార్టీలు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి 2014 నుంచి 2019 వరకు ఏం చేశాయో చెప్పాలన్నారు. చంద్రబాబు టిడిపి వారినే బిజెపి, జనసేన పార్టీల్లోకి పంపి టికెట్లు ఇప్పించుకుంటున్నారని అన్నారు. పవన్‌కల్యాణ్‌కు కనీసం రెండేళ్లయినా సిఎం పదవి ఇవ్వాలన్నది జనసైనికుల కోరికైతే, అది నెరవేరే అవకాశం లేకుండా టికెట్లలో కోతలు పెట్టారని విమర్శించారు. ఇచ్చిన 21 సీట్లలో పది నుంచి 12 మంది ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లేనని అన్నారు. లాస్ట్ ఛాన్స్ అనే చంద్రబాబు మాటలను ప్రజలు పెద్దగా పట్టించుకోనందునే అదుపు తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. చిరంజీవి మంచి సినిమా నటుడని, ఆయన రాజకీయాల్లోకి వస్తే రావచ్చు కాని బ్యాంకులను ముంచిన వారికి అండగా నిలవడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో వైఎస్ షర్మిల కూడా చంద్రబాబు కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు.

పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా

- తాడేపల్లిగూడెం, గణపవరం సభలు రద్దు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రెండో రోజుల పర్యటన సోమవారం రద్దయింది. హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం కారణంగా పిఠాపురం నుంచి రాలేని పరిస్థితుల్లో పవన్ ఉండడంతో తాడేపల్లిగూడెం, గణపవరంలోని సభలను రద్దు చేసినట్లు జనసేన నాయకత్వం పేర్కొంది. తాడేపల్లిగూడెం సభలో నరసాపురం ఎంపి బిజెపి అభ్యర్థి శ్రీనివాసవర్మ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడేందుకు ప్రయత్నించారు. అయితే సభకు పవన్ రాలేదన్న విషయం తెలుసుకున్న జనం అక్కడి నుంచి వెళ్లిపోవడంతో సభను వెంటనే ముగించేశారు.

వైసిపికి కురుబ కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి- బత్తలపల్లి (శ్రీసత్యసాయి జిల్లా)

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం వైసిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన భార్య బత్తలపల్లి జడ్‌పిటిసి సభ్యులు కోటి సుధతో కలిసి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం ఆయన బత్తలపల్లిలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బిసిలకు న్యాయం జరగలేదన్నారు. 2019, 2024లో హిందూపురం ఎంపి టికెటు ఇస్తానని చెప్పి జగన్ మోసగించారని విమర్శించారు. ఆయన మాటలు విని ఆస్తులు అమ్ముకుని పార్టీ కోసం ఖర్చు చేశానన్నారు. తనతోపాటు ఎంపిటిసి సభ్యులు కోటి నరేష్ కుమార్, ఉప సర్పంచ్ కోటి గోపీనాథ్ కూడా వైసిపికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

నూజివీడు విద్యార్థికి 'పది'లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి - యంత్రాంగం

పదో తరగతి పరీక్షల్లో ఏలూరు జిల్లా నూజివీడు విద్యార్థిని స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించారు. నారాయణ విద్యాసంస్థలో చదివిన ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన ఆకుల వెంకట సాయి నాగ మనస్వి 599 మార్కులు తెచ్చుకున్నారు. హిందీలో 99 మార్కులు రాగా, మిగతా అన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు సాధించారు. మనస్వి తల్లిదండ్రులు నాగవరప్రసాద్, శైలజలు వృత్తి రీత్యా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. మనస్వి మాట్లాడుతూ.. ఈ ర్యాంకు సాధించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉందన్నారు. ఐఐటిలో సీటు సాధించడమే తన లక్ష్యమన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గకు చెందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి సంపతిరావు శ్రీకర్ 597 మార్కులు సాధించారు.

వెంకటసాయి నాగ మనస్వి (599 మార్కులు)

శ్రీకర్ (597 మార్కులు)

శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భాగ్యశ్రీ పండిట్ 596 మార్కులు, కోటబొమ్మాళి జడ్‌పి హైస్కూల్‌కు చెందిన సకలాభక్తుల శ్రీవల్లి 595, ఎచ్చెర్ల మండలం అల్లినగరం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి ముని మణికంఠ 594, సారవకోట మండలం బుడితి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి ఎం.మధుశ్రీ 593 మార్కులు సాధించారు. ఐదుగురికి 592, ముగ్గురికి 591 మార్కులు వచ్చాయి. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.తమన్నా 594 మార్కులు సాధించారు.

ఉత్తీర్ణత సాధించలేదని విద్యార్థిని ఆత్మహత్య

ఉత్తీర్ణత సాధించలేకపోయానని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని విశ్వనాథపురం పంచాయతీ సీతారాంపురానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని వజ్రగడ్డి జానకి ఆత్మహత్య చేసుకున్నారు.

ఒక సబ్జెక్టులో ఫైయిల్ అయ్యానన్న మనస్తాపంతో ఇంట్లోనే ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్టిఫికెట్లలో తప్పుల సవరణ చర్యలు సులభంగా ఉండాలి

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

ఇంటర్మీడియట్, పదోతరగతి సర్టిఫికెట్లలో పేర్లు, తేదీలు తప్పుగా వస్తే వాటిని సరిచేసే విధానం సులభతరం చేయాలని ఆయా బోర్డులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఎస్‌సి, ఇంటర్ సర్టిఫికెట్లలో విద్యార్థుల పేర్లు, వారి తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ తదితర తప్పులను సవరించే విషయంలో కాలపరిమితి దాటి పోయిందని, రికార్డులు కనిపించడం లేదని చెప్పడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్‌లైన్స్‌ను అమలు చేయాల్సిందేనని జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తీర్పు చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పత్రాల కోసం, ఉద్యోగాల దరఖాస్తుల్లో సర్టిఫికెట్లలోని సమాచారాన్ని వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. పాఠశాల రికార్డుల్లో పేర్లు, పుట్టిన తేదీ, ఇంటి పేరు, తల్లిదండ్రుల పేర్లు, కులం, మతం తదితర వివరాల సవరణకు గత ఉత్తర్వులను సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రం మార్పు చేసింది. కలిదిండి గ్రామానికి చెందిన కుందేటి వెంకట నరసయ్య పేరు, తల్లిదండ్రుల పేర్లు పాఠశాల రికార్డుల్లో తప్పుగా నమోదైన కేసు హైకోర్టుకు చేరింది. కోవిడ్ కారణంగా మూడేళ్ల లోపు అధికారులను పిటిషనర్ ఆశ్రయించలేకపోయారు. రికార్డుల్లో పిటిషనర్ కోరిన విధంగా సవరణలు చేయాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు.

పది ఫలితాల్లో నారాయణ విద్యార్థుల రికార్డ్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్‌సి 2023-24 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో మెప్పించారు. ఎస్ఎస్‌సి చరిత్రలోనే నారాయణ విద్యార్థినీ సాయి మనస్వి 599 మార్కులతో ఆల్‌టైం రికార్డ్‌ను నెలకొల్పిందని నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పలువురు విద్యార్థులు 598, 597 మార్క్‌లనూ పొందారని పేర్కొన్నారు. గణితంలో 100కి 100 మార్కులను 15.3 శాతం మంది సాధించారని తెలిపారు.

64 బ్రాంచీల్లో 100 శాతం ఫలితాలను నమోదు చేశామన్నారు. ఏటేటా నారాయణ తమ ఫలితాలను తానే అధిగమిస్తుందన్నారు. గ్రేడ్ పాయిట్ అయినా, మార్కులైనా తమ సంస్థనే నెంబర్ వన్‌గా ఉందన్నారు. ఉపాధ్యాయుల అకుంఠిత దీక్షకు ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో నిరంతరం విజయాలను సాధిస్తున్నామన్నారు.

విశాఖలోనే సిఎం జగన్

- నేడు తిరిగి బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన బస్సు యాత్రకు విరామమిచ్చి విశాఖలోనే పూర్తిగా విశ్రాంతి తీసుకున్నారు. ఆదివారం విశాఖ నగరంలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ముగిసిన తర్వాత ఎండాడ సమీపంలోని విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణకు చెందిన ఎంవివి సిటీకి ఆయన వెళ్లారు. తాను యాత్ర నిర్వహిస్తున్న బస్సులోనే సోమవారం విశ్రాంతి తీసుకున్నారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి విశాఖ ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, నాయకులు రొంగలి జగన్నాథం తదితరులు జగన్‌ను కలిశారు.

నేటి బస్సు యాత్ర ఇలా..

ఎండాడలోని ఎంవివి సిటీ నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు బస్సు యాత్ర తిరిగి మొదలవుతుంది. భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలోని మధురవాడ, ఆనందపురంల్లో సాగుతుంది. అనంతరం ఆనందపురం హైవే వద్ద గల చెన్నా కన్వెన్షన్ సెంటర్‌లో సోషల్ మీడియాతో జగన్ ఇంటరాక్షన్ కానున్నారు. ఆ తరువాత తగరపువలస మీదుగా విజయనగరం జిల్లాలోని జొన్నాడకు వెళ్తారు. చెల్లూరులో సాయంత్రం బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి చింతలవలస, భోగాపురం, రణస్థలం వెళ్లి అక్కివలసలో రాత్రి బస చేస్తారు.

ఎపి టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

THANNERU PRANATHI
Ht.No. 2425106162

CH V S CHANDRA
Ht.No. 2418106902

PARIMI SAI LASYA
Ht.No. 2419123164

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించారు. ఈ మేరకు శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముగ్గురు విద్యార్థులు తన్నీరు ప్రణతి, సిహెచ్‌విఎస్ చంద్ర, పరిమి సాయి లాస్య అత్యధిక మార్కులు 598 సాధించి విజయకేతనం ఎగరవేశారని తెలిపారు. ఆరుగురు విద్యార్థులు రెండో అత్యధిక మార్కులు 597తోపాటు 15 మంది విద్యార్థులు 596 మార్కులు, 31 మంది 595 మార్కులు, 524 మంది 590 మార్కులు, 2,353 మంది 580 ఆపైన మార్కులు సాధించారని వివరించారు. మ్యాథ్స్ సబ్జెక్టులో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థులు 3,370 మంది, సైన్స్ సబ్జెక్టులో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థులు 945 మంది, తెలుగు సబ్జెక్టులో వందకు వంద మార్కులు సాధించిన వారు 1,745 మంది కలిపి మొత్తం 7,394 మంది వందకు వంద మార్కులు సాధించారని పేర్కొన్నారు. శ్రీచైతన్యలో 98.9 శాతం ఉత్తీర్ణత నమోదైందని, 132 బ్రాంచులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాయని తెలిపారు.

ప్రజలను మోడీ బెదిరిస్తున్నారు

- అసలు సినిమా చూపిస్తానని అనడంలో ఆంతర్యం ఏమిటి?
- అమరావతిలోనే రాజధాని : బివి రాఘవులు
- భారీ ర్యాలీతో మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు నామినేషన్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో బిజెపి మరోసారి అధికారంలోకొస్తే అసలు సినిమా చూపిస్తానని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రజలను బెదిరించే ధోరణిలో ఉన్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సిపిఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రజాతంత్ర శక్తులు బలపరిచిన ఇండియా వేదిక తరఫున సిపిఎం అభ్యర్థిగా జొన్నా శివశంకరరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని చిల్లపల్లి కల్యాణ మండపంలో జరిగిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించారు. ఈ సభలో రాఘవులు మాట్లాడుతూ ఇప్పటి వరకూ పదేళ్ల బిజెపి పాలనలో ట్రయల్ మాత్రమే చూశారని, మళ్లీ గెలిస్తే అసలు సినిమా చూపిస్తానని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజలపై కక్ష కట్టడమేనని పేర్కొన్నారు. బిజెపిని గద్దె దించడానికి 27 పార్టీలతో ఇండియా వేదిక ఏర్పాటైందన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరసత్వం వంటి చట్టాలను కఠినంగా అమలుకు పూనుకుంటుందన్నారు. ముస్లిములు, గిరిజనులు, దళితుల హక్కులకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం వల్ల దళితులకు, గిరిజనులకు రిజర్వేషన్లు పొందే అవకాశం లేకుండా పోతోందని తెలిపారు. రాష్ట్రంలో ఓట్లు, సీట్లు లేని బిజెపికి టిడిపి, జనసేన మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు. అధికార వైసిపి గత ఐదేళ్లుగా బిజెపికి అంటకాగుతోందని వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా, రాజధాని నిర్మించకపోయినా ఈ మూడు పార్టీలూ నోరెత్తడం లేదని గుర్తు చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి మద్దతు పలుకుతున్న ఆ మూడు పార్టీలూ ప్రజలకు ద్రోహం చేసినట్టేనన్నారు. బిజెపి తీసుకొచ్చిన కార్మిక చట్టాలకు, వ్యవసాయ నల్ల చట్టాలకు వైసిపి, టిడిపి మద్దతు పలికాయని, కేంద్రం నుంచి రావాల్సిన విభజన చట్టం హామీలు అమలు చేయాలని మాత్రం ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని వివరించారు. సిపిఎం అభ్యర్థిని గెలిపిస్తే ప్రజా సమస్యల కోసం అసెంబ్లీలో, ఓడితే రోడ్డుపై పోరాటం చేస్తామన్నారు. రాజధాని అమరావతిలోని కొనసాగించడానికి ఇండియా బ్లాక్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. మంగళగిరి అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావును, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ను, ఇతర ప్రాంతాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి, టిడిపిలకు రాష్ట్ర ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. 2014 సంవత్సరం ముందు గ్యాస్ సిలిండర్ ధర రూ.400 ఉండగా, రూ.25 పెంచితే మోడీ, బిజెపి నాయకులు రోడ్లపైకొచ్చి నిరసనలు తెలిపారని, నేడు మోడీ పాలనలో గ్యాస్ ధర వెయ్యి రూపాయలు ఉందని వివరించారు. సిపిఎం సీనియర్ నాయకులు, రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ ఎమర్జెన్సీ అమలులో ఉన్నప్పటి కన్నా మోడీ హయాంలో నిర్బంధం పెరిగిపోయిందన్నారు.

ఎన్నికల సమయంలో ఇద్దరు ముఖ్యమంత్రులను అరెస్టు చేసి నేరం నిరూపణ కాకముందే జైలుకు పంపించిన ఘనత మోడీకి దక్కిందని ఎద్దేవా చేశారు. రైతులకు నష్టం కలిగించే విద్యుత్ మీటర్లు పెట్టారని, ఎన్నికల బాండ్లు పెద్ద కుంభకోణమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.శామ్యూల్ మాట్లాడుతూ ప్రజలకు అండదండలుగా ఉండే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ ర్యాలీగా వెళ్లి జొన్నా శివశంకరరావు నామినేషన్ దాఖలు చేశారు.

సిపిఎస్ రద్దును విస్మరించిన జగన్

- వైసిపి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం
- జగ్గంపేట, శృంగవరపుకోట ప్రజాగళం సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి- యంత్రాంగం

మద్య నిషేధం, సిపిఎస్ రద్దు హామీలను ముఖ్యమంత్రి జగన్ విస్మరించారని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట, విజయనగరం జిల్లా శృంగవరపుకోటలోని దేవిబొమ్మ కూడలిలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ.. వైసిపి అక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. ఒక దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన దుర్మార్గులు వైసిపిలో ఉన్నారని విమర్శించారు. పవన్ కల్యాణ్ పైనా, ఆయన వైవాహిక జీవితంపైనా సిఎం జగన్ దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకొచ్చిన తర్వాత వైసిపి మాఫియాను రాష్ట్రం నుంచి తరిమేద్దామని చెప్పారు. జగన్ అరాచక పాలనను దేశం దృష్టికి తీసుకువెళ్లేందుకు గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షులు కోపూరి లక్ష్మి తన బొటనవేలిని కోసుకున్నారనే వార్త తమను కలచివేసిందన్నారు. గంజాయి, ఇతర అక్రమాలపై ఆమె ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి ఉంటే ఈ దారుణం జరిగి ఉండేది కాదని పేర్కొన్నారు. వైసిపి రాక్షస పాలనకు ఈ ఘటన ఒక ఉదాహరణ అని చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వానికి మరో 20 రోజులే సమయం ఉందని, ఆయనకు ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. హుదూద్ తుపాను కంటే పెద్ద తుపాను రాజకీయ తుపాను అని, ఈ తుపానులో వైసిపి బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమని చెప్పారు. కర్నూలులో అబ్దుల్ కలాం అనే వ్యక్తి తన కుటుంబంతో పాటు ఆత్మహత్య చేసుకుని చనిపోయారంటే ఈ ప్రభుత్వం ఎంత అరాచకంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఉత్తరాంధ్రతో పాటు ఇతర ప్రాంత ప్రజలకు చదువు చెబుతున్న గీతం యూనివర్సిటీ, వైద్యం అందిస్తున్న గీతం ఆస్పత్రిని జెసిబిలు పెట్టి తవ్వించడానికి ఈ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు



ఎస్.కోట, కాకినాడ జిల్లా జగ్గంపేట సభల్లో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

చేసిందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ గంజాయి, డ్రగ్స్ పట్టుబడినా విశాఖ పేరే చెబుతున్నారంటే ఈ ప్రభుత్వం ఏ స్థాయిలో గంజాయిని ప్రోత్సహిస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. మరోసారి వైసిపి అధికారంలోకి వచ్చిందంటే విశాఖను మరో పులివెందులుగా తయారు చేసి గొడ్డలి సంస్కృతిని విశాఖకు తీసుకువస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ఐటి హబ్‌లు లేకపోవడంతో మన పిల్లలు బెంగళూరు, చెన్నైకి వెళ్లిపోతున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖనే ఐటి హబ్‌గా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు. ఎస్.కోటను విశాఖ జిల్లాలో కలుపుతానని ప్రకటించారు. విశాఖ ఎంపి అభ్యర్థి శ్రీభరత్, ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలితకుమారి, రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న చంద్రబాబు దంపతులు

చంద్రబాబునాయుడు దంపతులు సోమవారం శ్రీశైల మల్లన్నను దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకొని మొక్కుబడి తీర్చుకున్నారు. అనంతరం వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను వేదపండితులు వారికి అందజేశారు.

చీమకుర్తి బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

ఇండియా వేదికతో దేశ భవిష్యత్

- బిజెపికి గులాంగిరీ చేయడానికే 'సిద్ధమా.?'
- ఎపి న్యాయ్ యాత్రలో వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - యర్రగొండపాలెం, చీమకుర్తి (ప్రకాశం జిల్లా)

ఇండియా వేదిక ద్వారానే దేశానికి భవిష్యత్తు ఉంటుందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. ఆమె చేపట్టిన ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా సోమవారం ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, పెద్దదోర్నాలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం చీమకుర్తిలో నిర్వహించిన బహిరంగ సభలో షర్మిల మాట్లాడుతూ.. 'దేనికయ్యా మీరు సిద్ధం? మెగా డిఎస్‌సి అని చెప్పి దగా చేసినందుకా.? ధరల స్థిరీకరణ నిధి అని చెప్పి రైతులను మోసం చేసినందుకా? మళ్లీ బిజెపికి గులాంగిరీ చేయడానికా? దేనికి సిద్ధం అంటూ సిఎం జగన్‌ను నిలదీశారు. మల్లవరం ప్రాజెక్టులో కొట్టుకుపోయిన గేట్లు కూడా బిగించలేని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారసులమని గొప్పలు చెప్పుకుంటున్నారని, వారసులు అని చెప్పుకునే హక్కు జగన్‌కు లేదన్నారు. వైసిపికి 25 పార్లమెంటు సీట్లు వస్తే బిజెపికి మద్దతు ఇస్తామని అంబటి రాంబాబు చెప్పడాన్ని బట్టి చూస్తే.. చీకటి ఒప్పందం బయటపడుతోందన్నారు. బిజెపి కార్పొరేట్ల తొత్తు అని విమర్శించారు. అధికారంలోకి వస్తే 23 వేల మెగా డిఎస్‌సి ఇస్తామని వాగ్దానం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఐదేళ్లయినా ఒక్క పోస్టు కూడా ఇవ్వలేదని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి, రాజధాని ఏర్పాటు, పేదలందరికి ఇళ్లు, ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి రూ.లక్ష వస్తాయన్నారు. టిడిపి, వైసిపిలు ప్రత్యేక హోదా మరిచి, బిజెపి భజనలో మునిగి తేలుతున్నాయని విమర్శించారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ ముగ్గురే అని అన్నారు. ఈ మూడు పార్టీలలో ఏ పార్టీకి ఓటు వేసినా అది బిజెపికే చేరుతుందన్నారు. మీ ఓటు డ్రెయినేజీలో వేసినట్లు అవుతుందని, ప్రజలందరూ దయచేసి ఆలోచించుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె మాబు మాట్లాడుతూ.. రాష్ట్రానికి బిజెపి తీవ్ర ద్రోహం చేసిందని, మోడీ ప్రభుత్వం ముందు వైసిపి మోకరిల్లిందన్నారు. కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరిచి ప్రజల సొమ్మును ధారాదత్తం చేస్తోందని వివరించారు. రాబోవు ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంతనూతలపాడు కాంగ్రెస్ అభ్యర్థి పాలపర్తి విజేష్‌రాజ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌పై 26 కేసులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

వైసిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై 26 కేసులు ఉన్నాయి. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా జగన్ తరపున బాబాయ్ వైఎస్.మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అఫిడవిట్‌లో పొందుపర్చిన వివరాల మేరకు జగన్‌పై పది మనీలాండరింగ్ కేసులు ఉన్నాయి. అఫిడవిట్ సమయానికి ఎటువంటి ఛార్జెస్ ఫ్రేమ్ కాలేదని పేర్కొన్నారు. సిబిఐ, ఎసిబి, హైదరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్, ఆర్‌సి నెంబర్ (ఎ) ఆఫ్ 2011 నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే సీరీస్‌లో 11 సిబిఐ, ఎసిబి కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. నంద్యాల త్రీటౌన్ పోలీస్‌స్టే షన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 192,2017, ఎఫ్ఐఆర్ 177,2017 కింద రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐ ఆర్ నెంబర్ 59, 2016 కింద కేసు, గుంటూరు జిల్లా పొన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 45, 2016, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 861, 2013 కింద కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

జగన్ ఆస్తులు రూ.483 కోట్లు

వైఎస్ జగన్ చేతిలోని చర ఆస్తుల విలువ రూ.483,08,35,064 కోట్లు, ఆయన సతీమణి భారతి పేరు మీద రూ.119,38,07,193 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు జగన్ స్థిర ఆస్తులు రూ.9,98,57,036 కోట్లు, భారతి పేరు మీద రూ.2,07, 90,821 కోట్లుగా చూపించారు. ప్రస్తుతం జగన్ చేతిలో రూ. ఏడువేలు, భారతి చేతిలో రూ.10,200 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు డిపాజిట్స్, ఎఫ్‌డిఆర్ టర్మ్ సహా అన్ని రకాల డిపాజిట్స్, సేవింగ్స్ ఇతర పెట్టుబడులను లెక్కిస్తే రూ. 263,64,92, 685 కోట్లు ఉన్నట్లుగా చూపించారు. భారతికి రూ.6,427.79 గ్రామ్స్ గోల్డ్ అండ్ డైమండ్స్ విలువ రూ. 5,29,87,319 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. వీటితోపాటు మార్కెట్ విలువ ప్రకారం రూ.1,54,12,800 విలువ కలిగిన వ్యవ సాయ భూములు ఉన్నాయి. వీటికి అదనంగా రూ.11,03,13,280 కోట్లు విలువ కలిగిన వ్యవసాయేతర ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. రెసిడెన్సియల్ ఆస్తులు రూ.13,29,46,700 కోట్లు వెరసి మొత్తం రూ.46,78,89, 930 కోట్లుగా చూపించారు.

శిరోముండనంపై తీర్పును రద్దు చేయాలని పిల్

ప్రజాశక్తి-అమరావతి

దళిత యవకుల శిరోముండనం కేసులో విశాఖపట్నం ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహా 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమను దోషిగా నిర్ధారించి ఏడాదిన్నరపాటు జైలుశిక్ష విధించిన కోర్టు తీర్పును వారు వేర్వేరుగా క్రిమినల్ అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిని అత్యవసరంగా విచారణ చేయాలని జస్టిస్ అడుసుమిల్లి వెంకట రవీంద్ర బాబును పిటిషనరు తరపున న్యాయవాది కోరారు. అత్యవసర విచారణ అవసరం లేదని, కింది కోర్టు తీర్పు అమలును నెల రోజులపాటు నిలుపుదల చేసిందని జడ్జి గుర్తు చేశారు. మంగళవారం విచారణ జరుపుతామని చెప్పారు. 1996లో నేరం జరిగితే 2016లో వచ్చిన సవరణ చట్టం ఆధారంగా ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించిందని, 2016 చట్టం పూర్వ నేరాలకు వర్తించదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రత్యేక కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరారు.

వలంటీర్ల రాజీనామాలను ఆమోదించొద్దని పిల్

చట్టసభలకు ఎన్నికలు ముగిసేంత వరకు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలంటూ భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ హైకోర్టులో వ్యాజ్యా న్ని దాఖలు చేశారు. దీనిని విచారణ చేపట్టాల ని జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఎదుట పిటిషనర్ న్యాయవాది కోరారు. మంగళవారం విచారిస్తామని జడ్జి ప్రకటించారు.

సాగర్ కాలువలో ముగ్గురు మృతి

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - నాదెండ్ల (పల్నాడు జిల్లా)

ఈతకెళ్లి ముగ్గురు యువకులు మృత్యువాత పడిన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట మండలం ములకలూరుకు చెందిన చలమల రాజు (20), గేరా పురుషోత్తం (20), బోరుగడ్డ ఆకాష్ (21) కూలి పనులు చేస్తుంటారు. స్నేహితులైన వీరు ముగ్గురూ ఆదివారం నాదెండ్ల మండలంలోని ఎండుగుంపాలెంలో ఓ వేడుకకు ద్విచక్ర వాహనంపై వచ్చారు.

మృతదేహాన్ని వెలికి తీస్తున్న స్థానికులు

సాయంత్రం వేళ ఈతకోసమని కనపర్రు-బుక్కాపురం గ్రామాల మధ్య ఉన్న ఎన్ఎస్‌పి కాల్వకు వెళ్లారు. సోమవారం ఉదయం అటుగా పొలాలకు వెళ్తున్న వారికి కాల్వలో ఒక మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. ఆ ప్రదేశంలో ద్విచక్ర వాహనంతోపాటు ముగ్గురి దుస్తులు, చెప్పులు ఉండడంతో గాలింపు చేపట్టగా మరో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బలరాంరెడ్డి తెలిపారు.

అసెంబ్లీకి నామినేషన్ల జోరు

ప్రజాశక్తి- యంత్రాంగం

అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు సోమవారం జోరందుకున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో 28 నామినేషన్లు పడ్డాయి. శాసనసభ స్పీకర్, వైసిపి ఆమదాలవలస అభ్యర్థి తమ్మినేని సీతారాం, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రి, వైసిపి పలాస అభ్యర్థి సీదిరి అప్పలరాజు నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. నెల్లూరు జిల్లాలో 40 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్వేపల్లి నుంచి వైసిపి అభ్యర్థి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నుంచి టిడిపి అభ్యర్థి పి.నారాయణ నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు. చిత్తూరు జిల్లాలో 32, తిరుపతి జిల్లాలో 41 నామినేషన్లు దాఖలయ్యాయి. కర్నూలు జిల్లా పాణ్యం నుంచి ఇండియా వేదిక తరపున సిపిఎం అభ్యర్థి గౌస్ దేశాయ్, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నుంచి సిపిఎం అభ్యర్థి లోతా రామారాజు నామినేషన్లు వేశారు. అనకాపల్లి జిల్లాలో 12, అల్లూరి జిల్లాలో 13, విశాఖ జిల్లాలో 22 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రకాశం జిల్లాలో 44 నామినేషన్లు పడ్డారు. రాష్ట్ర మంత్రి సురేష్ కొండపి నుంచి వైసిపి తరపున నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు జిల్లాలో 18, పశ్చిమగోదావరి జిల్లాలో 12 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉండి టిడిపి అభ్యర్థిగా రఘురామ కృష్ణంరాజు నామినేషన్ వేశారు. గుంటూరు జిల్లాలో నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఇండియా వేదిక తరపున మంగళగిరి నుంచి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మస్తాన్ వలి ఉన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నుంచి టిడిపి తరపున మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్ఆర్ జిల్లాలో 33 నామినేషన్లు దాఖలయ్యాయి. పులివెందుల నుంచి వైసిపి అభ్యర్థిగా సిఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తరపున ఆయన బాబాయ్ మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అన్నమయ్య జిల్లాలో పది నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో 33, కృష్ణా జిల్లాలో 28 నామినేషన్లు పడ్డాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 30 నామినేషన్లు దాఖలయ్యాయి. అమలాపురం నుంచి వైసిపి అభ్యర్థి మంత్రి పినిపే విశ్వరూప్ నామినేషన్ దాఖలు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 16; కాకినాడ జిల్లాలో 14 నామినేషన్లు దాఖలయ్యాయి. తుని నుంచి టిడిపి అభ్యర్థిగా యనమల దివ్య, పిఠాపురం నుంచి వంగా గీతా, కాకినాడ రూరల్ నుంచి మాజీ మంత్రి కురసాల కన్నబాబు, పెద్దాపురం నుంచి నిమ్మకాయల చినరాజప్ప నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. విజయనగరం జిల్లాలో 18, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

రంపచోడవరంలో రామారావు నామినేషన్ ప్రదర్శనలో వి.శ్రీనివాసరావు, ఇండియా వేదిక నాయకులు

ఏజెన్సీ దోపిడీదారులను తరిమికొట్టండి

- బిజెపి పల్లకి మోసే టిడిపి, వైసిపిలకు ఓట్లడిగే అర్హత లేదు : వి.శ్రీనివాసరావు
- ఉత్సాహంగా సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు నామినేషన్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, రంపచోడవరం

గిరిజన సమస్యల పరిష్కారంతో పాటు రాజ్యాంగ హక్కులను, చట్టాలను కాపాడుకోవాల్సిన కర్తవ్యం ప్రతి ఒక్కరిపైనా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏజెన్సీ దోపిడీదారులను తరిమికొట్టి పోరాట యోధులైన సిపిఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తమ అభ్యర్థులకు మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య స్ఫూర్తి అని వివరించారు. ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో గిరిజన సంప్రదాయ కొమ్ము, డోలు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది కార్యకర్తలు ఎర్రజెండాలతో నిర్వహించిన కవాతు ప్రజలను ఆకట్టుకుంది. వి.శ్రీనివాసరావు, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స ప్రచార వాహనం పై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ప్రదర్శన చేపట్టారు. అనంతరం కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభకు పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి అభ్యర్థుల జాబితాను చూస్తే దొంగల ముఠాలా ఉందని విమర్శించారు. ఆ పార్టీ అరకు అభ్యర్థి కొత్తపల్లి గీత ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఈ ఎన్నికల్లో సాగనంపాలని పిలుపునిచ్చారు. వందల కోట్ల రూపాయలు ప్రజలపై వెదజల్లి మళ్లీ అధికారం చేపట్టి పన్నులు, ధరల రూపంలో ప్రజల జేబులు కొల్లగొట్టడంతోపాటు సహజ వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయని విమర్శించారు. పోరాడి సాధించుకున్న గిరిజన చట్టాలకు పదేళ్లలో బిజెపి పూర్తిగా తూట్లు పొడిచిందని, ఆ పార్టీకి మద్దతు తెలిపిన వైసిపి, టిడిపి, జనసేనలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని అన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాల నిర్వాకం ఫలితంగా పోలవరం ప్రాజెక్టు కాళేశ్వరం కంటే బలహీనంగా మారిందని వివరించారు. ప్రాజెక్టుకు ప్రమాదం జరిగితే గిరిజన ప్రాంతాలతోపాటు ఉభయగోదావరి జిల్లాలు పూర్తిగా ముంపునకు గురవడం ఖాయమని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టును నిర్మించిన కాంట్రాక్టు సంస్థ నుంచి బిజెపి, టిడిపి, వైసిపిలకు వెయ్యి కోట్లు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో అందాయని తెలిపారు. పోలవరం నిర్వాసితుల హక్కులు, ఆదివాసీల చట్టాల కోసం సిపిఎం చేసిన పోరాటాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సిపిఎం భద్రాచలం మాజీ ఎంపి మిడియం బాబూరావు మాట్లాడుతూ ఏజెన్సీ పెద్ద దొంగ అనంతబాబు అని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి వరదలు మూడేళ్లపాటు వరుసగా ఈ ప్రాంతాన్ని ముంపునకు గురిచేసినా టిడిపి, వైసిపి ప్రజా ప్రతినిధులెవరూ పట్టించుకోలేదని గుర్తు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు సిపిఎంపై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ సిపిఎం గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, నాయకులు దడాల సుబ్బారావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, పలు ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న గౌస్‌దేశాయి, పక్కన ఎం.ఎ.గఫూర్, లక్ష్మీనరసింహయాదవ్ తదితరులు

మోడీతో బాబు, జగన్ రాజీ

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్
- అట్టహాసంగా పాణ్యం సిపిఎం అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీతో చంద్రబాబు, జగన్ రాజీ పడుతున్నారని, వారితో పోరాడుతున్న సిపిఎంను గెలిపించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ కోరారు. పాణ్యం అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ సోమవారం భారీ ప్రదర్శనతో కర్నూలు కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. తొలుత చెన్నమ్మ సర్కిల్ నుంచి ఐటిసి, కృష్ణానగర్, బిర్లాగేట్, గాయత్రి ఎస్టేట్, వినాయక ఘాట్ మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. నామినేషన్ అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మీడియాతో మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గం చాలా వెనకబడిన ప్రాంతమని, కల్లూరు అర్బన్ పరిధిలో తాగడానికి మంచినీళ్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప టిడిపి, వైసిపికి మరో అజెండా లేదని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం టిడిపి, వైసిపిలు ఏం చేశాయని ప్రశ్నించారు. మోడీని ఇంటిని పంపేందుకే 28 పార్టీలు ఇండియా వేదికగా ఏర్పడ్డాయని చెప్పారు. రూ.12 లక్షల కోట్లు అప్పు తెచ్చి 2.70 లక్షల కోట్లకు బటన్ నొక్కారని, మిగిలిన రూ.9 లక్షల కోట్లు ఎవరి కోసం బటన్ నొక్కారని సిఎం జగన్‌ను ప్రశ్నించారు. నంద్యాల కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి, డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ.. అధికారం ఉన్నా లేకున్నా పోరాటం చేసే వ్యక్తి గౌస్ దేశాయ్ అని, అలాంటి వ్యక్తికి ఓట్లేసి గెలిపించాలని కోరారు. హోదా వచ్చి ఉంటే రాయలసీమకు పరిశ్రమలు వచ్చేవని, విభజన హామీలను సాధించడంలో టిడిపి, వైసిపి విఫలం చెందాయని విమర్శించారు. సిపిఎం పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా పాణ్యం నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఇండియా వేదికగా కృషి చేస్తామని, సోలార్, ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం కోసం పోరాడతామని హామీ ఇచ్చారు. నామినేషన్ ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, పి.నిర్మల, సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, సిపిఐ జిల్లా నాయకులు జగన్నాథం పాల్గొన్నారు.

20 రోజులు పరీక్షా కాలం

- బ్యాంకుల్లో లావాదేవీలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

ప్రజాశక్తి - ఏలూరు

బ్యాంకుల్లో అధిక మొత్తంలో జరిగే నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై నిఘా ఉంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనానిగమ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో వివిధ ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు, వ్యయ పరిశీలకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నీనా నిగమ్ మాట్లాడుతూ ముఖ్యంగా బ్యాంకుల్లో అధిక నగదు మొత్తాల లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తంగా పని చేస్తున్నప్పటికీ మరింత నిఘా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఏదైనా నగదు, ఇతర వస్తువులు పట్టుబడినప్పుడు అందుకు సంబందించిన దర్యాప్తు వేగవంతంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. పోస్టల్ ఆర్డర్లు, యుపిఐ పేమెంట్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. మద్యం రవాణా సమయంలో సక్రమమైన సమయంలో చేరాల్సిన చోటుకు చేరిందా లేదా అనేది పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి, మే, 13న నిర్వహించే సాధారణ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో డిపాజిట్లు, నగదు ఉపసంహరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడైనా అనుమానాస్పద కేసులు గమనిస్తే, వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ)

అయోధ్యనగర్ బ్రాంచి : డోర్ నెం. 18-1-34, ప్రభాస్ కాలేజి బిల్డింగ్, సి.కె. రెడ్డి రోడ్డు, కేదారేశ్వరపేట, విజయవాడ - 520003

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

RULE 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ & ఇంటరస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అయోధ్యనగర్ బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (2)కు అనుబంధమైన రూల్ 9 ప్రకారము సంక్రమించిన అధికారము లతో **ఋణగ్రహీతలు : శ్రీమతి ద్వారక పాలడుగు, శ్రీ పాలడుగు ఇలియ (సహ ఋణగ్రహీత), శ్రీ కోట మణిరాజు (హామీదారు) మరియు శ్రీమతి పి. సుగుణమ్మ (హామీదారు), శ్రీమతి ముప్పాల శ్రీలత, శ్రీమతి ముప్పాల స్వర్ణలత, శ్రీమతి కనపాల హేమలత** వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 10,19,657.80/- (అక్షరాలా పది లక్షల పంధొమ్మిది వేల ఆరు వందల యాభై ఏడు రూపాయల ఎనభై పైసలు మాత్రమే)** మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 15-02-2024న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము **తేది. 18-04-2024** న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవిలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అయోధ్యనగర్ బ్రాంచి వారికి ది. 29-05-2023 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 10,19,657.80/- (అక్షరాలా పది లక్షల పంధొమ్మిది వేల ఆరు వందల యాభై ఏడు రూపాయల ఎనభై పైసలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుభందమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

శ్రీమతి ద్వారకా పాలడుగు గారి పేరిట విజయవాడ, అజిత్‌సింగ్ నగర్, మసీదు వీధి, ఆర్.ఎస్.నెం. 17 వద్ద అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 25 చ॥గ॥లతో కలిపి మొత్తం 266.66 చ॥గ॥లు అందలి నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ నందు నివాస ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్-1. **ఫ్లాట్‌కి హద్దులు : ఉత్తరం** : శూన్యాకాశము, **తూర్పు** : ఫ్లాట్ నెం. ఎఫ్‌ఎఫ్-2, **పడమర** : శూన్యాకాశము, **దక్షిణం** : కామన్ కారిడార్ & మెట్లు.

తేది : 18-04-2024
స్థలం : విజయవాడ

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా బహిరంగ ప్రకటన ఇవ్వడమేమనగా, నా క్లయింట్ మెసర్స్ ప్రొఫెక్టస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్, దీని రిజిస్టర్డు ఆఫీసు: బి/17, 4వ అంతస్తు, ఆర్ట్ గ్యాల్డ్ హౌస్, ఫోనిక్స్ మార్కెట్ సిటీ మాల్, లాల్ బహదూర్ శాస్త్రి మార్గ్, కుర్ల (వెస్ట్), ముంబయి-400070 (లెండర్/మార్ట్‌గేజీ) వద్ద కలిగియుండి **శ్రీ సాయి సుధ ఎడ్యుకేషనల్ సొసైటీ** (రుణగ్రహీత) మరియు శ్రీమతి సిరిపురపు సుధారాణి, భర్త వీర వెంకట గంగ ప్రకాశ్ మరియు శ్రీ సిరిపురపు వీర వెంకట గంగ ప్రకాశ్ తండ్రి అప్పారావు (సహ-రుణగ్రహీత)/ తాకట్టుదారు)కు ఇందు దిగువ షెడ్యూలులో వ్రాసిన (సదరు ఆస్తి)లో మరింత విపులంగా వివరించిన ఆస్తి తాకట్టు యొక్క తాకట్టు షరతులపై రుణ సదుపాయం మంజూరుచేశాము. తాకట్టుదారు ఆమోదించి మరియు ఎస్ఆర్ఓ పెద్దాపురం వద్ద సేల్ డీడ్ పత్రం నం.లు 3186/2021, 3187/2021, 3188/2021 తేది: 04.08.2021 ఆధారంగా నా క్లయింట్ సదరు ఆస్తిని కేవలం అతని స్వంతంగా మరియు తాకట్టుపెట్టారు వారు: (1) శ్రీ గున్నం వెంకటేశ్వర రావు తండ్రి (కీ॥శే॥) సత్యనారాయణ మూర్తి మరియు అతని కుమారుడు& కూతురు (2) గున్నం సతీష్ బాబు (3) శ్రీమతి సుంకర శ్రీదేవి భర్త నంద గోపాల్ కృష్ణ (4) శ్రీ గున్నం సూరి బాబు తండ్రి (కీ॥శే॥) సత్యనారాయణ మూర్తి మరియు అతని కుమారులు (5) గున్నం సత్యసాయి ప్రసాద్ (6) గున్నం శివ ఫణీంద్రనాథ్ (7) శ్రీమతి గున్నం మహాలక్ష్మి భర్త (కీ॥శే॥) రామారావు (8) శ్రీ గున్నం లక్ష్మీనారాయణ తండ్రి (కీ॥శే॥) రామారావు అనువారు, వీరి పేరున (1) శ్రీమతి కొత్త మాణిక్యం భర్త వెంకట్‌రావు (2) శ్రీ బవిశెట్టి శ్రీను తండ్రి సుబ్బారావు, అప్పుడు శ్రీమతి కొత్త మాణిక్యం భర్త వెంకట్ రావు షెడ్యూలు ఆస్తిపై లెలిక్విష్ట్ ఆమె 1/2 విడదీయలేని భాగం మరియు ఎస్.ఆర్.ఓ. పెద్దాపురం (తాకట్టుదారు) ఫైల్ పై రిజిస్టర్డు రిలింక్విష్‌మెంట్ డీడ్ నం.9871/2022 తేది: 14.12.2022 ద్వారా శ్రీ వావిశెట్టి శ్రీను తండ్రి సుబ్బారావు పేరున దానిని బదిలీచేయుట జరిగింది.

తాకట్టుదారు తదుపరి ఆమోదం, ప్రకటన మరియు నా క్లయింట్‌కు హామీ ఇచ్చినది ఏమనగా, సదరు ఆస్తి ఏదేని తాకట్టు, లీజు, లోన్, హామీ, నష్టం, సక్సెషన్, రిజర్వేషన్, అక్విషేషన్, రిక్విషిషన్ లేదా ఇతర ఏదేని విధానాలలో కలిసి లేదు మరియు రుణభారాలన్నింటి నుండి విముక్తి కలిగియుండి మరియు క్లీన్ మరియు మార్కెటబుల్ టైటిల్ & సదరు ఆస్తితో లావాదేవీలు మరియు తాకట్టుకు ప్రత్యేక హక్కులు కలిగియుంది.

కావున ఏదేని వ్యక్తి(లు) సదరు ఆస్తికు సంబంధించిన ఏదేని హక్కు, టైటిల్, ఇంటెరెస్ట్ లేదా ఏదేని భాగంలో అమ్మకం, గిఫ్ట్, లీజు, ఇన్‌హెరిటెన్స్, ఎక్చేంజి, తాకట్టు, చార్జ్, లైన్, ట్రస్ట్, బెనెఫిషల్ ఇంటెరెస్ట్, స్వాధీనం, ఈసిమెంట్, టెనన్సి, సబ్-టెనన్సి, లైసెన్స్, హైపోతికేషన్, మెయిటెనన్స్, ఇన్‌హెరిటెన్స్, పవర్ ఆఫ్ అటార్నీ, ఆర్డర్, డిక్రీ, అవార్డు అటాచ్‌మెంట్ లేదా ఇతర రూపంలో ఏదేని లేదా క్లెయిం కలిగియున్నచో, వారు ఇందు గల తేదీ నుండి 14 రోజుల్లోగా క్రింది సంతకందారు చిరునామా వద్ద మద్దతు పత్రాలతోపాటు వ్రాతపూర్వకంగా సంప్రదించవలసిందిగా, ఇందుమూలంగా కోరబడుచున్నది, విఫలం చెందినట్లైతే, ఏదైతే నా క్లయింట్ అట్టి క్లెయిం ఇతరులు ఎవరూ కలిగిలేరని భావించి, లోన్ తీసుకొనుటకు ముందుకు సాగుతారు మరియు దానిని వారు కబ్జాలో ఉందురు.

షెడ్యూలు

తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ఎస్ఆర్ఓ పెద్దాపురం పరిధిలో పెద్దాపురం మున్సిపాలిటీ& మండలంలో గల గున్నం వారి లేన్, వార్డు నం.11, పాత అసెస్మెంట్ నం.542, కొత్త అసెస్మెంట్ నం.1062011925; పాత డోర్ నం.14-7-22, కొత్త డోర్ నం.14-7-21/2, టి.ఎస్.నం.3-17-901 లో 8 ప్రతీల తో కలిగియున్న 912.831చ.గ.లు లేదా 763.218చ.మీ.ల విస్తీర్ణంతో ఖాళీ నివాసిత సైటు. మరియు సరిహద్దులు: **షెడ్యూలు:** 1వ ప్రతి: 300.875చ.గ.లు, **తూర్పు:** తోటకూర వారి కొంత భాగపు ల్యాండ్, కొంత భాగపు చల్లా వారి ల్యాండ్ 43.5"అ.లు, **దక్షిణం:** 2వ ప్రతి 62.0"అ.లు, **పడమర:** తనుకు వీర్రాజు కొంత భాగపు ల్యాండ్, చల్లా దొరయ్య యొక్క కొంత భాగం ల్యాండ్ 43.5"అ.లు, **ఉత్తరం:** మున్సిపాలిటీ దారి 62.5"అ.లు.

2వ ప్రతి: 236.708చ.గ.లు: తూర్పు: తోటకూర వారి కొంత భాగం ల్యాండ్, చల్లా వారి కొంత భాగం ల్యాండ్ 34.5"అ.లు, దక్షిణం: 5వ ప్రతి ల్యాండ్ 61.6"అ.లు, పడమర: 3వ & 4వ ప్రతి ల్యాండ్ 34.5"అ.లు, ఉత్తరం: 1వ ప్రతి ల్యాండ్ 62.0"అ.లు.

3వ ప్రతి: 15.488చ.గ.లు: తూర్పు: 2వ ప్రతి ల్యాండ్ 16.2"అ.లు, దక్షిణం: 4వ ప్రతి ల్యాండ్ 8.5"అ.లు, పడమర: తనుకు వీర్రాజు యొక్క కొంత భాగం ల్యాండ్, చల్లా దొరయ్య కొంత భాగం ల్యాండ్ 16.6"అ.లు, ఉత్తరం: తనుకు వీర్రాజు యొక్క కొంత భాగం ల్యాండ్, పెద్దిరెడ్డి కొంత భాగం ఇల్లు, మున్సిపల్ లేన్ కొంతభాగం 8.8"అ.లు.

4వ ప్రతి: 47.66చ.గ.లు: తూర్పు: 2వ ప్రతి ల్యాండ్ 16.6"అ.లు, దక్షిణం: 8వ ప్రతి ల్యాండ్ 24.6"అ.లు, పడమర: తనుకు వీర్రాజు యొక్క కొంత భాగం ల్యాండ్, చల్లా దొరయ్య కొంత భాగం ల్యాండ్ 16.6"అ.లు, ఉత్తరం: 3వ ప్రతి ల్యాండ్ 27.6"అ.లు.

5వ ప్రతి: 174.825చ.గ.లు: తూర్పు: తోటకూర వారి కొంత భాగం ల్యాండ్, చల్లా వారి కొంత భాగం ల్యాండ్ 26.4"అ.లు, దక్షిణం: 6వ&7వ ప్రతిల ల్యాండ్స్ 60.0"అ.లు, పడమర: 8వ ప్రతి ల్యాండ్ 25.4"అ.లు, ఉత్తరం: 2వ ప్రతి ల్యాండ్ 61.6"అ.లు.

6వ ప్రతి: 27.133చ.గ.లు: తూర్పు: తోటకూర వారి కొంత భాగం ల్యాండ్, చల్లా వారి కొంత భాగం ల్యాండ్, దక్షిణం: కాకినాడ వీర్రాజు, అడప వెంకట లక్ష్మిల ల్యాండ్స్ 32,0"అ.లు, పడమర: 7వ ప్రతి ల్యాండ్ 20.8"అ.లు, ఉత్తరం: 5వ ప్రతి ల్యాండ్ 23.6"అ.లు.

7వ ప్రతి: 49.065చ.గ.లు: తూర్పు: 6వ ప్రతి 20.8"అ.లు, దక్షిణం: కాకినాడ వీర్రాజు, అడప వెంకట లక్ష్మి ల్యాండ్స్ 46.6"అ.లు, పడమర: ప్రహరీ లేదు, ఉత్తరం: 5వ ప్రతి ల్యాండ్ 42.6"అ.లు.

8వ ప్రతి: 61.077చ.గ.లు: తూర్పు: 5వ ప్రతి 25.4"అ.లు, దక్షిణం: కాకినాడ వీర్రాజు, అడప వెంకట లక్ష్మి ల్యాండ్స్ 21.5"అ.లు, పడమర: తనుకు వీర్రాజు కొంత భాగం ల్యాండ్, చల్లా దొరయ్య కొంత భాగం ల్యాండ్, 22.4"అ.లు, ఉత్తరం: 4వ ప్రతి ల్యాండ్ 24.6"అ.లు.

అడ్వకేట్: శ్రీ వి. దయాసాగర్
చిరునామా: ఫ్లాట్ నం.4, హెచ్ఐజి-2, బి14, వీధి నం.2, హెచ్‌డిఎఫ్‌సి ఏటియం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 044. మొబైల్: 9849642258, 7995495439. ఇ-మెయిల్ ఐడి: <sagar.associates@rocketmail.com>

జెఎమ్ ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్

JM FINANCIAL HOME LOANS

కార్పొరేట్ కార్యాలయం : 3వ అంతస్తు, సౌషిష్ ఐటి పార్క్, ప్లాట్ నం.68ఇ, ఆఫ్ దత్తా పదా రోడ్డు, బోరివలి తూర్పు ముంబై-400066.

డిమాండ్ నోటీసు

దిగువసంతకందారు అయిన జెఎమ్ ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్ (జెఎమ్ఎఫ్‌హెచ్ఎల్ఎల్) యొక్క అధీకృత అధికారి రూల్స్ యొక్క రూల్ 3తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది.

రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు) (అందరూ ఒకరిగా లేదా కలిసి "ఆబ్లిగర్స్")/చట్టపరమైన వారసుడు(లు)/చట్టపరమైన ప్రతినిధులను పిలిచి, దిగువ ఇవ్వబడిన వివరాల ప్రకారం సంబంధిత నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలని కోరడమైనది. పేర్కొన్న నోటీసుల కాపీలు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా అందించబడతాయి మరియు దిగువసంతకందారు వద్ద అందుబాటులో ఉంటాయి మరియు పేర్కొన్న ఆబ్లిగర్(లు)/చట్టపరమైన వారసుడు(లు)/చట్టపరమైన ప్రతినిధు(లు), వారు కావాలనుకుంటే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినం దిగువసంతకందారు వద్ద సంబంధిత కాపీని సేకరించవచ్చు.

పైన పేర్కొన్న వాటికి సంబంధించి, జెఎమ్ఎఫ్‌హెచ్ఎల్ఎల్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని సంబంధింత నోటీసుల తేది నుండి 60 రోజులలోపు చెల్లించాలని మరలా పేర్కొన్న ఆబ్లిగర్(లు)/చట్టపరమైన వారసుడు(లు)/చట్టపరమైన ప్రతినిధు(లు)కు నోటీసు ఇవ్వడమైనది. క్రింద పేర్కొన్న వారి పేర్లకు వ్యతిరేకంగా ఇక్కడ సూచించిన మొత్తం, దిగువ కాలమ్‌లో పేర్కొన్న తేదీల నుండి చెల్లింపు మరియు / లేదా రియలైజ్ అయ్యే తేదీ వరకు మరింత వడ్డీతో పాటు, పేర్కొన్న ఆబ్లిగర్(లు) ద్వారా అమలు చేయబడిన రుణ ఒప్పందం మరియు ఇతర పత్రాలు/వ్రాతలు ఏవైనా ఉంటే చదవండి. రుణం యొక్క బకాయి తిరిగి చెల్లించడానికి సెక్యూరిటీగా, పేర్కొన్న ఆబ్లిగర్(లు) ద్వారా క్రింది సెక్యూర్డ్ అసెట్స్ వరుసగా జెఎమ్ఎఫ్‌హెచ్ఎల్ఎల్‌కి తనఖా పెట్టబడ్డాయి.

రుణగ్రహీత(లు)/ హామీదారు(లు) పేరు/లోన్ ఎకౌంట్ నంబరు	ఆస్తి వివరణ	నోటీసు 13(2) తేది ఎన్‌పిఎ తేది తేది నాటికి బకాయి మొత్తం
1. శ్రీ.సిర్రా రాజు, 2. శ్రీమతి. ముప్పిడి సోని, చిరునామా : డో.నం.21-9/3-16/1, 2వ లైన్, పసుపుతోట, కృష్ణ, మధురానగర్, సత్యనారాయణపురం, విజయవాడ (అర్బన్) ఆంధ్రప్రదేశ్, 520011. **లోన్ ఎకౌంట్ నంబరు :** HVIJ21000018051 **మంజూరైన మొత్తం :** రూ.18,65,883/-	ఆంధ్రప్రదేశ్-521212, కృష్ణ, కృష్ణాజిల్లా, విజయవాడ రూరల్ మండలం, పాతపాడు గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఇల్లు ఆర్.ఎస్.నం.153/ 11సి (ట్యాక్స్ రసీదు ప్రకారం డో.నం.1-412, మూల్యాంకనం నం.412)	1. 15-ఏప్రిల్-2024 2. 12-ఏప్రిల్-2024 **3. రూ.19,37,036/- (పంతొమ్మిది లక్షల ముప్పై ఏడు వేల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే) 15.04.2024 నాటికి బకాయి**

తదుపరి వడ్డీతో పాటు, పైన పేర్కొన్న సంబంధిత డిమాండ్ నోటీసులలో ప్రత్యేకంగా పేర్కొన్న విధంగా అదనపు వడ్డీ, యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, చెల్లింపు మరియు/లేదా రియలైజేషన్ తేదీ వరకు జరిగిన ఛార్జీలు మొదలైనవి. సదరు అబ్లిగర్స్ జెఎమ్ఎఫ్ఎల్ఎల్‌కు మొత్తాన్ని చెల్లించలేకపోతే, జెఎమ్ఎఫ్ఎల్ఎల్ ద్వారా చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తులు వ్యతిరేకంగా చర్యలు తీసుకొనబడుతాయి మరియు వర్తింపబడు నియమాలు, సంబంధిత ఆబ్లిగర్(లు)/చట్టపరమైన వారసుడు(లు)/చట్టపరమైన ప్రతినిధు(లు) ఖర్చులు మరియు పర్యావసనాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. సదరు ఆబ్లిగర్(లు)/చట్టపరమైన వారసుడు(లు)/చట్టపరమైన ప్రతినిధు(లు) పేర్కొన్న చట్టం క్రింద సదరు సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తులను, అమ్మడంగాని, లీజుకు గాని లేదా జెఎమ్ఎఫ్ఎల్ఎల్‌కు ముందుగా తెలియకుండా బదిలి చేయుట నుండి నిషేధించబడ్డారు. ఎవరైన వ్యక్తి చెప్పిన తయారు చేయబడిన చట్టం లేదా నియామాలు క్రింద నేరానికి పాల్పడిన లేదా ఉల్లంఘించిన వారికి చట్టబద్ధంగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడుతుంది.

ప్రదేశం: విజయవాడ, ఆంధ్రప్రదేశ్
తేది: 23.04.2024

సం/- అధీకృత అధికారి
జెఎమ్ ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్

ORIX

ఒరిక్స్ లీజింగ్ & ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

(గతంలో ఓఏఐఎస్ ఆటో ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా తెలిసినది) (ఒరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క సబ్సిడరీ)
రిజిష్టర్డు ఆఫీసు: ప్లాట్ నెం.94, మారోల్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ఆంధేరి-కూర్ల రోడ్, ఆంధేరి (ఇ), ముంబయి-400059.
Tel.: + 91 22 28595093/6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937

అనుబంధం-4-ఏ (రూల్ 8(6) నియమం చూడండి)
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నియమంతో చదవగల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు)మరియు హామీదారుకు ప్రకటన ఇవ్వడమేమనగా సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన/ చార్జ్‌చేసిన దిగువ వివరించిన స్థిరాస్తిని, ఒరిక్స్ లీజింగ్& ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనంలోకి తీసుకోబడినవి, వాటిని దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతల నుండి ఒరిక్స్ లీజింగ్& ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ వారికి దిగువ బకాయి మొత్తాల రికవరీ కొరకు **15-05-2024**న "ఎక్కడ ఏలా ఉన్నది మరియు అక్కడ అలాగే ప్రతిపాదిక" బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును. దిగువ పేర్కొన్న రిజర్వు ధర మరియు ధరావత్తు (ఇఎండి) వివరాలు దిగువ ఇవ్వబడినవి.

రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతల పేరు / బాకీపడిన మొత్తం / డిమాండ్ నోటీసు తేది	ఆస్తి వివరాలు	రిజర్వు ధర (రూ.) / ఈఎండి / బిడ్ పెంపుదల మొత్తం
• మెసర్స్ సూపర్‌విజ్ ప్రొఫెషనల్ ప్రైవేట్ లిమిటెడ్ • మామిడి AVNVA గుప్తా • మామిడి లక్ష్మి వెంకట • నాగ దమయంతి / 15.04.2024 నాటికి రూ.3,06,20,907.64/- / డిమాండ్ నోటీసు తేది: 29.10.2021	ఎన్‌టిఎస్ ఎం.452, అసిస్ట్ నెం.25844 (పాతది), 215016 (కొత్తది), వార్డు నెం.24 (పాతది) 28 (కొత్తది), రెవెన్యూ వార్డ్ నెం.10, బ్లాక్ నెం.19, డోర్ నెం.39-1-89, కళ్యాణ్ బిల్డింగ్స్, వర లక్ష్మిరోడ్ (టెంపుల్ స్ట్రీట్) కార్నర్ బిల్డింగ్, లబ్బీపేట్, విజయవాడ (అర్బన్), ఆంధ్రప్రదేశ్-520010, విస్తీర్ణం 2857చ.అ.ల (కార్పెట్ ఏరియా), మరియు సరిహద్దులు: **తూర్పు: జి.జయశ్రీ షెడ్యూల్డ్-సి పార్టిషన్ 288/ 1970, పడమర: వరలక్ష్మి వీధి మున్సిపల్ రోడ్, ఉత్తరం: మహాత్మా గాంధీ (బందర్ రోడ్) మున్సిపల్ రోడ్, దక్షిణం: నాగ దమయంతి ఆస్తి.**	**రూ.2,00,00,000/-** (రూపాయలు రెండు కోట్లు మాత్రమే) / **ధరావత్తు 10%**- రూ.20,00,000/- (రూపాయలు ఇరవై లక్షలు మాత్రమే) / **బిడ్ పెంపుదల మొత్తం**-రూ.50,000/- (రూపాయలు యాభైవేలు మాత్రమే)
• కొల్లి సీతారాం • కొల్లి శ్రీదేవి • మెసర్స్ గీత శ్రీ ఎలక్ట్రానిక్స్ / 15.04.2024 నాటికి రూ.1,45,28,397.09/- / డిమాండ్ నోటీసు తేది: 18.01.2022	నివాసిత ఆస్తి, డోర్ నెం.49-2-61/ఏ, ఆర్.ఎస్.నెం.267/2, 3, పాత అసిస్ట్ నెం.38862/1, కొత్త అసిస్ట్ నెం.286295, ఊర్మిళానగర్, కృష్ణ హోటల్ సెంటర్ దగ్గర, గుణదల, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ, కృష్ణా జిల్లా-520004, ప్లాట్ ఏరియా 360చ.గ.లు అనగా 301.01చ.మీ.ల సైట్. సరిహద్దులు: **తూర్పు: కల్లేపల్లి సూర్యనారాయణరాజు ఆస్తి 65'0", పడమర: 12' వెడల్పాటి రోడ్డు 65'0', ఉత్తరం: పి.డబ్ల్యు.డి.ఆస్తి 50'0", దక్షిణం:15' వెడల్పు రోడ్డు 50'0"**	**రూ.1,00,03,500/- (రూపాయలు ఒకకోటి మూడువేల ఐదువందలు మాత్రమే)** / **ధరావత్తు 10%**- రూ.10,00,350/- (రూపాయలు పదిలక్షల మూడువందల యాభై మాత్రమే) / **బిడ్ పెంపుదల మొత్తం**-రూ.50,000/- (రూపాయలు యాభైవేలు మాత్రమే)
• ఎ. క్రిష్ణరావు • అన్నం వీరమ్మ • మెసర్స్ శ్రీ సాయి వీర క్రిష్ణ ఇండస్ట్రీస్ / 15.04.2024 నాటికి రూ.1,40,31,932.94/- / డిమాండ్ నోటీసు తేది: 11.03.2020	యర్రబాలెం గ్రామం, నౌలూరు, యర్రబాలెం గ్రామపంచాయతీ ఏరియా, మంగళగిరి మండలం, మంగళగిరి సబ్-రిజిస్ట్రార్, గుంటూరు జిల్లాలోని డోర్ నెం.788/ఏ, డోర్‌నెం.10-351, ప్లాట్ నెం.14, అసెస్మెంట్ నెం.2246లోగల ఈస్‌మెంట్ యొక్క అన్ని హక్కులతో ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు నివాసిత బిల్డింగ్‌తోకలిపి నివాసిత సైట్‌యొక్క 145చ.గ.లు లేదా 121.24చ.మీ.ల విస్తీర్ణపు ఆస్తి మరియు సరిహద్దులు: **తూర్పు:** జముల్మ రాజేష్‌కు చెందిన ప్లాట్‌నెం.15లోని ఆస్తి సరిహద్దు, **పడమర:** ప్లాట్ నెం.లు 12& 13లోని ఆస్తి సరిహద్దు, **ఉత్తరం:** పంచాయతీ రోడ్ సరిహద్దు, **దక్షిణం:** అన్నం క్రిష్ణరావు ఆస్తి సరిహద్దు.	**రూ.55,00,000/- (రూపాయలు యాభైఐదు లక్షలు మాత్రమే)** / **ధరావత్తు 10%**- రూ.5,50,000/- (రూపాయలు ఐదులక్షల యాభైవేలు మాత్రమే) / **బిడ్ పెంపుదల మొత్తం**-రూ.50,000/- (రూపాయలు యాభైవేలు మాత్రమే)

అమ్మకపు వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి ఒరిక్స్ లీజింగ్& ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్ అనగా: **https://www.ORIXindia.com/leasing.php** లో కల్పించిన లింక్‌ను రిఫర్‌చేయండి లేదా సంప్రదించండి: అధీకృత అధికారి, శ్రీ.తిరునగిరి జగన్నాథన్ దీక్షిత్ (సంప్రదించు వివరాలు: +91-8328462543) వారిని సోమవారం నుండి శనివారం వరకు పనివేళల్లో సంప్రదించండి.

తేది: 23-04-2024

సం/- అధీకృత అధికారి
ఒరిక్స్ లీజింగ్ & ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

RBL BANK apno ka bank

ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్

అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం : 1వ లైను, షాహుపురి, కొలాహపూర్-416001.
నేషనల్ ఆపరేషన్ సెంటర్ : టెక్నిప్లెక్స్-1, 9వ అంతస్తు, ఆఫ్. వీర్ సవార్కర్ ఫ్లై ఓవర్, గోర్గావ్ (వెస్ట్), ముంబై-400062.

స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు) రూల్ 8-(1)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 మరియు 9/రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద అతనికి అందించబడిన అధికారాలను వినియోగించుకుంటూ డిమాండ్ నోటీసు జారీ చేశారు. సదరు నోటీసు రసీదు తేది నుండి 60 రోజులలోపు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పేర్కొనడమైనది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువసంతకందారు పేర్కొన్న చట్టంలోని రూల్ 9తో చదువుతూ సెక్షన్ 13(4) క్రింద అతనికి అందించబడిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని **లాంఛనప్రాయంగా స్వాధీనం** చేసుకోవడమైనది.

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు **ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్**కు పేర్కొన్న మొత్తంతో పాటు దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ లోన్ ఎకౌంట్ నం.	బకాయి నాటికి అసాధారణ మొత్తం (రూ.)	స్థిరాస్తి వివరణ	డిమాండ్ నోటీసు తేది / స్వాధీనతా తేది
1	**కందిమళ్ల వెంకటరావు** (రుణగ్రహీత మరియు తనఖాదారు) **కందిమళ్ల శివరంజని** (సహ రుణగ్రహీత) **లోన్ ఎకౌంట్ నం.: 809001153292, 809001229515, 809001229799**	11.08.2023 నాటికి **రూ. 58,50,772.59/-** (యాభై ఎనిమిది లక్షల యాభై వేల ఏడు వందల డెభై రెండు రూపాయల యాభై తొమ్మిది పైసలు మాత్రమే)	గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కొరిటేపాడు వద్ద ఉన్న డో.నం.58/ఏలో మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ రెసిడెన్షియల్ భవనం (రాఘవయ్య నిలయం, జిఎఫ్,ఎఫ్ఎఫ్ మరియు ఎస్ఎఫ్(పి), డో.నం.4-19-10/ఏ, 16-13-632(ఎన్), 4వ వార్డు, వికాస్ నగర్ 5వ లైన్, మూల్యాంకనం నం.5881/1336/సి(పాత) 35940(కొత్త) ఆస్తి బేరింగ్ విస్తీర్ణం 118.44 చ.గ.లు. లేదా 99.03 చ.మీ.లు. ఉన్న సరిహద్దులు : తూర్పు : ఎమ్.సూర్య ప్రకాశరావు ఆస్తి 33.8 అ.లు., దక్షిణం : ఎ ఎస్ ప్రదీప్ ఆస్తి 30.9 అ.లు., పడమర : 30 అ.లు. వెడల్పు రోడ్డు 34.11 అ.లు., ఉత్తరం : మున్సిపల్ రోడ్డు 31.6 అ.లు.	21.08.2023 / 19.04.2024
2	**వరయూరి విజయలక్ష్మి** (రుణగ్రహీత మరియు తనఖాదారు), **వరయూర్ మధుసూధనరావు** (సహ రుణగ్రహీత మరియు తనఖాదారు), **వి.చైతన్య సాగర్** (సహ రుణగ్రహీత) **లోన్ ఎకౌంట్ నం.: 809001372204, 809001372068, 809001372129**	16.12.2023 నాటికి **రూ. 1,90,99,542.77/-** (ఒక కోటి తొంభై లక్షల తొంభై తొమ్మిది వేల ఐదు వందల నలభై రెండు రూపాయల డెభై ఏడు పైసలు మాత్రమే)	**1వ అంశం : డాక్యుమెంట్ నం.9239/2002 ప్రకారం :** గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు, గుంటూరు గ్రామం యొక్క గుడ్ షెడ్ ఎదురు, వీవర్స్ కాలనీ వద్ద ఉన్న డో.నం.8-13-121/3, రెసిడెన్షియల్ సైట్ విస్తీర్ణం 190 చ.గ.లు. తో కలిపి తేది 30.07.2000, యుఎల్‌సి పి.నం.డి.డిస్.నం.1281/2000-బి, స్పెషల్ రిజి.నం.1193 పొందిన ఆర్‌సిసి రూఫ్ భవనంతో డో.నం.415/బి1 లో ఉన్న అన్నీ సౌలభ్య హక్కులు. **ఉన్న హద్దులు :** తూర్పు : మూలంరెడ్డి శివమ్మ ఆస్తి, దక్షిణం: వీరిశెట్టి మల్లేశ్వరరావు ఆస్తి, పడమర : మూలం రెడ్డి నాగిరెడ్డి నుండి వరయూరి మధుసూధనరావు ఆస్తి కొనుగోలు చేసిన ఆస్తి, ఉత్తరం : మున్సిపల్ రోడ్డు. **2వ అంశం : డాక్యుమెంట్ నం.లు.10811/2004, 10810/2004, 9235/ 2002 ప్రకారం :** గుంటూరు జిల్లా, గుంటూరు జిల్లా రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు, గుడ్ షెడ్ ఎదురు, వీవర్స్ కాలనీ వద్ద ఉన్న డో.నం. 30-07.2000 రెసిడెన్షియల్ సైట్ విస్తీర్ణం 560 చ.గ.లు.తో కలిపి తేది : 30.07.2000న యుఎల్‌సి పి.నం.డి.డిస్.నం.1281/2000-బి, స్పెషల్.రిజిస్టర్డ్ నం.1193 పొందిన ఆర్‌సిసి రూఫ్ భవనం అందులో డో.నం.415/బి1లో ఉన్న అన్నీ సౌలభ్య హక్కులు. **ఉన్న హద్దులు :** తూర్పు : మూలంరెడ్డి శివమ్మ నుండి వరయూరి మధుసూధనరావు ద్వారా అమ్మబడిన ఆస్తి, దక్షిణం : వీరిశెట్టి మల్లేశ్వరరావు ఆస్తి, పడమర : భరతుల వెంకట నరసింహారావు ఆస్తి, ఉత్తరం : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు.	18.12.2023 / 19.04.2024

రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్ అనగా.. పేర్కొన్న ఆస్తిను విడిపించుకొనుటకు మా బ్యాంక్ ద్వారా కలిగి ఇక్కడ పేర్కొన్న బకాయితో కలిపి అన్నీ ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులు చెల్లించడం ద్వారా మీకు లభించిన సమయం మేరకు సర్ఫేసీ చట్టం యొక్క సెక్షన్ 13 (8) నిబంధనలను అహ్వానించడమైనది.

ప్రదేశం : గుంటూరు జిల్లా
తేది: 19.04.2024

అధీకృత అధికారి
ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్, తరపున

కొల్లాంలో సినీ స్టార్ ముఖేష్ కుమార్

- సిపిఎం అభ్యర్థిగా పోటీ
- రెండు తడవలు ఎంఎల్ఏగా సేవ
- ప్రచారంలో అక్కున చేర్చుకుంటున్న ప్రజలు

జె.జగదీష్

సినిమాలు, టీవీ షోలు, స్థానిక ప్రత్యేక భాషా శైలితో కొల్లాం బ్రాండ్ అంబాసిడర్‌గా పేరు తెచ్చుకుంటున్న నటుడు ఎం. ముఖేష్ కుమార్. కళ, రాజకీయాలు రెండింటినీ మేళవించి ఫెర్మార్మ్ చేసి 'కొల్లాం' హీరోగా ఆయనకు పేరుంది. కొల్లాం ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎన్నికైన ముఖేష్ కుమార్, స్టార్ స్థాయికి మించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల మనసు గెలుచుకుని పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో దిగారు. కొల్లాం లోక్‌సభ నియోజకవర్గానికి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముఖేష్‌ను ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు.

రంగస్థలం నుంచి...

నాటక రచయిత ఒ. మాధవన్, రంగస్థల సినీ నటి విజయకుమారి దంపతులకు 1957 మార్చి 5న కొల్లాం పట్టణం ఈస్ట్ హౌస్‌లో ముఖేష్ జన్మించారు. తంగస్సేరీలోని ఇన్ఫాంటా జీసస్ స్కూల్‌లో చదివిన తరువాత కొల్లాంలోని ఎస్ఎన్ కాలేజీలో సైన్స్‌లో పట్టభద్రుడయ్యాడు. తిరువనంతపురం లా కాలేజీలో ఎల్ఎల్‌బి రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. ముఖేష్‌లోని కళాకారుడికి కొల్లాంలోని ఎస్ఎన్ కాలేజీలో చదువుతున్న సమయంలో మరిన్ని అవకాశాలు వచ్చాయి. ఏకపాత్రాభినయాలతో పలు నాటక ప్రదర్శనలిచ్చి కళాశాలకు హీరోగా నిలిచాడు. 1982లో 'బెలూన్' తో సినిమాల్లోకి ప్రవేశించారు. హీరోగా, రెండో హీరోగా 400కు పైగా చిత్రాల్లో నటించారు. ఏడు తమిళ సినిమాల్లో కూడా నటించాడు. టెలివిజన్ షోలతో మళయాళీల మనసులో స్థానం సంపాదించుకున్నారు. 2006లో, ప్రశాంత్ నారాయణన్, మోహన్‌లాల్‌తో ఛాయాముఖి అనే నాటకానికి దర్శకత్వం వహించారు. ఇది ముఖేష్‌కు ప్రసంశలను తెచ్చిపెట్టింది.

ప్రతిపక్షాల విమర్శలకు ఎదుర్కొని...

2016లో ఆయన సినీ ప్రపంచంలో స్టార్‌గా ఉన్న సమయంలో కొల్లాం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎల్‌డిఎఫ్ నుంచి సిపిఎం తరపున పోటీ చేశారు. సినీనటుడు ఎమ్మెల్యే అయితే నియోజకవర్గంలో కనిపించరంటూ ప్రతిపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. కొల్లాం ప్రజలు 17,611 ఓట్ల మెజారిటీతో ముఖేష్‌ను ఎన్నుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో 2021లోనూ ముఖేష్‌కు రెండో తడవ విజయం లభించింది. ముఖేష్ కథలు అనే పుస్తకాన్ని ప్రచురించారు. సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా కూడా పనిచేశారు.

ఎన్నికల బరిలో జెఎన్‌యు విద్యార్థి నేతలు

దేశానికి రాజకీయ నేతలను, ప్రజాప్రతినిధులను అందించిన విశ్వవిద్యాలయాల జాబితాలో జెఎన్‌యు అగ్రస్థానంలో ఉంది. గత 50 ఏళ్లలో జెఎన్‌యుకు చెందిన పలువురు విద్యార్థి నేతలు రాజకీయాల్లో ప్రవేశించి రాణించారు. అయితే వారిలో ఏ ఒక్కరు కూడా లోక్‌సభకు చేరుకోలేకపోయారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్, సిపిఎం నేతలు సీతారాం ఏచూరి, ప్రకాష్ కరత్, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, జెడియు నేత కెసి త్యాగి, కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి సయ్యద్ నజీర్ హుస్సేన్ వంటి వారు రాజకీయాల్లో ఉన్నారు. వారిలో కొంత మంది రాజ్యసభ సభ్యులుగా వెలుగొందారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా జెఎన్‌యుకు చెందిన ముగ్గురు విద్యార్థి సంఘం మాజీ నేతలు వివిధ పార్టీల నుంచి పోటీ చేస్తున్నారు. ఈశాన్య ఢిల్లీ నుంచి కన్నయ్య కుమార్, నలంద నుంచి సందీప్ సౌరభ్, సెరంపూర్ నుంచి దీప్సితా ధర్ ఈ జాబితాలో ఉన్నారు. ఈ ముగ్గురూ ఇండియా ఫోరం అభ్యర్థులే.

- ముగ్గురూ ఇండియా ఫోరం నుంచే
- సెరంపూర్‌లో సిపిఎం నుంచి దీప్సితాధర్
- ఈశాన్య ఢిల్లీలో కాంగ్రెస్ తరపున కన్నయ్య కుమార్
- నలంద స్థానంలో సిపిఐ(ఎంఎల్' అభ్యర్థిగా సందీప్ సౌరభ్

ఎస్ఎఫ్ఐ నేత దీప్సితా ధర్

జెఎన్‌యు ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నేత దీప్సితా ధర్ పశ్చిమ బెంగాల్లోని సెరంపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. టిఎంసి నేత కళ్యాణ్ బెనర్జీ ఇక్కడ సిట్టింగ్ ఎంపి. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దీప్సిత పోటీ చేశారు. సిపిఎం ఆమెను బాలి స్థానం నుంచి అభ్యర్థిగా నిలబెట్టింది. అయితే ఆమె ఓటమి చెందారు. 1993 ఆగస్టు 9న పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో పిజూష్ ధర్, దీపికా ఠాకూర్ చక్రవర్తి దంపతులకు దీప్సితా ధర్ జన్మించారు. ఆమె ప్రస్తుతం ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దక్షిణ కోల్‌కతాలోని అసుతోష్ కళాశాల నుండి భూగోళశాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు. ఆమె న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుండి జాగ్రఫీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎంఫిల్ పూర్తి చేశారు. ప్రస్తుతం జెఎన్‌యులో పాపులేషన్ జియోగ్రఫీలో పిహెచ్‌డి చేస్తున్నారు. కేరళలో తన ఫీల్డ్‌వర్క్‌ను పూర్తి చేశారు. దక్షిణ కోల్‌కతాలోని అసుతోష్ కాలేజీలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో చేరారు. ఎస్ఎఫ్ఐ కాలేజ్ యూనిట్‌కి తాత్కాలిక అధ్యక్షురాలిగా, ఆ తర్వాత కోల్‌కతా జిల్లా కమిటీ సభ్యురాలుగా పని చేశారు. 2013లో జెఎన్‌యులో చేరారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కి కౌన్సిలర్ అయ్యారు. జెఎన్‌యులో ఎస్ఎఫ్ఐ యూనిట్ కార్యదర్శిగా, ఎస్ఎఫ్ఐలో పలు హోదాల్లో పని చేశారు. 2015లో ఇండియాలోని బ్రిటన్ హైకమిషన్ తీసుకెళ్లిన భారతదేశం నుండి ఎనిమిది మందితో కూడిన విద్యార్థి రాజకీయ ప్రతినిధి బృందంలో దీప్సిత ఒకరు. 'జస్టిస్ ఫర్ రోహిత్ వేముల' ఉద్యమంతో సహా రాజకీయ ఉద్యమాల్లో పాల్గొన్నందుకు ఆమె ఢిల్లీ పోలీసుల దాడిని ఎదుర్కొన్నారు. ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌లో సిఎఎ వ్యతిరేక నిరసనలలో కీలక పాత్ర పోషించారు. 2020 అక్టోబర్ 2న జరిగిన గ్లోబల్ ఇండియన్ ప్రోగ్రెసివ్ ప్యానెల్‌లోని ప్యానెలిస్ట్‌లో ఆమె ఒకరు.

సందీప్ సౌరభ్

జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి సందీప్ సౌరభ్ బీహార్‌లోని నలంద సీటు నుంచి ఇండియా ఫోరంలో సిపిఐ(ఎంఎల్) అభ్యర్థిగా బరిలోకి దిగారు. సందీప్ సౌరభ్ రాజకీయాల్లో పనిచేయడం కోసం 2017లో హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదులుకున్నారు. జెఎన్‌యులో పిహెచ్‌డి చేసిన సందీప్ 2013లో విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో పాలిగంజ్ నుండి పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి జెడియుకు చెందిన కౌశలేంద్ర కుమార్ ఎంపిగా ఉన్నారు. జెడియు ఈసారి కూడా ఆయననే బరిలోకి దింపింది. సందీప్ తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

కన్నయ్య కుమార్

జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్నయ్య కుమార్ ఇండియా ఫోరంలోకాంగ్రెస్ పార్టీ తరపున ఈశాన్య ఢిల్లీ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. కన్నయ్య 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్ లోని బెగుసరాయ్ నుంచి సిపిఐ తరపున పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఆ తరువాత సిపిఐకి రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరారు. కన్నయ్య ప్రస్తుతం కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐకి ఇన్ ఛార్జ్ గా ఉన్నారు. బీహార్‌లోని బెగుసరాయ్ నివాసి కన్నయ్యపై 2016లో దేశద్రోహం ఆరోపణలు రావడంతో ఆయన వార్తల్లోకెక్కారు. ప్రస్తుతం ఈ కేసులో బెయిల్ పై ఉన్నారు. 2015-16లో జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షునిగా పనిచేసిన కన్నయ్య కుమార్ ప్రస్తుతం బిజెపి అభ్యర్థి మనోజ్ తివారీపై పోటీ చేస్తున్నారు. తివారీ 2014 నుంచి ఇక్కడ ఎంపిగా కొనసాగుతున్నారు.

(న్యూఢిల్లీ ప్రతినిధి)

శశిథరూర్ డ్యాన్స్ వైరల్...

తిరువనంతపురం : సీనియర్ కాంగ్రెస్ నేత శశిథరూర్ మరోసారి డ్యాన్స్ చేస్తూ మరోసారి మీడియాలోకి ఎక్కారు. మాజీ కేంద్రమంత్రి, కేరళలోని తిరువనంతపురంకు చెందిన కాంగ్రెస్ ఎంపి అయిన శశిథరూర్ తాజా ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గం నుండే మళ్లీ పోటీచేస్తున్నారు. మరో నాలుగురోజుల్లో ఇక్కడ పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయన... తాను పోటీ చేసే నియోజకవర్గంలో ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. సోమవారం జరిగిన ప్రచారంలో ఆయన కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



జమ్మూలో కాంగ్రెస్ వర్సెస్ బిజెపి

జమ్ముకాశ్మీర్‌లోని ఐదు నియోజకవర్గాల్లో ఉదంపుర్ స్థానానికి తొలివిడత ఏప్రిల్ 19న ఎన్నికలు జరిగాయి. రెండోదశలో భాగంగా 'జమ్మూ' నియోజకవర్గానికి ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. 2,416 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 1962లో ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్థానానికి ఇప్పటి వరకు 15 సార్లు జరిగిన ఎన్నికల్లో 9సార్లు కాంగ్రెస్ గెలుపొందింది. జమ్మూ లోక్‌సభ సీటు పరిధిలో జమ్మూ, సాంబ, రియాసి, రజౌరి అనే నాలుగు జిల్లాలు ఉన్నాయి. ప్రస్తుతం 22 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రధానంగా బిజెపి ఎంపీ జుగల్ కిషోర్, జమ్ముకాశ్మీర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్ భల్లా మధ్యే పోటీ నెలకొంది. ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర హోదా, అభివృద్ధి, బోర్డర్‌లో ప్రశాంత వాతావరణం, నిరుద్యోగం వంటివి ప్రధానమైన సమస్యలు.

ఎన్నికల నేపథ్యంలో పార్టీల ప్రచారం జోరందుకుంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రచారంలో బిజెపి వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. రాష్ట్ర హోదా కల్పించడం, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, నిరుద్యోగం, బిజెపి అవినీతి, నేరాలు వంటి వాటిపై దృష్టి సారించింది. ఉపాధి కల్పన హామీ ఇచ్చింది. మరోవైపు బిజెపి మతపరమైన అంశాలను ప్రకటిస్తోంది. దేవాలయాల నగరంగా పేరుగాంచిన జమ్మూలో హిందూ ఓటర్లను మభ్యపెట్టేందుకు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని బిజెపి ప్రచారాస్త్రంగా వాడుకుంటోంది. ఆర్టికల్ 370, 35ఎ రద్దు అనంతరం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రశాంతమైన సరిహద్దులు కల్పించామంటూ, త్రిపుల్ తలాక్ రద్దు వంటి వాటిని ప్రస్తావిస్తోంది. నిజానికి ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా జమ్మూకాశ్మీర్‌లో నాయకులు, ప్రజానీకం పెద్దఎత్తున నిరసనలు ఆందోళనలు చేపట్టారు. ఆ వ్యతిరేకత ప్రపంచానికి తెలియకుండా అణచివేతకు గురిచేసింది కాషాయపార్టీ. ఇప్పుడు వాటినే గొప్పలుగా చెబుతున్నా ప్రజల విశ్వాసం పొందలేకపోతోంది. ఇంతకాలం అధికారంలో ఉన్నా జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించలేకపోయింది. పైగా ఎన్నికల ప్రచార తరుణంలో ఓటర్లను ఆకటుకునేందుకు కేంద్రమంత్రి, ఉదంపుర్ అభ్యర్థి జితేంద్ర సింగ్ ప్రచారంలో పాల్గొని, అధికారంలోకి వస్తే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని హామీలను గుప్పిస్తోంది.



జమ్మూలో హిందువులు, ముస్లింలు సంవత్సరాలుగా సామరస్యంగా జీవిస్తున్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఎన్నికల్లో మతపరమైన అంశాలపై దృష్టి పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఉద్యోగ కల్పన వంటి మౌలిక సదుపాయాలపై చర్చించే విధంగా ఉండాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలతో జమ్మూ అతలాకుతలమైంది. ఇది బిజెపి ప్రతిష్ఠను దెబ్బతీయొచ్చు. 2014, 2019 ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి జుగల్ కిషోర్ గెలిచారు. మూడోసారి పోటీలో ఉండగా జమ్మూకాశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తిపై దెబ్బతీసింతర్వాత ఈ ప్రాంతంలో జరగబోయే ఎన్నికల్లో ప్రజలు ఎటు ఓటు వేయనున్నారో వేచి చూడాలి.

మొత్తం ఓటర్లు		
17,80,739	పురుషులు	8,59,657
	మహిళలు	9,21,053
	థర్డ్ జెండం	28



కలం బాణాలు

విశాఖలో మౌనంగా జగన్ 'మేమంతా సిద్ధం' యాత్ర

విశాఖలో జగనన్న
జాతరతో సిద్ధం
ఉక్కుపైన నోరెత్తరు
సుతరామూ నిషిద్ధం

మోడీ గారికి కోపం
తెప్పించే మాట
కలనైనా పలికేరా
బాబు, జగన్ నోట?

ప్రజల ఆస్తులు ముస్లింలకు పంచుతారు : మోడీ

దేశంలో సంపదలే
ముస్లింలకు పంచడమా?
మత్సరాలు పెంచేందుకు
చిచ్చే రగిలించడమా?

భారత్ ఇది అందరిదీ
కాదా పిఎం మోడీ
ఓట్లకొరకు ద్వేషభాష
పదవికి నప్పని జోడీ

ఎట్టకేలకు రఘురామకు 'ఉండి' టిక్కెట్

ఎట్లాగో తుట్టతుదకు
దక్కిందా ఉండి టికెట్
రామరాజు స్థానంలో
రామకష్ణ రాజు వికెట్

ఎన్డీయే తగాదాలు
ఏమవునో రాజా
ఎన్ని పాట్లు పడ్డవో
కాస్తయినా సో జా!



తె.ర

‘ఉక్కు’పై ప్రధాన పార్టీల మౌనముద్ర

- విశాఖ రోడ్‌షోలో స్టీల్ ప్లాంట్ ఊసెత్తని జగన్
- ప్రచార యాత్రల్లో ‘ఉక్కు’పై దాటేసిన చంద్రబాబు, పవన్
- రాష్ట్రంలో నేతల ప్రకటనలు... ఢిల్లీలో నోటికి తాళం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

- విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. ఆ అంశం కేంద్రం పరిధిలోనిది- వైసిపి మంత్రి బొత్స సత్యనారాయణ
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే బిజెపితో పొత్తు పెట్టుకున్నాం. మేం గెలిస్తే ప్రధాని మోడీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఓ నిర్ణయం వచ్చేలా చేస్తాం : టిడిపి అధినేత చంద్రబాబు
- నేను ప్రధాని మోడీ ముందు చాలాసార్లు విశాఖ ఉక్కుపై లేవనెత్తాను. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదు : జనసేన అధినేత పవన్ కల్యాణ్
- ఉక్కు ప్రయివేటీకరణ ఆగిపోతుంది : బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు

కేంద్రంతో పోట్లాడి విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకుంటామని రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన చెప్పడం లేదు. ఈ ప్రాంత ఓటర్లను ఏమార్చడానికి, ఓట్లు కొల్లగొట్టడానికి చేసిన ప్రకటనలని ఇట్టే తెలిసిపోతోంది. ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరించాలని నిర్ణయం తీసుకున్న మోడీ ప్రభుత్వంతో ఆ పార్టీలు చెలిమితో ఉన్నాయి. అయితే, ప్రయివేటీకరణను వ్యతిరేకంగా ఉన్నట్లు చెప్తూ ప్రజలను మోసగిస్తున్నాయి. రాష్ట్రంలో ఆ పార్టీల నేతల గంతులు వేస్తే, ఢిల్లీలో నోటికి తాళం వేసుకుంటున్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ కార్మిక వర్గం, సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, ఇండియా వేదిక పార్టీలు, ప్రజాసంఘాలు మూడేళ్ల నుంచి పెద్ద ఎత్తున పోరాడుతున్నాయి. గాజువాకలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండియా ఫోరం బలపరిచిన మరడాన జగ్గునాయుడు బరిలో ఉన్నారు. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖలో ప్రజా, కార్మిక, ఉద్యోగ సంఘాలతో జెఎసి ఏర్పాటు చేసి మూడేళ్లుగా దానికి చైర్మన్‌గా ఉంటూ ఆయన పోరాడుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అధినేతలు ఉక్కు అంశంపై ద్వంద్వ వైఖరితో ఉన్నారని, ముఖ్యమంత్రి జగన్, చంద్రబాబు నోరుమెదపడం లేదని, కమ్యూనిస్టులే చిత్తశుద్ధితో ఉక్కుపై పోరాడుతున్నారన్న చర్చ విశాఖ, గాజువాక ప్రాంతాల్లోని అన్ని తరగతుల ప్రజల్లోనూ నడుస్తోంది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి, టిడిపి, జనసేన మొదట్లో చేసిన ప్రకటనలేవీ 2024 ఎన్నికల సందర్భంగా రావట్లేదన్నది వాస్తవం. కేంద్ర బిజెపి సర్కారు గుప్పెట్లో ఈ మూడు పార్టీల అధినేతలు ఉండడమే వారి మౌనముద్రకు కారణమనే చర్చ జరుగుతోంది.

రాష్ట్ర ముఖ్యమంత్రిది వ్యూహాత్మక మౌనమా?

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శనివారం రోజంతా విశాఖ నగరంలో బస్సు యాత్ర చేశారు. నోరు విప్పి మాట్లాడితే స్టీల్‌ప్లాంట్, పంచగ్రామాలు, గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు, రైల్వేజోన్‌పై ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అందుకే ఆయన వ్యూహాత్మక మౌన యాత్ర చేశారా? అనే చర్చ కూడా నడుస్తోంది. సుమారు పది సెంటర్ల మీదుగా బస్సు యాత్ర సాగింది. సిఎం జగన్ మాత్రం విశాఖ అభివృద్ధికి కారణమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు తమ పార్టీ వ్యతిరేకమనిగానీ, అమ్మకాన్ని ఆపుతామనిగానీ ఎక్కడా మాట్లాడలేదు. తన చేత్తో గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టిన జగన్ అక్కడ కార్మికులు జీతాల్లేనందున కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నా వారి సమస్య పరిష్కారానికి తాను ఏం చేయదల్చాడో ప్రస్తావన లేదు.

కేంద్రాన్ని పోరాటాలు, రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీల ప్రమేయంతో ప్రభావితం చేస్తే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుస్తుందని ప్రజల్లో చర్చ సాగుతున్నా అధికార వైసిపిలోగానీ, ప్రతిపక్ష టిడిపి, జనసేనల్లోగానీ కనీస చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రయివేటీకరణే ఆగిపోతుందని విశాఖలో పార్లమెంట్ సీటు కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన క్రమంలో బిజెపి రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావు ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేశారు. ఢిల్లీ పెద్దలు ఆయనకు టికెట్ నిరాకరించడంతో ప్రస్తుతం ఆయన పత్తా లేకుండా ఉన్నారు.

టిడిపి, జనసేన, బిజెపి కూటమి కుటిల మ్యానిఫెస్టో

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామంటూ ఇటీవల టిడిపి, జనసేన, బిజెపి కూటమి విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ తన మేనిఫెస్టోను మీడియా ఎదుట ఆవిష్కరించారు. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సీట్లలో ఎస్.కోట మినహాయిస్తే మిగతా ఆరు చోట్లా ‘ఉక్కు’ ప్రభావం ఉంటుంది కాబట్టి గెలుపు కోసం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆ మేనిఫెస్టోలో అలా పెట్టారు. గడిచిన నెల రోజుల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడి విశాఖలో ప్రచార యాత్రలు చేపట్టినప్పుడు ఉక్కుపై వారిద్దరూ కప్పదాటు వైఖరినే అవలంబించారు.

మరో 38 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

- చీరాల నుంచి ఆమంచి కృష్ణమోహన్
- పులివెందుల నుంచి ఎం ధృవకుమార్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మరో జాబితాను విడుదల చేసింది. ఈ నెల రెండున 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం.. ఇండియా వేదిక పార్టీలైన సిపిఎం, సిపిఐతో సీట్ల సర్దుబాటు అనంతరం మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ సోమవారం 38 అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలోని కొన్ని స్థానాల్లో మార్పులు, చేర్పులు చేస్తూ తాజా జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలో ప్రకటించిన అభ్యర్థుల్లో దాదాపు 10 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను మార్చారు.

అసెంబ్లీ నియోజకవర్గం	అభ్యర్థి పేరు
1. శ్రీకాకుళం	-అంబటి కృష్ణారావు
2. బొబ్బిలి	-మరిపి విద్యాసాగర్
3. గజపతినగరం	-డోలా శ్రీనివాస్
4. నెల్లిమర్ల	-సరగడ రమేష్‌కుమార్
5.విశాఖ నార్త్	- లక్కరాజు రామారావు
6. చోడవరం	- జగత్ శ్రీనివాస్
7.యలమంచిలి	- టి నర్సింగ్‌రావు
8. పి గన్నవరం (ఎస్‌సి)	- కొండేటి చిట్టిబాబు
9. ఆచంట	-నెక్కంటి వెంకట సత్యన్నారాయణ
10. విజయవాడ ఈస్ట్	-సుంకర పద్మశ్రీ
11. జగ్గయ్యపేట	-కర్నాటి అప్పారావు
12.తాడికొండ (ఎస్‌సి)	-ఎం సుశీల్ రాజ
13. రేపల్లె	- మోపిదేవి శ్రీనివాసరావు
14. తెనాలి	-ఎస్‌కె బషీద్
15.గుంటూరు వెస్ట్	-రాచకొండ జాన్ బాబు
16. చీరాల	- ఆమంచి కృష్ణమోహన్
17.ఒంగోలు	-తురకపల్లి నాగలక్ష్మి
18. కనిగిరి	-దేవరపల్లి సుబ్బారెడ్డి
19.కావలి	- పొదలకూరి కళ్యాణ్
20. కొవ్వూరు	-ఎన్ కిరణ్‌కుమార్ రెడ్డి
21. సర్వేపల్లి	-పివి శ్రీకాంత్ రెడ్డి
22. గూడూరు (ఎస్‌సి)	- యు రామకృష్ణారావు
23. సూళ్లూరుపేట (ఎస్‌సి)	- సిహెచ్ శివ
24. వెంకటగిరి	-పి శ్రీనివాసులు
25. కడప	-టికెఎ అలీఖాన్
26.పులివెందుల	-ఎం ధృవకుమార్ రెడ్డి
27.జమ్మలమడుగు	-పాముల బ్రహ్మానందరెడ్డి
28.ప్రొద్దుటూరు	-షేక్ మహ్మద్ నజీర్
29.మైదుకూరు	-జి శ్రీరాములు
30.ఆళ్లగడ్డ	-బి హుస్సేన్
31.శ్రీశైలం	- అజర్ సయ్యద్ ఇస్మాయిల్
32.బనగానపల్లె	-జి పుల్లయ్య
33.డోన్	-జిఎం స్వామి
34. ఆదోని	- జి రమేష్
35.ఆలూర్	- అరకట్ల నవీన్ కిషోర్
36.కళ్యాణదుర్గం	-పి రాంభూపాల్ రెడ్డి
37.హిందూపూర్	-మహ్మద్ హుస్సేన్ ఇనయాతుల్లా
38.ధర్మవరం	-రంగన నారాయణ

ప్రజా సమస్యలే.. ఊపిరిగా : జొన్న శివశంకర్

ప్రజాశక్తి - మంగళగిరి



ఇండియా వేదిక బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థిగా జొన్నా శివశంకరరావు పోటీ చేస్తున్నారు. పేద రైతు కుటుంబంలో 1955లో జన్మించిన జొన్నా శివశంకరరావు విద్యార్థి సంఘం ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. ఎస్ఎఫ్ఐలో చురుగ్గా పనిచేస్తూ పిఎన్ఎం కళాకారుడిగా, యువజన సంఘం నాయకులుగా ఎదిగారు. 1980లో సిపిఎం సభ్యులయ్యారు. ఉద్యమ పోరాట సమయంలో ఆరు నెలలపాటు రహస్య జీవనం కొనసాగించారు. మూడు నెలలపాటు జైలు జీవితం గడిపారు. ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పనిచేసే జొన్నా శివశంకరరావు రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, పసుపు రైతు రాష్ట్ర సంఘం కన్వీనర్‌గా అనేక ఉద్యమాలను నడిపారు. 1981 నుంచి 2001 వరకు ఉండవల్లి గ్రామ సర్పంచుగా 20 ఏళ్లు పనిచేశారు. సిపిఎం గుంటూరు ఉమ్మడి జిల్లాలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, తాడేపల్లి సిపిఎం డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు.

ప్రజా సమస్యలపై పోరాటం

పేదల ఇళ్ల స్థలాల కోసం ఉద్యమించి 6 వేల మందికి ఇళ్ల స్థలాలు సాధించి, ఇళ్లు కట్టించడంలో కీలకపాత్ర పోషించారు. పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ పూర్తి చేయాలని ఆందోళన చేశారు. కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపు డెక్క తొలగించాలని ఆందోళన చేశారు. తెనాలి డెల్టా కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టాలని, తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఆందోళనలు చేశారు. పెంచిన ఇంటి పన్ను, చెత్త పన్ను తగ్గించాలని, విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా, నిత్యావసరాల ధరల పెరుగుదలపై, రైతు సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తున్నారు.

20 ఏళ్ల సర్పంచుగా శివశంకర్ కృషి

నియోజకవర్గ పరిధిలో సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచుగా పనిచేసిన కాలంలో విశేష కృషి చేశారు. సత్రంలో అద్దెకుంటున్న పంచాయతీకి సొంత బిల్డింగు ఏర్పాటుచేశారు. రోడ్లు, డొంకలు, సైడ్ కాలువలు, లైట్లు వేయించారు. ప్రధానంగా దళితవాడలో స్కూల్ బిల్డింగు, పంపులు, వీధిలైట్లు వేయించి వెలుగులు నింపారు. అమరారెడ్డి నగర్, బాపనయ్య నగర్, పిడబ్ల్యుడి కరకట్ట, కుమ్మరి కుంట తదితర చోట్ల ఇళ్లు వేయించి మౌలిక సౌకర్యాలు కల్పించారు. 1998లో వరదలు వచ్చినప్పుడు గ్రామ సర్పంచుగా స్వయంగా ఆయనే దిగి వరద సహాయక చర్యలు చేపట్టారు. గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా మతాలకు, రాజకీయాలకు అతీతంగా సమస్యను పరిష్కరించడంలో ముందున్నారు.

పులివెందులలో జగన్ మెజార్టీ నిలిచేనా?

- వైఎస్ షర్మిల, సునీత ప్రచారంతో సీన్‌లోకి కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెజార్టీ తగ్గించడమే ధ్యేయంగా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఒకవైపు పులివెందులలో టిడిపి జెండా ఎగురవేయడమే తమ ధ్యేయం, లేనిపక్షంలో జగన్ మెజార్టీని తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తామని టిడిపి అభ్యర్థి బి టెక్ రవి, మరోవైపు జగన్ సోదరీమణులు పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, వైఎస్ సునీత ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జగన్ పులివెందులలో సాధించిన 91 వేల మెజార్టీ తగ్గించాలనే పట్టుదలతో ప్రతిపక్ష పార్టీలు పావులు కదుపుతున్న నేపథ్యంలో అందరికీ ఆసక్తిని కలిగిస్తోంది.

టిడిపి వ్యూహాత్మక పావులు

పులివెందుల ఎన్నికల బరిలో వైసిపి తరపున జగన్, టిడిపి తరపున బి టెక్ రవి, కాంగ్రెస్ తరపున ధ్రువకుమార్‌రెడ్డి నిలిచారు. నియోజకవర్గంలో 2,23,453 ఓటర్లున్నారు. ఏడాది కిందట పులివెందుల టిడిపి అభ్యర్థిగా రవి పేరును ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే అన్ని రకాల అండదండలు అందిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో టిడిపి అభ్యర్థి రవి సకుటుంబ సపరివార సమేతంగా ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేశారు. పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాల్లో ప్రచారాన్ని ఉధృతం చేశారు.

వైసిపిలో ఉలికిపాటు

వైఎస్ షర్మిల, సునీత సెంటిమెంటు రాజకీయంతో వైసిపిలో ఉలికిపాటు కనిపించింది. వైఎస్ మనోహర్‌రెడ్డి నాయకత్వంలో పులివెందుల, లింగాలకు వైఎస్ అభిషేక్‌రెడ్డి, వేంపల్లికి ఎస్‌వి సతీష్‌రెడ్డి, వేముల మరక శివరామిరెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, చక్రాయపేటకు వైఎస్ కొండారెడ్డి, సింహాద్రిపురానికి గండ్లూరు వీరశివారెడ్డి, తొండూరు మండల ఎంపిపి రవిశంకర్ నాయకత్వాన ఎన్నికల ప్రచారాల్ని వేగవంతం చేశారు. జగన్ సన్నిహితులైన మంగళికృష్ణ, గాజుల భాస్కర్‌రెడ్డి నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది.

దేశంలోనే ధనిక అభ్యర్థిగా పెమ్మసాని

- రూ.5700 కోట్ల ఆస్తి ఉన్నట్టు అఫిడవిట్‌లో వెల్లడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లోక్‌సభ టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తన ఆస్తి మొత్తం రూ.5700 కోట్లుగా సోమవారం నామినేషన్ సందర్భంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. చంద్రశేఖర్‌కు రూ,2,316 కోట్ల విలువైన చరాస్తులుండగా, భార్య శ్రీరత్న పేరిట రూ.2,280 కోట్లు చరాస్తులు ఉన్నాయి. భార్యభర్తలిద్దరికి చెరో రూ.1200 కోట్ల విలువైన షేర్లు ఉన్నట్టు తెలిపారు. చెరో రూ.519 కోట్ల అప్పులు ఉన్నట్టు చూపారు. 6.86 కిలోల బంగారు ఆభరణాలు, రూ.6.11 కోట్ల విలువైన నాలుగు కార్లు, గుంటూరు జిల్లాలో రూ.2.67 కోట్ల విలువైన సాగుభూమి, హైదరాబాద్‌లో రూ.2.28 కోట్లు విలువైన భూమి, రూ.29.73 కోట్ల వాణిజ్య భవన సముదాయం, ఢిల్లీలో రూ.72 కోట్ల విలువైన భవనం, అమెరికాలో రూ.28.26 కోట్ల విలువైన నివాస భూములు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపారు. భార్య శ్రీరత్న పేరిట రూ.2.33 కోట్ల విలువైన భూమి, అమెరికాలో రూ.6.82 కోట్ల భూమి ఉన్నట్టు పేర్కొన్నారు.

2019 ఎన్నికలు - మసకబారిన శాసనసభ సంప్రదాయాలు

2019 ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన రెడ్డి నేతృత్వంలోని వైసిపికి అనూహ్య విజయం లభించింది. 175 స్థానాలకుగాను 151 స్థానాల్లో విజయం సాధించింది. రాష్ట్ర రాజకీయ చరిత్రలో జగన్మోహనరెడ్డి పిన్నవయస్కుడైన (46 యేళ్లు) ముఖ్యమంత్రి అయ్యారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ఓటమి చెందింది. ఆ పార్టీ కేవలం 23 స్థానాలు మాత్రమే దక్కించుకుంది. జగన్మోహనరెడ్డి గెలుపుతో రాష్ట్ర చరిత్రలో తండ్రీ కొడుకులు ముఖ్యమంత్రులుగా ఎన్నికైన చరిత్రను సొంతం చేసుకున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికలతో కలిసి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా వైసిపి విజయం సాధించింది. 25 స్థానాలకుగాను 22 స్థానాలు గెలుపొందింది. మిగతా 3 స్థానాలు తెలుగుదేశం పార్టీ వశం అయ్యాయి.

కొంచెం వెనక్కి వెళ్తే... 2009 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహనరెడ్డి తొలిసారిగా ఎంపిగా ఎన్నికయ్యారు. అదే సంవత్సరం సెప్టెంబరులో తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించారు. వారసుడుగా తనకు ముఖ్యమంత్రిత్వం ఇవ్వలేదనే ఉద్దేశంతో కాంగ్రెస్‌ను వదిలి వైసిపిని స్థాపించారు. ఈ సందర్భంగానే అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణపై ఆయనను 2012 మే 27న అరెస్టు చేసి 16 నెలలపాటు చంచల్‌గూడ జైలులో ఉంచారు. 2013 సెప్టెంబరు 23న షరతులతో కూడిన బెయిల్ లభించింది. 2014 ఎన్నికలలో టిడిపి విజయం సాధించగా వైసిపి ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. దీంతో రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారు.

2019 శాసనసభలో పార్టీల బలాబలాలు (175)

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
వైఎస్ఆర్‌సిపి	175	151	1,56,88,569	49.95
టిడిపి	175	23	1,23,04,668	39.17
జనసేన	137	01	17,36,881	5.53

2019 లోక్‌సభలో పార్టీల బలాబలాలు (25)

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
వైఎస్ఆర్‌సిపి	25	22	1,55,37,006	49.89
టిడిపి	25	03	1,25,15,345	40.19

అవహేళనలు, దూషణలు

2014 ఎన్నికల తర్వాత నుంచి శాసనసభ జరిగే తీరులో పెను మార్పు వచ్చింది. పాలకులు.. ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని కక్ష సాధింపుగా వ్యవహరించడం ప్రారంభమైంది.ఈ సంప్రదాయం 2004 నుంచే మొదలైంది. అప్పట్నించే చట్టాలు (శాసనాలు) చేసే శాసనసభ అవహేళనలకు, దూషణలకు నిలయమైంది. స్పీకర్లు సైతం తాము పదవిలో ఉన్నంతకాలం ఎన్నికైన పార్టీని వదిలివేయాల్సి ఉంటుంది. పక్షపాత రహితంగా వ్యవహరించాల్సి ఉంటుంది. స్పీకర్ సైతం సభలోనూ, సభ వెలుపలా సొంత పార్టీ కార్యకర్త మాదిరిగా ప్రకటనలివ్వడం వంటివి చోటుచేసుకున్నాయి. 2014 నుంచి ఇది మరింత పేట్రేగిపోయింది. ప్రజాస్వామిక వాదులకు, ప్రజాతం త్రవాదులకు విచారం కలిగించేలా పరిస్థితులు మారిపోయాయి. 2014 తరువాత అధికారం పక్షం నుంచి అవమానాలు, అవహేళనలు భరించలేక ప్రతిపక్ష నాయకుడు జగన్మోహనరెడ్డి తాను అధికారం పీఠం అధిష్టించేవరకూ శాసనసభ సమావేశాలకు హాజరుకాబోనని ప్రతిజ్ఞ చేసి అక్కణ్ణుంచి నిష్క్రమించారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి విజయం సాధించింది. 175 సీట్లకుగాను 151 సీట్లు గెలుపొందింది. 1,56,88,569 (49.95 శాతం) ఓట్లు సంపాదించింది. 175 సీట్లకు పోటీ చేసిన టిడిపికి 23 స్థానాలు మాత్రమే లభించాయి. ఆ పార్టీకి 1,23,04,668 (39.17 శాతం) ఓట్లు లభించాయి. సినీ నటుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన 137 స్థానాల్లో పోటీ చేసి 1 స్థానంలో మాత్రమే గెలిచింది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), బిజెపి, బిఎస్‌పి పార్టీలకు శాసనసభలో ప్రాతినిథ్యం లభించలేదు. ఈ ఎన్నికల్లో జనసేన, వామపక్షాలు అవగాహనతో పోటీ చేశాయి.

మళ్లీ కక్ష సాధింపు పునరావృతం

2019లో కొత్త శాసనసభలో కూడా పూర్వపు కక్ష సాధింపు సంప్రదాయం జడలు విప్పి నాట్యం చేసింది. 2009లో బాధితుడు జగన్మోహనరెడ్డి అయితే ఇప్పుడు బాధితుడు ప్రతిపక్ష నాయకుడైన చంద్రబాబు. ఆయన కూడా అధికార పార్టీ సభ్యుల అవహేళనలను, దూషణలను, ఇంటిలోని వ్యక్తుల పరువు తీసేలా చేసిన వ్యాఖ్యలను భరించలేక శాసనసభ వదిలి వెళ్లి పోయారు. మళ్లీ విజయం సాధించి శాసనసభలో అడుగు పెడతానని ప్రతిజ్ఞ చేసి శాసనసభ నుంచి వెళ్లిపోయారు. వయసు మీద పడిన కారణంగా కుమారుడితో యువజనగళం పాదయాత్ర ప్రారంభింపచేశారు. కొన్నాళ్లు సాగాక రాష్ట్ర ప్రభుత్వపు సిఐడి చంద్రబాబుపై కేసులు పెట్టింది. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ వంటి కేసుల్లో అవినీతి ఆధారాలున్నాయంటూ కేసులు పెట్టి రాజమండ్రి జైలుకు పంపారు. సుమారు 2 నెలలపాటు ఆయన జైలులో ఉన్నారు. చర్చకురాని ప్రజా సమస్యలు

పాలక, ప్రధాన పక్షాలు వ్యక్తి గత కక్షలకు, కార్పణ్యాలకు వేదికగా తప్ప ప్రజా సమస్యలపై చట్ట సభలో చర్చ జరగడం లేదు. ఒకవేళ ఎవరైనా ప్రజా సమస్య ప్రస్తావిస్తే మీ హయాంలో జరిగిందేమిటి అంటూ అడ్డు సవాళ్లు వేయడం, తద్వారా గందోరగోళం సృష్టించడం పరిపాటిగా మారిపోయింది. ఈలోగా వక్తకు ఇచ్చిన సమయం అయిపోయిందంటూ స్పీకర్.. మైక్‌ను వేరే వారికి ఇవ్వడం జరుగుతోంది. ఏదైనా బిల్లు ప్రవేశపెడితే చర్చ జరగడం లేదు. గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవలోనే బిల్లు పాస్ అయిందని (చట్టం అయిందని) స్పీకర్ ప్రకటించేస్తున్నారు. దీంతో శాసనసభ ప్రజా సమస్యల వేదికగా గాక కక్ష సాధింపు సభగా మారిపోయిందని ప్రజల నుంచి వినవస్తోంది. రాయ వీలులేని దూషణలు చేసినా స్పీకర్లు మందలించపోవడం వంటి ఉదాహరణలు పదుల సంఖ్యలో 2014, 2019లో మనం విన్నాం. కన్నాం. ఈ కాలంలో ప్రజా సమస్యలపై పనిచేసి పోలీసుల లాఠీలతో దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లే వామపక్షాలు ఎన్నికల్లో గెలవకపోవడం కూడా ప్రస్తుత దిగుజారుడు పరిస్థితికి కారణమన్నది సర్వత్రా వినవస్తోంది.

- యు.రామకృష్ణ

సంపాదకీయం

బరి తెగించిన విద్వేషం

ఏ ఎన్నికల్లో గెలవాలన్నా బిజెపి ఎంచుకునే అస్త్రం మతోన్మాదాన్ని రాజేసే విద్వేష కుట్రలని ఇప్పటికే పలుమార్లు రుజువైంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే దారిని రహదారిలా చేసుకున్నారని తాజాగా రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలలో ప్రధాని నరేంద్ర మోడీ లంకించుకున్న వివాదాస్పద వ్యాఖ్యలే నిదర్శనం. ఆదివారం రాజస్థాన్‌లో పలు బహిరంగసభల్లో ప్రసంగించిన మోడీ, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకొస్తే ప్రజలు కష్టపడి సంపాదించుకున్న స్థిర, చరాస్తులను ముస్లింలకు పంచుతారని విద్వేషపూరితంగా మాట్లాడారు. అంతేనా, వ్యక్తులు సంపాదించుకున్న బంగారం, వెండి, భూములు, నగదు, మొత్తం సంపదను ఎక్కువ మంది పిల్లలు కలిగిన వారికి, చొరబాటుదారులపరం చేస్తారని, అందుకు మీరు సమ్మతిస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీది అర్బన్ నక్సల్ మనస్తత్వమని, మహిళలు పవిత్రంగా భావించే మంగళసూత్రాలను సైతం లాక్కొని పంపిణీ చేస్తారని ఉన్మాదపూరిత వ్యాఖ్యలు చేశారు. మోడీ వేసిన వీరంగం వెనుక పరమార్థం అంతుబట్టకపోవడానికి పెద్దగా పరిశోధించడానికేమీ లేదు. కేంద్రంలో పదేళ్ల పాలన వెలగబెట్టిన బిజెపి ప్రభుత్వానికి, ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పుకోడానికి ఏమీ లేదు. అందుకే ఇటువంటి కుట్రలు, పన్నాగాలు.

పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి, నిరుద్యోగం, పెట్రోలు, డీజిల్ ఛార్జీల పెంపు, నిత్యావసరాల ధరల పెరుగుదల, కార్పొరేట్ల దోపిడీకి అనుకూల విధానాలు, రైతు వ్యతిరేక చర్యలు...చెప్పుకుంటూ పోతే మోడీ ప్రభుత్వ వైఫల్యాల చిట్టా కొండవీటి చాంతాడంత ఉంటుంది. వీటికి తోడు మతపరంగా ప్రజలను నిట్టనిలువునా చీల్చే మెజార్టీ మతోన్మాదం, రాజ్యాంగం ధ్వంసం, ప్రజాస్వామ్య హక్కుల హననం, నిరంకుశత్వం ఉండనే ఉన్నాయి. మోడీ ప్రభుత్వ దుర్మార్గాలు ఎన్నికల్లో బిజెపి, ఎన్‌డిఎ పార్టీల కంటిపై కునుకు పట్టనీయట్లేదు. ప్రజా వ్యతిరేకత నుంచి బయట పడటానికి, జనం దృష్టిని వాస్తవాల నుంచి వేరేవైపు మళ్లించడానికి బిజెపి అమ్ముల పొదిలో ఎప్పుడూ హిందూమతోన్మాదం ఆయుధం సిద్ధంగా ఉంటుంది. అదే రాజస్థాన్‌లో ప్రధాని నోట జాలువారిన విద్రోహ వ్యాఖ్యానాల పూర్వరంగం. దేశం వికసిత భారత్ వైపు దూసుకెళుతోంది, ఎన్నికల్లో 400 సీట్లు సాధించి మూడోసారి హ్యాట్రిక్ కొడతామని ఊరేగుతున్న నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా, బిజెపి నేతలు ఒక్కసారిగా అభివృద్ధి గురించి వదిలేసి హిందూ, ముస్లింల మధ్య ఉద్రిక్తతలు పెంచే మాటలెందుకు మాట్లాడుతున్నట్టు?

దేశంలో శుక్రవారం 102 స్థానాల్లో తొలిదశ ఎన్నికలు ముగిశాయి. పోలింగ్ జరిగిన ఆయా ప్రదేశాల్లో బిజెపి పట్ల ఓటర్లు చూపించిన తీవ్ర స్థాయి విముఖత బిజెపి నేతలకు అర్థమైంది. మిగిలిన ఆరు దశల్లో జరగనున్న ఎన్నికల్లో అటువంటి పరిస్థితులే ఎదురయ్యేలా ఉందని బెంబేలెత్తిన బిజెపి గణాలు ప్రజలను తప్పుదారి పట్టించి, మత ఉద్రేకాలు పెంచి, ఒక మతం వారి ఓట్లను తమ వైపు సమీకరింపజేసుకొని, రాజకీయంగా లబ్ధి పొందేందుకు మోడీ, అమిత్‌షా, నడ్డా, యోగి, వంటి వారు హిందూ మతోన్మాద జెండాను భుజానికెత్తుకున్నారని జరుగుతున్న పరిణామాలను చూస్తే తెలుస్తుంది. గతంలోనూ అయోధ్య, కార్గిల్, 370 ఆర్టికల్, పుల్వామా వంటి వాటిని ప్రయోగించారు. ఇప్పుడూ రామాలయ నిర్మాణం, యుసిసి, సిఎఎ, హిందీ, సంస్కృత భాషల బలవంతపు చొప్పింపు, పాలనలో, విద్యలో, చివరికి దూరదర్శన్ చిహ్నాలకు కాషాయరంగు, గోవుల పరిరక్షణ పేరిట దళితులు, ముస్లింలపై పాశవిక దాడులు, గణేష్ ఉత్సవాలు, శ్రీరామనవమి, హనుమత్ జయంతి శోభాయాత్రలు, ఇవన్నీ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు ఓట్లు తెచ్చిపెట్టే సాధనాలు. మోడీ స్వయంగా రంగంలోకి దిగి చేస్తున్నదిదే. ఏ ఒక్కరినీ రెచ్చగొట్టే ప్రసంగాలు, వ్యాఖ్యలు చేయడం నేరమని సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు గడ్డి పెట్టింది. శిక్షలూ వేసింది. ఎన్నికలవేళ అటువంటివి కూడదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి చెబుతోంది. బహిరంగసభల్లో మతాలను రెచ్చగొట్టే విధంగా విద్వేష ప్రసంగాలు చేస్తున్న ప్రధాని మోడీపై సుప్రీం కోర్టు సూమోటోగా పరిగణించి కోర్టు ధిక్కారం కింద కఠిన చర్యలు చేపట్టాలి. ఇ.సి. సైతం చర్యలు తీసుకోవాలి. అప్పుడే న్యాయం, చట్టం, వ్యవస్థలు స్వేచ్ఛగా తమ పని తాము చేసుకుపోతాయన్న విశ్వాసం కలిగిస్తాయి. ఎంతటి వారైనా కోర్టులు, చట్టం, వ్యవస్థల ముందు సమానమేనన్న రాజ్యాంగం నిర్దేశం ఆచరణలో నిలబడుతుంది.



ఈ మంత్రములు, జపమాలలు విడిచిపెట్టు.
తలుపులన్నింటినీ బంధించి ఈ చీకటి
గదిలో ఎవరిని పూజిస్తున్నావు? కళ్ళు
తెరచి చూడు. నీవు ఆరాధించే దేవుడు నీ
ఎదుట లేడు! ఎక్కడ రైతు నేలను
దున్నుతున్నాడో, ఎక్కడ శ్రామికుడు రాళ్ళు
పగులగొడుతున్నాడో అక్కడ
ఆ పరమాత్ముడున్నాడు. నీవు కూడా
నీ పట్టు పీతాంబరములు ఆవల పెట్టి
ఆ నేల మీదికి పదా.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

'నయా' భారత ఆర్థిక వ్యవస్థ - ఒక పరిశీలన!

శ్రీపాద్ మోతీరాం **వంశీ వకుళాభరణం**

విశ్లేషణ

ఇప్పటికే, 'నయా' భారతదేశం అనే పదం బాగా వ్యాప్తి చెందింది. బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ వెబ్‌సైట్లలోనూ, జాతీయ, అంతర్జాతీయ మీడియాలోనూ ఇది కనిపిస్తోంది. గత దశాబ్ద కాలంలో, హక్కులు, స్వేచ్ఛలు, మత సహనాలకు సంబంధించి ప్రధాన మార్పులు బాగా నమోదయ్యాయి. ఈ 'నయా' భారతదేశానికి పెరుగుతున్న అంతర్జాతీయ హోదా గురించి కూడా బాగా చర్చ జరుగుతోంది. కేవలం పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ పరిమాణంలోనే కాకుండా ఇతర దేశాలతో పోలిస్తే పెరుగుతున్న ఈ హోదా లేదా స్థాయి ఆర్థికాభివృద్ధిపై ఆధారపడి వుంటుందని ఎవరైనా ఆశిస్తారు. ఆదాయం, ఆరోగ్యం, విద్య లేదా విజ్ఞానం వంటి అంశాలను కలిపి ఐక్యరాజ్య సమితి ఇస్తున్న మానవాభివృద్ధి సూచీలను మనం పరిశీలిద్దాం. తాజా మానవాభివృద్ధి సూచీ నివేదిక (హెచ్‌డిఆర్)లోని మొత్తం 193 దేశాలకు గాను భారత్ 134వ స్థానంలో వుంది. చైనా (75) కన్నా చాలా కిందన వుంది. అంతేకాక అనేక దక్షిణాసియా పొరుగు దేశాలు శ్రీలంక(78), భూటాన్(125), బంగ్లాదేశ్ (129) కన్నా కూడా భారత్ వెనుకబడే వుంది. వాస్తవానికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో భారతదేశ సాపేక్ష పనితీరు స్వల్పంగా క్షీణించింది. 2015 హెచ్‌డిఆర్ ప్రకారం, భారత్ ర్యాంకింగ్ 130గా వుంది. సాపేక్షంగా ఆర్థికాభివృద్ధి క్షీణిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా భారత్ హోదా పెరుగుతోందని చెప్పుకోవడం గందరగోళాన్ని కలిగిస్తుంది. కీలకమైన అంశాలపై సరైన డేటా లేకపోవడం (ఉదాహరణకు 2011 తర్వాత జనగణన జరగకపోవడం), డేటా నాణ్యత గురించి పదే పదే తలెత్తుతున్న సందేహాలు, గణాంక సంస్థల పని తీరులో జోక్యం చేసుకోవడం వల్ల ఈ గందరగోళాన్ని లేదా అస్పష్టతను పరిష్కరించడం కష్టమవుతోంది. అయినప్పటికీ, తాజా దశాబ్దంలో భారత ఆర్థిక వ్యవస్థ గురించి ఉన్నంతలో ఉత్తమమైన అభిప్రాయాన్ని ఇవ్వడానికి మనం అందుబాటులో వున్న గణాంకాలను ఉపయోగించాం.

మొదటగా, మనం అభివృద్ధి, జాతీయ ఉత్పత్తి పొందిక (స్థూల దేశీయోత్పత్తి, జిడిపి)ను పరిశీలిద్దాం. అధికారిక అంచనాల ప్రకారం, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ అధికారం చేపట్టేనాటికి భారతదేశ జిడిపి వృద్ధి రేటు పెరుగుతోంది. ఆ తర్వాత నుండి తిరోగమన బాట పట్టింది. మళ్ళీ 2020-21 తర్వాత మాత్రమే పెరుగుతూ వచ్చింది (అంటే కోవిడ్ నుండి కోలుకోవడాన్ని ఇది ప్రతిఫలిస్తోంది). మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ పెట్టుబడులతో ఎన్‌డిఎ ఆధ్వర్యంలో అభివృద్ధి ఊపందుకుంది. రోడ్లు, రైల్వేస్‌లో మెరుగుదల నమోదైంది. అయితే, పర్యావరణాన్ని గణనీయంగా పణంగా పెట్టి మౌలిక సదుపాయాల మెరుగుదలలు జరిగాయి. కొత్తగా వచ్చిన మౌలిక సదుపాయాలేవీ (ముంబయి వంటి నగరాల్లో మెట్రో వంటివి) కూడా ప్రజల అవసరాలకు తగిన విధంగా లేవు.

ఎన్‌డిఎ హయాంలో, ఉత్పత్తి పొందిక (వివిధ రంగాల వాటాలు వంటివి) గణనీయంగా మారలేదు. ఉదాహరణకు, మన అధికారిక లెక్కలను బట్టి చూసినట్లైతే తయారీ రంగం వాటా దాదాపు 18 శాతం (2011-12 ధరల వద్ద) దగ్గరే స్తంభించిపోయింది. ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా మారలేదు. 2017-18, 2022-23 మధ్య కాలంలో పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్‌ఎఫ్‌ఎస్) ప్రకారం, 43 శాతం మంది కార్మికులు వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల్లో పని చేస్తున్నారు.

ముఖ్యంగా భారత్ తన తయారీ రంగాన్ని అభివృద్ధి పరుచుకోవడంలోని అశక్తత ఆందోళన కలిగిస్తోంది. ఈ రంగంలో వృద్ధి వుంటే ఉద్యోగాలు కొత్తగా సృష్టించబడతాయి. ఎన్‌డిఎ హయాంలో తయారీ రంగం అభివృద్ధి రేటు క్షీణతను నమోదు చేసింది. 2015-16లో, వార్షిక తయారీ రంగ వృద్ధి దాదాపు 13శాతంగా వుంది. కానీ ఆ తర్వాత 2019-20లో మైనస్ 3 శాతానికి క్షీణిస్తూ వచ్చింది. 2019-20 తర్వాత అభివృద్ధి రేటు పెరిగినప్పటికీ, ఇది కోవిడ్ నుండి కోలుకోవడమే. ఆ రికవరీ తర్వాత ఇక తిరోగమనం కొనసాగింది. అభివృద్ధి చెందిన లేదా తూర్పు ఆసియా దేశాల చారిత్రక అనుభవం మాదిరిగా కాకుండా, భారత్, తయారీ రంగంలో క్షీణతను నమోదు చేస్తోంది. నిరాశ కలిగించే భారతదేశ తయారీ రంగ పని తీరులో ఎన్‌డిఎ వైఫల్యం, అలాగే బిజెపి ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమ వైఫల్యం ప్రతిబింబిస్తున్నాయి.

పెరుగుతున్న సంపద కేంద్రీకరణ పారిశ్రామిక రంగంలో సంభవించిన మరో మార్పు. స్థూలంగా చెప్పాలంటే, కొద్ది సంస్థలే ఆధిపత్యం చెలాయిస్తున్నపుడు కేంద్రీకరణ మరింతగా పెరుగుతుంది. గుత్తాధిపత్యం విపరీతంగా పెరుగుతుంది. ఈ ధోరణి పెరగడం పట్ల ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే ఇది వినియోగదారుని సంక్షేమాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఇలా సంపద కేంద్రీకరణ పెరగడమనేది ప్రభుత్వ-వాణిజ్య సంబంధాలకు సంబంధించిన పలు అంశాల్లో ప్రతిఫలిస్తుంది. ఉదాహరణగా చెప్పాలంటే ప్రభుత్వం కొన్ని వ్యాపార ప్రయోజనాలను పొందుతుంది. విరాల్ ఆచార్య (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ డిప్యూటీ గవర్నర్) చేసిన అధ్యయనం ప్రకారం, 1990ల తర్వాత, ఇలా సంపద కేంద్రీకృతమవడం తగ్గిపోతున్న ధోరణి నమోదైంది. కానీ ఇటీవలి సంవత్సరాల్లో మళ్ళీ విపరీతంగా పెరుగుతూ వచ్చింది. ఐదు వాణిజ్య సంస్థలు-రిలయన్స్ (ముకేష్ అంబానీ), టాటా, ఆదిత్య బిర్లా, అదానీ, భారతి టెలికం-ముందుండి ఈ తరహా పరిణామాలను నడిపిస్తున్నాయి. ఆర్థికేతర రంగంలో మొత్తం అమ్మకాల్లో, ఆస్తుల్లో వారి వాటా 2014 నుండి గణనీయంగా పెరుగుతోంది.



పెరిగిపోతున్న సంపద కేంద్రీకరణ పారిశ్రామిక రంగంలో సంభవించిన మరో మార్పు. స్థూలంగా చెప్పాలంటే, కొద్ది సంస్థలే ఆధిపత్యం చెలాయిస్తున్నపుడు కేంద్రీకరణ మరింతగా పెరుగుతుంది. గుత్తాధిపత్యం విపరీతంగా పెరుగుతుంది. ఈ ధోరణి పెరగడం పట్ల ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే ఇది వినియోగదారుని సంక్షేమాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఇలా సంపద కేంద్రీకరణ పెరగడమనేది ప్రభుత్వ-వాణిజ్య సంబంధాలకు సంబంధించిన పలు అంశాల్లో ప్రతిఫలిస్తుంది. ఉదాహరణగా చెప్పాలంటే ప్రభుత్వం కొన్ని వ్యాపార ప్రయోజనాలను పొందుతుంది. విరాల్ ఆచార్య (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ డిప్యూటీ గవర్నర్) చేసిన అధ్యయనం ప్రకారం, 1990ల తర్వాత, ఇలా సంపద కేంద్రీకృతమవడం తగ్గిపోతున్న ధోరణి నమోదైంది. కానీ ఇటీవలి సంవత్సరాల్లో మళ్ళీ విపరీతంగా పెరుగుతూ వచ్చింది. ఐదు వాణిజ్య సంస్థలు-రిలయన్స్ (ముకేష్ అంబానీ), టాటా, ఆదిత్య బిర్లా, అదానీ, భారతి టెలికం-ముందుండి ఈ తరహా పరిణామాలను నడిపిస్తున్నాయి. ఆర్థికేతర రంగంలో మొత్తం అమ్మకాల్లో, ఆస్తుల్లో వారి వాటా 2014 నుండి గణనీయంగా పెరుగుతోంది.

తమ ఆధిపత్య పోటీ తత్వాన్ని ప్రతిబింబించడం కన్నా కూడా ఈ గ్రూపుల ఆధిపత్యానికి...కేవలం ఎంపిక చేసిన కొద్ది కార్పొరేట్ సంస్థలనే ప్రమోట్ చేయాలన్న ప్రభుత్వ విధానం కారణంగా వుంది. అదానీ గ్రూపు, మోడీ ప్రభుత్వానికి మధ్య గల సంబంధం అందరికీ తెలిసిందే. ఎన్‌డిఎ హయాంలో ప్రభుత్వ-వ్యాపార సంబంధాలు బాగా మార్పు చెందాయి. ఆ సంబంధాలను వివరించేందుకు ఆశ్రిత పక్షపాతం, క్రోనీ క్యాపిటలిజం అన్న పదాలను సాధారణంగా ఉపయోగిస్తున్నాం. ఆ కొద్ది బిజినెస్ గ్రూపులు పొందుతున్న ప్రభుత్వ ప్రాధాన్యతా ధోరణిని ఇవి బాగా వివరిస్తున్నప్పటికీ అవినీతి, ప్రభుత్వ నియంత్రణ కొత్త రూపాలను చెప్పడానికి ఏ మాత్రమూ సరిపోవు. ఉదాహరణకు, ఎన్నికల బాండ్ల డేటాను చూసినట్లైతే, క్విడ్ ప్రో కో ఒప్పందాలను కుదుర్చుకోవడానికి లేదా బలవంతపు వసూళ్ళకు ఒక మార్గంగా వీటిని ఉపయోగించారని స్పష్టమవు తోంది. ఈ మార్గంలో అత్యధికంగా లబ్ధి పొందింది బిజెపినే.

రెండవది, ఇటీవలి కాలంలో బాగా అధ్వాన్నంగా మారిన అసమానతల గురించి మనం పరిశీలిద్దాం. విస్తృతంగా ఉపయోగించే హురున్ లిస్ట్ ప్రకారం, 2012-22 మధ్య కాలంలో, అత్యంత సంపన్నులైన వ్యక్తులు లేదా కుటుంబాల (రు.1000కోట్లకు పై చిలుకు) సంఖ్య 10 రెట్లు (100 నుండి 1103కు) పెరిగింది. డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా దాదాపు నాలుగు రెట్లు (59 నుండి 221)కు పెరిగింది. ఈ జాబితాలో తాజా (2024) ఎడిషన్ ప్రకారం కేవలం ఒక్క ఏడాదిలోనే భారత్‌లో 94 మంది బిలియనీర్లు కొత్తగా తయారయ్యారు. చైనాలో ఈ సంఖ్య 55గా వుంది. ఊహించినట్లుగానే, ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీలు అత్యధికంగా సంపదను ఆర్జించారు (ఒక్కొక్కరు 33 బిలియన్ల డాలర్లు చొప్పున). బీజింగ్ (91)ను అధిగమించి ఈనాడు ముంబయిలో మరే ఇతర ఆసియా నగరంలో లేనంతగా అత్యధిక సంఖ్యలో కోటీశ్వరులు (92) వున్నారు. ఆసియా శత కోటీశ్వరుల రాజధానిగా పేరుగాంచింది. థామస్ పికెట్టి (కేపిటల్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ రచయిత), ఆయన సహచరులు వలసవాద కాలం నుండి ఈ నాటి వరకు నెలకొన్న భారతీయ అసమానతలను గుర్తించారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత, 1980వ దశకం తొలినాళ్ళ వరకు అసమానతలు తగ్గుతూ వచ్చాయని వారు కనుగొన్నారు. కానీ ఆ తర్వాత పెరుగుతూ వచ్చాయి. 2000 దశకం ప్రారంభం నుండి అసమానతలు బాగా తీవ్రంగా పెరుగుతూ వచ్చాయి. ఫలితంగా, ప్రస్తుతం పైనున్న ఒక శాతం వ్యక్తుల దగ్గర ఆదాయం, సంపద వాటాలు వరుసగా 22.6 శాతం, 40.1 శాతంగా వున్నాయి. ఇవి చారిత్రకంగా ఇంతకు ముందు కనివినీ ఎరుగని స్థాయిల్లో వుండడమే కాదు. పైనున్న ఒక శాతం వ్యక్తుల ఆదాయ వాటా ఇతర దేశాల్లోని (బ్రెజిల్, దక్షిణాఫ్రికా, చైనా, అమెరికాతో సహా) ఇదే శాతం వ్యక్తుల ఆదాయ వాటా కన్నా కూడా అధికంగా వుంది.

మూడవది, ఉపాధి అంశాన్ని పరిశీలిద్దాం. 2022-23లో నిరుద్యోగం రేటు (పిఎల్‌ఎఫ్‌ఎస్ నుండి 5.1 శాతం) ఎన్‌డిఎ అధికారంలోకి రావడానికి ముందుకన్నా (కరంట్ వీక్లీ స్టేటస్, ఉపాధి, నిరుద్యోగంపై గత జాతీయ శాంపిల్ సర్వే ఫలితాల ప్రకారం 2011-12లో 3.7 శాతం) అధికంగా వుంది. అన్నింటికంటే ముఖ్యంగా, యువతలో, విద్యావంతుల్లో నిరుద్యోగం రేట్లు చాలా ఎక్కువగా (సాధారణ స్థితి) వున్నాయి. 2022-23లో, సెకండరీ లేదా ఉన్నత విద్య అభ్యసించిన పురుషులు, మహిళల్లో నిరుద్యోగం రేట్లు వరుసగా 6.4 శాతం, 10.3 శాతంగా వున్నాయి. అదే ఏడాది, యువకులైన పురుషులు, మహిళల్లో (15-20 సంవత్సరాలు) నిరుద్యోగం రేట్లు వరుసగా 9.7 శాతం, 10.6 శాతంగా వున్నాయి. కొంత కోలుకున్నప్పటికీ (అభివృద్ధి గణాంకాలు సూచిస్తున్నట్లుగా) కోవిడ్ సమయంలో భారత కార్మిక వర్గం చాలా ఇబ్బందులకు గురైంది. భారతీయుల్లో గణనీయ సంఖ్యలో కార్మికులు అసంఘటిత రంగంలో వున్నారన్న విషయం విదితమే. కోవిడ్ పరిస్థితులను సరిగా ఎదుర్కొనడంలో విఫలమవడంతో అసంఘటిత రంగం బాగా దెబ్బతింది. వలస కూలీలు వందలాది కిలోమీటర్లు నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. కోవిడ్ అసంఘటిత రంగాన్ని, పరిస్థితులను మరింత పెంచిందని, ఆదాయాలు తగ్గించిందని, మహిళలు, యువత ఈ భారాన్ని పంచుకున్నారని సెంటర్ ఫర్ సబ్‌స్టాన్షియల్ ఎంప్లాయ్‌మెంట్ తన నివేదికలో పేర్కొంది. ప్రారంభంలో ఎదురైన పజిల్‌ను పరిష్కరించడం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నూతన భారతదేశ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవడానికి కూడా మనకు సాయపడుతుంది. అంతర్జాతీయంగా భారత్‌కు పెరుగుతున్న హోదా లేదా స్థాయి అనేది ప్రాథమికంగా, భారత సంపన్న వర్గాలు (వాణిజ్య, వ్యాపార వర్గాలు, వృత్తి నిపుణులు) ఇతర దేశాల్లోని ఇదే తరహా సంపన్నులతో పోలిస్తే ఎలా వ్యవహరిస్తారనే దానిపై ఆధారపడి వుంటుంది. పైగా భారతదేశంలో వారు మరింతగా సంఘటితమవడం ద్వారా దీనికి మరింత వెసులుబాటు కల్పించబడింది. మనం పైన చూసినట్లుగా గత దశాబ్ద కాలంలో ఇది జరిగింది. ఎన్‌డిఎ హయాంలో మొత్తంగా ఆర్థికాభివృద్ధి అనేది మందగించింది. బలహీనమైన తయారీ రంగం, నిరుద్యోగాన్ని పెంచే వృద్ధి, విద్యావంతుల్లో అధిక నిరుద్యోగం వంటి సుదీర్ఘ కాలంగా వున్న సమస్యలు మరింతగా వేళ్ళూనుకుపోయాయి. ఆదాయం, సంపద దృష్ట్యా చూసినట్లైతే అసమానతలు ఆకాశాన్నంటేలా పెరిగాయి. మనకు అంతర్జాతీయంగా అనుసంధానించబడిన ఆర్థిక వ్యవస్థ వుంది. దీనివల్ల ఉన్నత స్థాయి వర్గాలకు ప్రయోజనాలు వున్నాయి. కానీ మెజారిటీ వర్గాలు వెనుకబడి పోయాయి. సంపన్నులు సంఘటితం అవుతున్నప్పటికీ, అంతర్జాతీయంగా తమ స్థాయి పెరుగుతోందని భావిస్తున్నప్పటికీ హెచ్‌డిఐపై నిరాశాజనకంగా వున్న పని తీరు మాత్రం దీన్ని వివరిస్తుంది. 2014లో ఎన్‌డిఎ విజయాన్ని యుపిఎ సంక్షేమ దృక్పథానికి వ్యతిరేకంగా సంపన్న వర్గాలు కొట్టిన ఎదురుదెబ్బగా చూడవచ్చు. 2019 తర్వాత కాలంలో, వాణిజ్య వర్గాలు, వృత్తి నిపుణులు మరింత బలపడ్డారు. మోడీ, బిజెపికి అండగా నిలబడ్డారు.

అటువంటపుడు, ప్రజల్లో గణనీయమైన వర్గం (స్పష్టంగా చెప్పాలంటే మెజారిటీ కాదు) ఈ ప్రభుత్వానికి ఎందుకు మద్దతునిస్తోంది? భారత దేశ ఆర్థిక వ్యవస్థ, దీని సంక్షేమ దృక్పథం, అంతర్జాతీయంగా పెరుగుతున్న స్థాయి, నూతన జాతీయవాదం లేదా ప్రస్తుత నాయకత్వం ఇందుకు కారణమా? ఈ ప్రశ్నకు సమాధానం ఈ ఆర్థిక వ్యవస్థలో లేదని మనం విశ్వసిస్తున్నట్లు ఈ వ్యాసంలోనే చూశాం. ఎందుకంటే గణనీయమైన మెజారిటీ వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఈ ఆర్థిక వ్యవస్థ పనిచేయడం లేదు. ఆర్థికాంశాలను మాత్రమే మనం పరిగణనలోకి తీసుకున్నట్లైతే, మెరుగైన సంక్షేమం కోసం పాటు పడుతున్నామని చెప్పుకుంటున్నప్పటికీ ఈ ఎన్‌డిఎ ప్రభుత్వం కచ్చితంగా కూలుతుంది. సంక్షేమ కార్యక్రమాలు, పథకాల దృష్ట్యా చూసినట్లైతే యుపిఎ ప్రభుత్వం (2004-2014) కచ్చితంగా మెరుగైన స్థితిలో వుంటుంది. ప్రధాని మోడీకి ప్రచారాన్ని పెంచేందుకు యుపిఎ సంక్షేమ పథకాలకే ఎన్‌డిఎ ప్రభుత్వం మళ్లీ తమదైన ముద్ర వేసి మార్కెట్ చేసుకుంటోంది. వాస్తవానికి ఈ విధానాలను విస్తరించకుండా ప్రజల వద్దకు మాత్రమే చేరవేస్తోంది.

ఆర్థికేతర కారణాల్లో, పెరుగుతున్న అంతర్జాతీయ స్థాయికి సంబంధించి చేస్తున్న వాదన ఎంతమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. చాలా ఎక్కువగా ప్రచారం చేసినప్పటికీ, మెజారిటీ భారతీయులకు జి-20 సదస్సు గురించి తెలియదనేది ఒక అంశం. ప్రధానంగా మెజారిటీ ప్రజల ఆందోళనంతా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గురించే. ప్రస్తుత నాయకత్వానికి అదనంగా ఎన్‌డిఎకు మద్దతునివ్వడానికి మినహాయింపు జాతీయవాదం ముద్రతో చాలా సంబంధముంది. ప్రతిపక్ష పార్టీల్లో విభేదాల వల్ల కాని, అణచివేత చర్యల వల్ల కాని సమైక్య ప్రతిపక్షాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాలు పాక్షికంగా మాత్రమే విజయం సాధించాయి. అత్యధిక సంఖ్యలో వున్న సెక్షన్ల ప్రజానీకాన్ని విస్మరించిన ఈ జాతీయవాదాన్ని, వ్యక్తిగత చరిష్మాను ఉపయోగించుకుంటూ కొన్ని ప్రభావిత వర్గాలు (మెజారిటీ సంఖ్యాకులు కాదు అని పునరుద్ఘాటించాల్సిన అవసరం లేదు) ఈ ప్రభుత్వానికి ఎంతకాలం తమ మద్దతును కొనసాగిస్తాయి? ప్రభుత్వ ఆర్థిక పరిస్థితికి సంబంధించి వారి సొంత గణాంకాలు అత్యంత బాధాకరంగా వున్నప్పటికీ వారు దాన్ని గురించి పట్టించుకున్నట్టు కనిపిస్తోందా?

/ వ్యాస రచయితలు శ్రీపాద్ మోతీరాం బోస్టన్‌లోని మసాచుసెట్స్ యూనివర్శిటీలో ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్. వంశీ వకుళాభరణం మసాచుసెట్స్ అమ్హెరిస్ట్ యూనివర్శిటీలో ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్/

◆

యుద్ధాలు వద్దనండి

కె. శాంతారావు

వ్యాఖ్య

హమాస్, పాలస్తీనా శత్రు శేషం లేకుండా చేయాలనుకునే నెతన్యాహు పంతం ఎప్పటికీ నెరవేరదన్న సత్యం ఈ ఆర్నెల్లలో తేలిపోయింది. ఇజ్రాయిల్ యుద్ధ మారణకాండకు స్వస్తి చెప్పి వెనక్కి మరలడమే అంతటా శ్రేయస్కరం. కాగా ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాకు పూర్తి స్థాయి సభ్యత్వం కల్పించాలంటూ భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వ్యతిరేకిస్తూ వీటో చేసింది. దీంతో అమెరికా తన యుద్ధ నైజాన్ని దాచుకోలేకపోయింది.

'వద్దనండి, వద్దనండి, యుద్ధాలు వద్దనండి/ శాంతి దూతలారా! దేశాధినేతలారా!/ భావి భారతీయులారా! భారతమ్మ బిడ్డలారా!/ వద్దనండి!'

దేవేంద్ర విరచిత గీతం సుమారు నలభై ఏళ్ల క్రితం ఆబాల గోపాలం పాడుకుంటూ, శాంతి నినాదాల ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శనల్లో పాల్గొనేది. అప్పటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌ను న్యూట్రన్ బాంబుతో (సంపదను యథాతథంగా ఉంచి మనుషులను, జీవాలను బలిగొనే బాంబు ప్రపంచాన్ని బెదిరిస్తూ ఉంటే, ఆరుద్ర గారు న్యూట్రాను బాంబు కట్టె రీగనోడా! నీవు పెట్రేగిపోతున్నావు రీగనోడా! అనే పాటతో నినదించాడు.

ప్రస్తుతం అలానే ప్రజా ఉద్యమాలతో అనుసంధానంగా ఎక్కడికక్కడ శాంతి ఉద్యమాలు నడపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ప్రజలకు యుద్ధ ప్రమాదాలను తెలుపుతూ శాంతి చైతన్యం మరల పాదుకొల్పాల్సిన స్థితి నెలకొన్నది.

యుద్ధాలకు ప్రధాన కారణం సామ్రాజ్యవాద ఆర్థిక దోపిడే అన్న సత్యాన్ని కామ్రేడ్ లెనిన్ పదే పదే నొక్కి చెప్పేవాడు. ప్రచ్ఛన్న యుద్ధం కాదు సాక్షాత్తు ప్రత్యక్ష యుద్ధాలే నేడు పక్కలో బల్లాల్లా మనతో పాటు మన వెంట నడుస్తున్నాయి.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గత రెండేళ్లకు పైగా కొనసాగుతూనే ఉన్నది. ఈ యుద్ధంలో దాదాపు అయిదు లక్షల మందికి పైగా ప్రజలు విగతజీవులయ్యారని అంచనా. ఎవరూ విజేతలైనా అంతిమంగా బలైపోయేది పసిపిల్లలు, చిన్నారులు, మహిళలు, అమాయకపు ప్రజానీకమే.

ఉక్రెయిన్ యుద్ధానికి అమెరికా సైన్యం పంపితే అణుయుద్ధం జరిగే ప్రమాదం ఉన్నదని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించడంతో పరిస్థితి కొంత సద్దుమణిగింది. రష్యాతో పోరాడేందుకు తాము ఉక్రెయిన్‌కు సైన్యాన్ని పంపబోమని అమెరికా వైట్‌హౌస్ ప్రకటించవలసి వచ్చింది.



మే చివరలో రష్యా కొత్త దాడిని ప్లాన్ చేస్తున్నట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపిస్తున్నాడు. దక్షిణ ఉక్రెయిన్ దాడిలోని ఒడెసా పట్టణంలో రష్యా చేసిన క్షిపణులదాడిలో ఇటీవల పదహారు మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఈ పోరాటం రష్యా ఆధీనంలోనే ఉన్నది.

కాగా, ఇజ్రాయిల్‌పై ఇరాన్ తాజాగా చేసిన ఆయుధ దాడి నుంచి తప్పించుకోవడానికి గగనతల రక్షణ చట్రాన్ని ఇజ్రాయిల్ ఏర్పాటు చేసుకున్నది. అలాంటి రక్షణ చట్రాన్ని తమకు ఎందుకు కల్పించలేదని జెలెన్‌స్కీ ఇప్పుడు అమెరికా నాటో దేశాలను ప్రశ్నిస్తున్నాడు. అసలు రష్యాపై ఉక్రెయిన్‌ను ఎగదోసింది ఈ నాటో దేశాలే. మాకు అవసరమైనన్ని ఆయుధాలను సరఫరా చేయకపోతే మేమెలా రష్యాను ఎదుర్కోగలం? అంటూ వాపోతున్నాడు జెలెన్‌స్కీ. పైగా ఇజ్రాయిల్ నాటో సఖ్య దేశం కాకపోయినా, నాటో దేశాలు ఇజ్రాయిల్‌కు అండగా ఉంటున్నాయని, ఈ పక్షపాత వైఖరి ఏమిటని ఆక్రోశిస్తున్నాడు. చివరకు అమెరికా సాయం వెంటనే విడుదల చేయకపోతే తాము గెలిచే అవకాశం లేనే లేదని కుండబద్దలు కొట్టాడు.

ఇదిలా ఉండగా జీవాయుధ ప్రయోగశాలలు ఉక్రెయిన్‌లో ఉన్నట్టు, అలాంటి రసాయనాల ఆయుధాల వ్యాప్తికి అది సిద్ధమవుతున్నట్టు రష్యా పేర్కొంటున్నది. రెండేళ్లకు పైగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇప్పటికి రష్యా పద్దెనిమి శాతం ఉక్రెయిన్ భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నది. అందులో రెండు స్వతంత్ర ప్రాంతాలు కూడా ఉండటం గమనార్హం.

ఇలాంటి పరిస్థితుల్లో రష్యాను ఎదుర్కొనే సత్తా ఉక్రెయిన్‌కు లేనేలేదని, అయినా జెలెన్‌స్కీ ఇంకా పశ్చిమ దేశాల సాయం కోసం ప్రాకులాడటం ఆశ్చర్యం గొలుపుతున్నదని పరిశీలకులు భావిస్తున్నారు. ఏతావాతా తేలిందేమిటంటే అమెరికా, నాటో దేశాల చేతుల్లో బందీ అయిన జెలెన్‌స్కీ అనవసరంగా కాలుదువ్వుతూ యుద్ధం పేరిట అసంఖ్యాక ప్రాణనష్టానికి కారణం అవుతున్నట్టు అర్థమవుతున్నది.

ఆర్నెల్ల క్రితం అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ ఆకస్మిక దాడితో ప్రారంభమైన ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధం ఇప్పటికి ముప్పై వేల మందికి పైగా ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నది. గాజాను సమూలంగా నేలమట్టం చేసేందుకు వెనుకాడేదిలేదని ఇజ్రాయిల్ విర్రవీగుతున్నది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1న సిరియా రాజధాని డమాస్కస్ లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయిల్ దాడి చేసి ముఖ్య అధికారులు పన్నెండు మందిని బలితీసుకున్నది. ఇరాన్ ఇందుకు ప్రతీకార చర్యగా ఇజ్రాయిల్‌పై క్షిపణులను, డ్రోన్‌లను ప్రయోగించింది. ప్రాణ నష్టం సంభవించనప్పటికీ యుద్ధ మేఘాలు కారుమబ్బులా పశ్చిమాసియా అంతటా కమ్ముకున్నాయి. మరల ఇజ్రాయిల్ ఇందుకు ప్రతీకారంగా ఇరాన్‌పై, ఆ దేశ అధినేత అయితుల్లా ఖొమెన్ 85వ పుట్టిన రోజున శుక్రవారం నాడు పెద్ద ఎత్తున క్షిపణులతో విరుచుకుపడింది. ఇలా యుద్ధ దాడులు-ప్రతి దాడులతో పరిస్థితి పూర్తిగా విషమించింది.

ఇరాన్‌కు మద్దతుగా హెజ్బులా హైతి వంటి తీవ్రవాద సంస్థలు ఎర్ర సముద్రంలో మెరుపు దాడులు చేస్తూ నౌకా రవాణా చర్యలను స్తంభింపచేస్తున్నాయి. చమురు రవాణాకు ఆటంకం ఏర్పడి పరిస్థితులు అతలాకుతలం అవుతున్నాయి. ఈ సంస్థల దాడులు నివారించాలనే ఉద్దేశ్యంతో అమెరికా బ్రిటన్‌లు రంగంలోకి దిగుతున్నాయి. ఇజ్రాయిల్‌తో అమెరికా బ్రిటన్‌లు ఇలా చెట్టపట్టాలేసుకుని తిరగడం పట్ల చమురు కేంద్రమైన పశ్చిమాసియా నేడు రావణ కాష్టంలా మండుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ఇరాన్‌తో ఇజ్రాయిల్‌గాని ఒకవేళ కయ్యానికి కాలు దువ్వితే తాను ఏమాత్రం రక్షించబోనని అమెరికా పైకి అంటున్నది. అమెరికా పాలకులు ఎవరైనా ఇజ్రాయిల్‌ను వెనకేసుకురావడం జగమెరిగిన సత్యం. కారణం పెట్టుబడిదారులు-ఆయుధ వ్యాపారుల మధ్యగల 'జిగినీ' దోస్తీ.

ఒకవేళ అమెరికా గాని ఇజ్రాయిల్‌కు మద్దతుగా దాడికి దిగితే తానూ రంగప్రవేశం చేయవలసి ఉంటుందని రష్యా ఇక్కడ కూడా ప్రకటించింది. కాబట్టి గాజా యుద్ధం ప్రపంచాన్ని చుట్టుముడుతుందా? అన్న భయాందోళనలు ఎల్లెడలా వ్యక్తం అవుతున్నాయి. అమెరికా అండదండలు లేకుండా ఇజ్రాయిల్ చెలరేగలేదు. వర్తమాన యుద్ధోన్మాద ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహుకు ముకుతాడు వేయకపోతే పరిస్థితి చేయిదాటే ప్రమాదం ఉన్నది.

హమాస్, పాలస్తీనా శత్రు శేషం లేకుండా చేయాలనుకునే నెతన్యాహు పంతం ఎప్పటికీ నెరవేరదన్న సత్యం ఈ ఆర్నెల్లలో తేలిపోయింది. ఇజ్రాయిల్ యుద్ధ మారణకాండకు స్వస్తి చెప్పి వెనక్కి మరలడమే అంతటా శ్రేయస్కరం. కాగా ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాకు పూర్తి స్థాయి సభ్యత్వం కల్పించాలంటూ భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వ్యతిరేకిస్తూ వీటో చేసింది. దీంతో అమెరికా తన యుద్ధ నైజాన్ని దాచుకోలేకపోయింది.

ఆకలి, అవిద్య, అనారోగ్యంపై యుద్ధాలు చేయవలసిన దేశాధినేతలు, వాటిపై కాకుండా ఇలా ఆధిపత్య యుద్ధాలతో ఆయుధ వర్షాలు కురిపించుతున్న ప్రతిసారీ మానవాళి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ ప్రమాదం ముంచుకురాకుండా ఉండాలంటే ప్రజలకు ఎప్పటికప్పుడు యుద్ధ కారణాలు, వాస్తవాలు తెలియచేయాలి. ప్రపంచశాంతి ఉద్యమానికి ప్రతిఒక్కర్ని సన్నద్ధం చేయాలి. ప్రజల కోసం, ప్రపంచశాంతి కోసం మరణించేవారు ఎల్లకాలం జీవించే ఉంటారన్న ఫైడెల్ కాస్ట్రో సూక్తిని ప్రతి ఒక్కరం గుర్తెరగాలి.

/ వ్యాసకర్త సెల్ : 9959745723 /

మోడీ విద్వేష ప్రసంగాలపై స్పందించరేం?

ఎన్నికల కమిషన్‌కు సీతారాం ఏచూరి మరో లేఖ • ఈ ఫిర్యాదుపైనైనా స్పందించాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : విద్వేష ప్రసంగాలు చేస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న ప్రధాని నరేంద్ర మోడీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియా ఢిల్లీ ఎడిషన్లలోని మొదటి పేజీల్లో మోడీ ప్రసంగాలకు సంబంధించి వచ్చిన క్లిప్పింగ్‌లను కూడా ఆ లేఖతో పాటూ జతపరిచి పంపారు. బిజెపి చీఫ్‌గా నరేంద్ర మోడీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం చేస్తూ, రెచ్చగొట్టేలా అత్యంత విద్వేషపూరితమైన వ్యాఖ్యలు, ప్రసంగాలు చేసిన వార్తలు ఆ క్లిప్పింగ్‌ల్లో వున్నాయి.

రాజస్థాన్‌లోని బన్స్‌వాడాలో ఆదివారం బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ, "మీరు ఎంతగానో కష్టపడి సంపాదించిన సొమ్మును మరింతమంది పిల్లలున్నవారికి, చొరబాటుదారులకు ఇచ్చేస్తారా?" అని పరోక్షంగా ముస్లింలను సూచిస్తూ ప్రశ్నించారు. ఈ మూడు వార్తాపత్రికల్లోనే కాకుండా మోడీ చేసిన ఈ ప్రసంగ వార్తలు ప్రధాన స్రవంతిలోని మీడియా, సోషల్ మీడియాలోనూ వచ్చాయి. నిర్దిష్టంగా ఏ కమ్యూనిటీనైనా లక్ష్యంగా చేసుకోవడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(3)ని పూర్తిగా ఉల్లంఘించడమేనని ఎన్నికల కమిషన్ అంగీకరిస్తుంది. ఇవి కాకుండా, ప్రజా కార్యాచరణ, బూటకపు వార్తలు, మతాన్ని ప్రేరేపించడం, విద్వేష పూరితమైన ప్రసంగాలు చేయడం వంటి అంశాలపై రాజకీయ పార్టీలను హెచ్చరిస్తూ ఎన్నికల కమిషన్ ప్రతీసారీ సూచనలు జారీ చేస్తూనే వచ్చింది. తాజాగా మార్చి 1వ తేదీన కూడా ఇందుకు సంబంధించి సర్క్యులర్ జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను దారుణంగా ఉల్లంఘిస్తూ గతంలో జరిగిన సంఘటనల గురించి సిపిఎం ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువచ్చిందని ఏచూరి ఆ లేఖలో గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదు చేస్తూ ఈ నెల 13న లేఖ రాశామని తెలిపారు. మతాన్ని ప్రేరేపిస్తూ, అయోధ్యలో రామాలయంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ ప్రతిపక్ష పార్టీలపై, నేతలపై తీవ్రమైన ఆరోపణలు చేశారని, వారిని రాముడికి వ్యతిరేకులుగా ముద్ర వేశారని పేర్కొంటూ అందుకు సంబంధించి మోడీ వివిధ సందర్భాల్లో చేసిన ప్రసంగాలను ఏచూరి ఆ లేఖలో ఉదహరించారు. ఈ ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ స్పందన ఏమిటో ఇంతవరకు తమకు ఎలాంటి సమాచారం లేకపోవడం విచారకరమని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు. ఒక కమ్యూనిటీని ఉద్దేశించి విద్వేష ప్రసంగానికి పాల్పడడం చాలా దారుణమైనదని అన్నారు. ఇటువంటి విద్వేష ప్రసంగాలు చేసిన నేతలపై నిషేధాలు విధించిన ఘటనలు గతంలో వున్నాయని ఏచూరి గుర్తు చేశారు. ప్రధాని మోడీ చేసిన ప్రసంగాలపై తాజాగా చేసిన ఫిర్యాదును కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా ఎన్నికల కమిషన్‌ను ఏచూరి ఆ లేఖలో కోరారు. తక్షణమే మోడీపై, బిజెపిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్నందుకు ప్రధాని మోడీపై ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయాల్సిన అవసరం వుందన్నారు. మరింతగా ఈ పరిస్థితులను దిగజార్చకుండా ఇటువంటి చర్చలు, ప్రసంగాలు నిలిపివేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

సరైన చర్యలు తీసుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమైతే ఒక స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా ఇసి విశ్వసనీయతను ఇది మరింత దెబ్బతీస్తుందని, స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు జరిగే వాతావరణాన్ని మరింత పాడు చేస్తుందని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు.

మోడీపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు తిరస్కృతి

- ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు సిపిఎం నేతల లేఖ
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందుకోవడానికి అధికారుల తిరస్కృతి



న్యూఢిల్లీ : సమాజంలోని వివిధ గ్రూపుల మధ్య శతృత్వాన్ని రెచ్చగొట్టేలా ప్రకటనలు, ప్రసంగాలు చేస్తున్న ప్రధాని మోడీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పుష్పేందర్ సింగ్ గరేవాల్‌లు ఢిల్లీలోని మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఒకు ఫిర్యాదును అందజేశారు. జాతీయ సమగ్రతకు భంగం వాటిల్లేలా ఆరోపణలు, ప్రకటనలు చేస్తున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదును స్వీకరించడానికి మందిర్‌మార్గ్ పోలీసు స్టేషన్ తిరస్కరించడంతో దాన్ని ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలతో రాసిన లేఖను వారు విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న వ్యాఖ్యలు, ప్రసంగాలన్నీ కూడా ఐపిసిలోని 153ఎ, 153బి, 298, 504 సెక్షన్ల కింద విద్వేష ప్రసంగాల కిందకే వస్తాయని అందుకే వాటిపై తాము ఫిర్యాదు చేస్తున్నామని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని బన్స్‌వాడాలో ఆదివారం (21వ తేదీ) చేసిన ప్రసంగంలో మోడీ ఉద్దేశ్యపూర్వకంగానే, వ్యూహాత్మకంగానే ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. హిందూ కమ్యూనిటీ ఆస్తులకు ముఖ్యంగా మహిళల బంగారం, మంగళసూత్రాలను కాంగ్రెస్ పార్టీ ముస్లిం కమ్యూనిటీ సభ్యులకు పంచిపెడుతుందని, ఆ రకంగా హిందువుల ఆస్తులకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని వారికి ఒక భావం కలిగేలా వ్యాఖ్యలు చేశారు. ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుని, విద్వేష ప్రసంగాలు చేస్తూ ఓట్లు అడగడం తీవ్రమైన చట్ట వ్యతిరేకమని, ప్రధానమంత్రి చేసింది అదేనని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.

భారతీయ ముస్లింలను చొరబాటుదారులుగా, దోపిడీదారులుగా, హిందువులకు ముఖ్యంగా హిందూ మహిళలకు ముప్పుగా పేర్కొనడం మతోన్మాదం యొక్క అసాధారణ లక్షణమేమీ కాదు. ఇందుకు సంబంధించి గతంలో ఉదాహరణ చూసినట్లైతే అది, బాబూరావు పటేల్ వర్సెస్ ఢిల్లీ (అడ్మినిస్ట్రేషన్) (1980) 2 ఎస్‌సిసి 402లో సుప్రీం కోర్టు తీర్పులో కనబడుతుంది. గూగుల్‌లో వెతికినా కూడా అనేక ప్రసంగాలు, వ్యాసాలు కనిపిస్తాయి. భారతదేశంలోని ముస్లింలను (మొఘలులతో ముడిపడిన) దురాక్రమణదారులుగా అభివర్ణించారు.

ప్రధాని ఉద్దేశ్యపూర్వకంగానే, రాజ్యాంగ విరుద్ధమైన 'చొరబాటుదారు లేదా దురాక్రమణదారు' అనే పదాలను వాడుతున్నారు, వారికి హిందువుల ఆస్తులు పంచిపెడతారని అభివర్ణిస్తున్నారు. దేశంలో వనరులపై ముస్లింలకే మొదటి హక్కు వుందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారంటూ ప్రస్తావించిన తర్వాతనే ఈ వ్యాఖ్యలు చేశారు. హిందువులను, వారి ఆస్తులను మరింతమంది పిల్లలు వున్న చొరబాటుదారులకు (ముస్లింలకు) అప్పగిస్తున్నారనే భావన వారికి కలిగేలా ఈ వ్యక్తీకరణ వుంది. అందువల్ల ముస్లింల చేతుల్లో హిందువులు అణగదొక్కబడతారనే భయందోళనలు కలిగేలా గౌరవనీయులైన ప్రధాన మంత్రి ప్రసంగం వుంది, ఇది దేశ ఐక్యతకు ముప్పు కలిగించేది, పైగా విద్వేష ప్రసంగం కిందకే వస్తుందని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.

ప్రధాని చేసే ప్రకటనలు రెచ్చగొట్టేలా, కమ్యూనిటీల మధ్య చెడు అభిప్రాయాలు పెచ్చరిల్లేలా వున్నాయి. ఇవి చట్టవిరుద్ధం. తల్లుల, సోదరీమణుల బంగారం, మంగళసూత్రాల గురించి మాట్లాడుతూ స్పష్టంగా హిందువులను ఆయన ప్రస్తావించారు. ముస్లింల గురించి ఆయన తన ప్రసంగాల్లో పదే పదే చొరబాటుదారులు, దురాక్రమణదారులని పేర్కొంటున్నారు. పదే పదే ఇదే తరహాలో ప్రసంగాలు చేయడం వల్ల ముస్లిం కమ్యూనిటీ దూషణలకు గురవుతోంది. లౌకికవాదం విలువల గురించి, ఈ దేశ పౌరుల సమానత్వం గురించి వివరించే ఈ దేశం యొక్క జాతీయ సమగ్రత, ఐక్యతలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దీనివల్ల ముస్లిం సభ్యులకు తీవ్ర ముప్పు కలుగుతోంది. ఘోర అవమానం జరుగుతోంది. ముస్లింల, భారతీయ పౌరుల మత విశ్వాసాలు దెబ్బతింటున్నాయని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.

సెక్షన్ 153ఎ, బి ల కింద జరిగే నేరాల స్వభావం గుర్తించదగ్గవైనందున, పైన ప్రస్తావించిన ఘటనపై తక్షణమే ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేయాలని, దానిపై తగురీతిలో దర్యాప్తు నిర్వహించాలని వారు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని చేస్తున్న ప్రసంగాలను, జరగబోయే ఎన్నికలను దృష్టిని వుంచుకుంటే ప్రధాని మాటలు కచ్చితంగా రెచ్చగొట్టేలా వున్నాయని, తీవ్ర పర్యవసానాలకు దారి తీస్తాయని అర్థమవుతోంది. పైగా, ఇటువంటి కేసుల్లో ఈ ప్రసంగాలు దేశవ్యాప్తంగా ప్రసారమవుతుండడం వల్ల వీటి ప్రభావం కూడా దేశవ్యాప్తంగానే వుంటుందని పేర్కొన్నారు. ఏ పౌరుడైనా, వారు ఎంత ఉన్నతస్థాయిలో వున్నవారైనా చట్టానికి అతీతులు కాదనేది సుస్పష్టం. ఈ పరిస్థితుల్లో పైన పేర్కొన్న నిబంధనలు,సెక్షన్ల కింద ప్రధాని మోడీపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని సిపిఎం నేతలు కోరారు.

సిఎఎ రాజ్యాంగ విరుద్ధం

- యుఎస్ కాంగ్రెస్ నివేదిక

వాషింగ్టన్ : భారత ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ఆ దేశ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని అమెరికన్ కాంగ్రెస్ నివేదిక వెల్లడించింది. ముస్లింలను మినహాయించి, మూడు దేశాల్లోని ఆరు మతాలకు చెందిన వలసదారులకు పౌరసత్వం మంజూరు చేసే సిఎఎలోని కీలక నిబంధనలు భారత రాజ్యాంగంలోని కొన్ని నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్‌ఎస్) తన 'ఇన్ ఫోకస్' అనే నివేదికలో పేర్కొంది. మతపరంగా మెజార్టీలను మాత్రమే రక్షించడానికి రూపొందించిన సిఎఎ మైనారిటీలకు ఉపయోగపడదని విమర్శించిన నివేదిక.. లౌకిక భారతదేశాన్ని నాశనం చేయడానికి మోడీ, బిజెపి ప్రయత్నిస్తున్నాయని విమర్శలను ప్రస్తావించింది. 2019లో ఈ పౌరసత్వ సవరణ బిల్లును భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు ఆ దేశంలో ఉన్న అమెరికా దౌత్యవేత్త ఆందోళన వ్యక్తం చేసినట్లు కూడా నివేదిక గుర్తు చేసింది. సిఆర్‌ఎస్ అనేది యుఎస్ కాంగ్రెస్ యొక్క స్వతంత్ర పరిశోధనా విభాగం. యుఎస్ కాంగ్రెస్ నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడే అధ్యయనాలు, నివేదికలను అందిస్తుంది. ఈ నివేదికలను యుఎస్ కాంగ్రెస్ అధికారిక అభిప్రాయంగా పరిగణించరు. బైడెన్ ప్రభుత్వం ఇప్పటికే పౌరసత్వ సవరణ చట్టం నోటిఫికేషన్‌పై తన ఆందోళనలను వ్యక్తం చేసింది ఈ వివాదాస్పద చట్టం అమలును నిశితంగా పరిశీలిస్తామని తెలిపింది.

హెల్మెట్ పెట్టుకోలేదని నష్ట పరిహారాన్ని నిరాకరించకూడదు

- మద్రాస్ హైకోర్టు

చెన్నై : ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించకపోవడం నిర్లక్ష్యం కాదని, హెల్మెట్ ధరించలేదనే కారణంతో ప్రమాద బాధితులకు నష్ట పరిహారాన్ని నిరాకరించకూడదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. 2010లో ఈరోడ్‌లో ఒక ఇంజనీరింగ్ విద్యార్థి బస్సును ఢీకొని మరణించిన కేసులో బాధిత కుటుంబానికి 2021లో మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ ట్రిబ్యునల్ మంజూరు చేసిన నష్ట పరిహారానికి వ్యతిరేకంగా బీమా కంపెనీ ఈ పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ ఎన్ ఆనంద్ వెంకటేష్ ఈ మేరకు సోమవారం తీర్పు చెప్పారు. హెల్మెట్ ధరించలేదనే కారణంతో విద్యార్థి కుటుంబానికి రావాల్సిన నష్టపరిహారాన్ని ట్రిబ్యునల్ కొంతమేర తగ్గించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. పోస్టు మార్టరం నివేదిక ప్రకారం తలకు తగిలిన గాయాలతోపాటు శరీరంలో ఇతర భాగాల్లో తగిలిన గాయాలు కూడా విద్యార్థి మృతికి కారణమని, కాబట్టి బాధిత కుటుంబానికి పూర్తి నష్ట పరిహారం చెల్లించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. విద్యార్థి ఆదాయాన్ని రూ.12 వేలుగా ట్రిబ్యునల్ లెక్కించగా, భవిష్యత్ అవకాశాలను సహేతుకంగా పరిగణనలోకి తీసుకుని నెలసరి ఆదాయాన్ని రూ.16,800గా లెక్కించాలని ఆదేశించారు. కుమారుడ్ని కోల్పోయినందుకు మరో రూ.1.2 లక్షలను ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యార్థి బతికి ఉంటే చేసే వ్యక్తిగత ఖర్చులను తీసివేసి, మిగిలిన మొత్తాన్ని ఆరు వారాల్లోగా అతని కుటుంబానికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

కేజ్రీవాల్‌ను పరీక్షించేందుకు

మెడికల్ బోర్డు ఏర్పాటు చేయండి

- అవసరమైన వైద్యాన్ని అందించాలి
- జైలు అధికారులకు రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను పరీక్షించేందుకు మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని ఎయిమ్స్‌ను రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశించింది. కేజ్రీవాల్ దాఖలు చేసిన హెల్త్ పిటిషన్‌ను కొట్టేసింది. కేజ్రీవాల్‌కు అవసరమైన వైద్యాన్ని జైలులో అందించాలని జైలు అధికారులకు సిబిఐ స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఆదేశించారు. డయాబెటిక్ వైద్యం కోసం ప్రతిరోజూ 15 నిముషాలపాటు వర్చువల్‌గా డాక్టర్ కన్సల్టేషన్, ఇన్సులిన్ తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ షుగర్ లెవెల్స్ సాధారణంగానే ఉన్నాయని, డాక్టర్లు సూచించిన డైట్ అందిస్తున్నామని, అరెస్టుకు ముందే కేజ్రీవాల్ ఇన్సులిన్ తీసుకోవడం ఆపేశారని తీహార్ జైలు అధికారుల వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో జైలులో కేజ్రీవాల్‌కు ప్రత్యేక సంప్రదింపులు అవసరమైతే, ఎయిమ్స్ డైరెక్టర్ ఏర్పాటుచేసే మెడికల్ బోర్డును సంప్రదించాలని తీహార్ జైలు అధికారులకు కోర్టు సూచించింది. ఎయిమ్స్ మెడికల్ బోర్డు కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ అందించడంపై నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది. ఆయనకు డైట్, వ్యాయామ ప్రణాళికను మెడికల్ బోర్డు నిర్దేశిస్తుందని వెల్లడించింది.

అప్పటి వరకు ఇంటి భోజనం

వైద్యపరంగా సూచించిన డైట్‌లో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. మెడికల్ బోర్డు సూచించిన ఆహారం ప్రకారం... కేజ్రీవాల్ ఇంట్లో వండిన ఆహారాన్ని తీసుకోవచ్చని స్పష్టం చేసింది. మెడికల్ బోర్డు కేజ్రీవాల్‌కు డైట్‌ను సూచించే వరకు, కేజ్రీవాల్‌కు ఇంటి భోజనం అందించవచ్చని పేర్కొంది. ఈ ఆహారం పిటిషనర్ వ్యక్తిగత వైద్యులు సూచించిన డైట్ చార్ట్, ఏప్రిల్ 1న కోర్టు ఆదేశాల ప్రకారం ఉండాలని పేర్కొంది. కేజ్రీవాల్ డైట్ పాటించని పక్షంలో కోర్టు దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించింది. కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వాల్సిన అవసరం ఉందా? లేదా? అనే దానిపై తన నివేదికను త్వరగా సమర్పించాలని ఎయిమ్స్ మెడికల్ బోర్డుకు సూచించింది. భవిష్యత్తులో ఏదైనా నిపుణుడి ద్వారా కేజ్రీవాల్‌కు వైద్యపరమైన చికిత్స అవసరమైతే, ఈ విషయంలో జైలు అధికారులు మెడికల్ బోర్డుతో సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది.

ప్రధాని మోడీపై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ప్రధాని మోడీ, బిజెపి నేతలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ కోరారు. కాంగ్రెస్ నేతలు అభిషేక్ మను సింఘ్వీ, గుర్దీప్ సప్పల్, సుప్రియా శ్రీనాట్‌లతో కూడిన కాంగ్రెస్ ప్రతినిధి బృందం సోమవారం కేంద్ర ఎన్నికల సంఘంతో సమావేశమైంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951, సుప్రీంకోర్టు వివిధ తీర్పులు, ఎన్నికల కమిషన్ మోడల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు బిజెపి, ఇతర నేతలపై 16 ఫిర్యాదులను సమర్పించారు. 'ఈ చాలా చట్టబద్ధమైన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటారని మేము ఆశిస్తున్నాము' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. ముస్లిం సమాజానికి సంపదను పునఃపంపిణీ చేయడం గురించి ప్రధాని చెప్పినట్లు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉంటే చూపించాలని మోడీని కాంగ్రెస్ నిలదీసింది. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో ఇండియా బ్లాక్ మొదటి రౌండ్‌లో గెలిచిందని గ్రహించిన తరువాత ప్రధాని 'ద్వేషపూరిత ప్రసంగం' చేశారని పేర్కొన్నారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం, ప్రత్యర్థులపై నిరాధార ఆరోపణలు చేయడం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ - బిజెపి సమ్మేళనం విలువలను మోడీ గ్రహించారని ఖర్గే ఆరోపించారు.

ఆయనది విషం చిమ్మే భాష : రాహుల్

సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే మోడీ కొత్త ఎత్తుగడలు అవలంబిస్తున్నారని, ఆయనది విషం చిమ్మే భాష అని రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ప్రధాన సమస్యలను ఎదుర్కొంటుంటే మోడీ మాత్రం అంతా బాగానే ఉన్నదని చెబుతున్నారని సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ ఎద్దేవా చేశారు.

పద్మ అవార్డును అందిస్తున్న రాష్ట్రపతి ముర్ము, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పద్మ అవార్డుల ప్రదానం

- వెంకయ్య నాయుడుకు పద్మ విభూషణ్ అందజేత

న్యూఢిల్లీ : పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు గ్రహీతలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, ఎస్ జైశంకర్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు బిందేశ్వర్ పాఠక్, ప్రముఖ భరతనాట్య కళాకారిణి పద్మా సుబ్రమణ్యంకు పద్మ విభూషణ్ అవార్డులు అందజేశారు. వీరిలో బిందేశ్వర్ పాఠక్‌కు మరణాంతరం ఈ అవార్డు ప్రకటించడంతో ఆయన కుటుంబ సభ్యులు ఈ అవార్డును అందుకున్నారు. నటుడు మిథున్ చక్రవర్తి, గాయని ఉషా ఉతప్, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ రామ్ నాయిక్, పారిశ్రామిక వేత్త సీతారామ్ జిందాల్‌కు పద్మ భూషణ్ అవార్డులు అందజేశారు.

దేశంలో అతున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మ అవార్డులను పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీ కేటగిరిల కింద ప్రదానం చేస్తారు. ఏటా రిపబ్లిక్ డే రోజున ఈ అవార్డులను ప్రకటిస్తారు. ఈ ఏడాది 132 మందికి పద్మ అవార్డులను ప్రకటించారు. ఇందులో ఐదు పద్మ విభూషణ్, 17 పద్మ భూషణ్, 110 పద్మశ్రీ అవార్డులు ఉన్నాయి. విజేతల్లో 30 మంది మహిళలు ఉన్నారు. గ్రహీతల్లో దాదాపు సగం మందికి సోమవారం అవార్డులు ప్రదానం చేశారు. మిగిలిన వారికి వచ్చేవారంలో అవార్డులు అందజేస్తారు.

బాలిక గర్భవిచ్ఛిత్తికి సుప్రీం అనుమతి

- మానసిక, శారీరక శ్రేయస్సుకు అసాధారణ నిర్ణయం

న్యూఢిల్లీ : అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలిక 30 వారాల గర్భవిచ్ఛిత్తికి సోమవారం సుప్రీంకోర్టు అనుమతించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకు లభించిన అసాధారణ అధికారాలను ఉపయోగించి బాధిత బాలికకు పూర్తి న్యాయం చేయడానికి సుప్రీంకోర్టు ఈ గర్భ విచ్ఛిత్తికి అనుమతించింది. బాలిక మానసిక, శారీరక శ్రేయస్సును రక్షించడానికి అసాధారణ నిర్ణయం తీసుకుంది. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) కింద సాధారణంగా 24 వారాల ఉన్న గర్భవిచ్ఛిత్తికే అనుమతి ఉంటుంది. ప్రెగ్నెన్సీని పొడిగించడం మైనర్ శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న మెడికల్ బోర్డ్ సిఫారసులకు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పార్థివాలాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అంగీకరించింది. గర్భం దాల్చిన విషయాన్ని అత్యాచార బాధిత బాలిక ఆలస్యంగా గుర్తించింది. చట్టం ప్రకారం అనుమతి ఉన్న 24 వారాల తరువాత అంటే మార్చి 20న ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. గర్భవిచ్ఛిత్తికి బాంబే హైకోర్టు ఈ నెల 4న తిరస్కరించడంతో బాలిక తల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాలికకు ప్రతీ గంట కీలకమని సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో తరువాత పూర్తి వివరాలతో ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. కోర్టు విధివిధానాలను సాకుగా చూపుతూ వైద్య ప్రక్రియను ఆలస్యం చేయవద్దని అధికారులను ఆదేశించింది. బాలిక వైద్య, రవాణా ఖర్చులను భరించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది.

25,753 మంది టీచర్ల తొలగింపు

- బెంగాల్‌లో 2016 ఎస్‌ఎల్‌ఎస్‌టి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ రద్దు చేసిన కోల్‌కత్తా హైకోర్టు
- సుప్రీంకోర్టుకు వెళ్తాం : మమతా బెనర్జీ

కోల్‌కత్తా : పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రస్థాయి నియామక పరీక్ష (ఎస్‌ఎల్‌ఎస్‌టి) 2016 ద్వారా నియమించబడిన 25,753 మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిని తొలగిస్తూ కోల్‌కత్తా హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉద్యోగాల ఎంపిక కోసం నిర్వహించిన ఈ పరీక్ష ప్రక్రియ చట్ట ప్రకారం చెల్లుబాటు కాదని హైకోర్టు ప్రకటించింది. ఈ నియామక ప్రక్రియపై సిబిఐ విచారణకు జస్టిస్ దేవంగ్సు బసక్, జస్టిస్ మహ్మద్ షబ్బార్ రషీదిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. మూడు నెలల్లో నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ డివిజన్ బెంచ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 350 పిటిషన్లు, అప్పీళ్లను ఈ బెంచ్ విచారించింది. మార్చి 20నే విచారణను ముగించిన బెంచ్ తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. సోమవారం 282 పేజీల తీర్పును వెల్లడించింది.

2016 ఎస్‌ఎల్‌ఎస్‌టి ద్వారా జరిపిన అన్ని నియామకాలను రద్దు చేసిన ధర్మాసనం అధికారిక రిక్రూట్‌మెంట్ తేదీ ముగిసిన తరువాత నియమించబడినవారు, ఖాళీ ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ (ఒఎంఆర్) షీట్లను సమర్పించి అపాయింట్‌మెంట్ పొందిన వారు అప్పటి నుంచి ఇప్పటి వరకూ పొందిన అన్ని వేతనాలు, ప్రయోజనాలను 12 శాతం ఏడాది వడ్డీతో నాలుగు వారాల్లో తిరిగి ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అన్ని నియామకాలను రద్దు చేయడంపై కోర్టు స్పందిస్తూ 'వేరే ఇతర మార్గం లేకనే' ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని, సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా నిలుస్తామని, వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్‌ఎస్‌సి) ఛైర్మన్ సిద్దార్థ మజుందార్ తీర్పుపై స్పందిస్తూ హైకోర్టు ఆదేశాలను పూర్తిగా పరిశీలించిన తరువాత సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. ఎస్‌ఎల్‌ఎస్‌టి 2016 ద్వారా 24,640 ఉద్యోగాలను భర్తీ చేశారు. సుమారు 23 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 24,640 ఖాళీల కోసం 25,753 అపాయింట్‌మెంట్ లెటర్లు జారీ చేసినట్లు పిటిషన్‌దార్లు పేర్కొన్నారు.

ఉప ఎన్నికల్లో పాక్ పాలక పక్షం గెలుపు!

- అనధికారిక ఫలితాల వెల్లడి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో కీలకమైన ఉప ఎన్నికల్లో పాక్ పాలక పక్షం పిఎంఎల్-ఎన్ మెజారిటీ సీట్లను గెలుచుకుంది. రెండు నేషనల్ అసెంబ్లీ సీట్లలో, 10 ప్రావిన్షియల్ అసెంబ్లీ సీట్లలో విజయం సాధించినట్లు సోమవారం అనధికారిక ఫలితాల ద్వారా వెల్లడైంది. 21 నేషనల్, ప్రావిన్షియల్ అసెంబ్లీ సీట్లకు ఆదివారం ఉప ఎన్నికలు జరిగాయి. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు గానూ పంజాబ్, బలూచిస్తాన్ జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలు కూడా స్తంభింపచేశారు. ఈ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలన్నీ పోటీచేశాయి. జమైత్ ఉలేమా ఇ ఇస్లామ్ ఫజల్ ఎన్నికలను బహిష్కరించింది. తుది ఫలితాలను ఇంకా పాక్ ఎన్నికల కమిషన్ విడుదల చేయాల్సి వుంది. పోలింగ్ స్టేషన్లవారీగా ఫలితాలను ఆధారంగా చేసుకుని ప్రైవేట్ మీడియా చానెళ్ల ఫలితాలను విడుదల చేశాయి. దునియా వార్తా చానెల్ ఇచ్చిన సమాచారం ప్రకారం పిఎంఎల్-ఎన్‌కు రెండు నేషనల్ అసెంబ్లీ సీట్లు రాగా, పిపిపి, ఎస్‌ఐసిలకు చెరొకటి, ఇండిపెండెంట్ ఒకరు గెలిచారు. 16 ప్రావిన్షియల్ అసెంబ్లీ స్థానాలకు గానూ 10 సీట్లను పిఎంఎల్-ఎన్ గెలుచుకుంది. వీటిల్లో పంజాబ్‌లో 9, బెలూచిస్తాన్‌లో ఒక స్థానం వున్నాయి. పిపిపి,ఎస్‌ఐసిలకు ఒక్కో సీటు లభించింది. ఇస్తెకమ్ పాకిస్తాన్ పార్టీ, పాకిస్తాన్ ముస్లిం లీగ్, బెలూచిస్తాన్ నేషనల్ పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒక్కో స్థానాన్ని గెలిచారు.

కవిత బెయిల్ పిటిషన్లపై 2న తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిఆర్‌ఎస్ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు వాదనలు ముగించింది. ఈ పిటిషన్‌పై తీర్పును మే రెండుకు రిజర్వు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సిబిఐ కేసులో అరెస్టయిన కవిత ఈ నెల 15న మొత్తం 664 పేజీలతో ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు ఇదే లిక్కర్ స్కామ్ మనీలాండరింగ్ కేసులో ఇడి అరెస్టును సవాల్ చేస్తూ కవిత బెయిల్ కోరారు. ఈ రెండు పిటిషన్లను సోమవారం రౌస్ ఎవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజా విచారణ జరిపారు. ఇరువైపులా వాదనలు విన్న స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా... ఈ పిటిషన్‌పై వాదనలు ముగిస్తున్నట్లు స్పష్టం చేశారు. మే రెండున తుది ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. మరోవైపు ఢిల్లీ మద్యం విధానంలోని ఇడి కేసులోనూ కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోంది.ఇడి, సిబిఐ కేసులో కవితకు విధించిన జ్యూడీషియల్ కస్టడీ ముగియడంతో మంగళవారం ఆమెను ట్రయల్ కోర్టు ముందు హాజరుపరచనున్నారు. ఇడి కేసులో ఈ నెల 9న కోర్టు 14 రోజులు కస్టడీ పొడిగించగా... సిబిఐ కేసులో ఈ నెల 15న ఎనిమిది రోజుల కస్టడీ విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

దళిత విద్యార్థి నాయకుడిపై టిఐఎస్‌ఎస్ రెండేళ్ల నిషేధం

- ఖండించిన ఎఐకెఎస్

న్యూఢిల్లీ : దళిత విద్యార్థి నాయకుడు, పిహెచ్‌డి స్కాలర్ రామదాస్‌పై టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్‌ఎస్) రెండేళ్ల నిషేధం విధించింది. దళిత విద్యార్థుల సమస్యలపై తన గళాన్ని వినిపించే రామదాస్ ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కార్యనిర్వాహక కమిటీలో సభ్యులు. ఎస్‌ఎఫ్‌ఐ మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శి. దేశవ్యాప్తంగా వివిధ విద్యార్థి సంఘాల ఐక్య వేదిక అయిన 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' ప్రతినిధి కూడా. అంతకు ముందు గతంలో ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరం (పిఎస్‌ఎఫ్) ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని టిఐఎస్‌ఎస్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా సంస్థ యాజమాన్యం రెండేళ్ల పాటు రామదాస్‌పై నిషేధం విధించింది. ఈ నిషేధాన్ని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. రామదాస్‌పై నిషేధాన్ని రాజ్యాంగం ప్రసాదించిన వాక్, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేసేందుకు దేశవ్యాప్తంగా జరుగుతున్న కుట్రలో భాగంగా ఎఐకెఎస్ విమర్శించింది.

400 మద్యం బాటిళ్లు స్వాధీనం

- రూ.3.24 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. అధిక మొత్తంలో తరలిస్తున్న నగదు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని బలుసుపాడు గ్రామం వద్ద 400 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిల్లకల్లు గ్రామానికి చెందిన వల్లపు నాగరాజు, గల్లా తిరుపతమ్మ, చల్లా స్వామి ద్విచక్ర వాహనంపై మద్యం బాటిళ్లను తెలంగాణ రాష్ట్రం నుండి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లా కామవరపుకోట చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.1.59 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లా మువ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి ఆటోలో నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్టు చెక్‌పోస్టు ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గణపవరంలో వాహన తనిఖీలు చేపట్టారు. పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన పలివెల మహేష్‌గుప్తా వద్ద రూ.1.65 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌ఎస్‌టి అధికారి లక్ష్మీసరస్వతి తెలిపారు. పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో సీజ్ చేశారు.

మాల్దీవులు పార్లమెంట్ ఎన్నికల్లో ముయిజ్జు పార్టీ ఘన విజయం

మాలే: మాల్దీవులు పార్లమెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పిఎన్‌సి) భారీ మెజార్టీతో విజయం సాధించింది. మొత్తం 93 స్థానాలకు గాను 70 సీట్లను కైవసం చేసుకుంది. మాల్దీవులు పార్లమెంటు (పీపుల్స్ మజ్లీస్)లోని 93 నియోజకవర్గాలకు ఆదివారం పోలింగ్ నిర్వహించారు. మొత్తం 602 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటుచేశారు. వీటితోపాటు మూడు ఇతర దేశాల్లో (భారత్‌లోని తిరువనంతపురం, శ్రీలంకలోని కొలంబో, మలేషియాలోని కౌలాలంపూర్) వీటిని ఉంచారు. మొత్తం 2.84 లక్షల మంది ఓటర్లు ఉండగా.. 75 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాల్లో ముయిజ్జుకు చెందిన పిఎన్‌సి 70 స్థానాలను గెలుచుకోగా.. దాని మిత్రపక్షాలు మూడుచోట్ల విజయం సాధించాయి. మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలికి చెందిన మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండిపి) 15 సీట్లకే పరిమితమైంది. గత ఎన్నికల్లో ఈ పార్టీ 65 స్థానాలను గెలుచుకోవడం విశేషం. మాల్దీవుల్లో చిన్న ద్వీపాలు కలిపి దాదాపు 1,192 ప్రాంతాలున్నాయి.

మీ కోసం

ఎక్కిళ్లు ఆగకుండా వస్తుంటే కొంచెం పంచదార నోట్లో వేసుకుంటే తగ్గిపోతాయి.

జీవన సౌరభం

సాధ్యం కాదు అనుకుంటే ఏ పనీ చేతకాదు. ప్రయత్నించి చూడాలి. గెలిస్తే సంతోషం, ఓడితే అనుభవం వస్తాయి.

వెంకన్న సాయం

గుమ్మలూరులో వుంటున్న చిన్న రైతు సుబ్బయ్య. ఎరువుల కోసం పట్నం బయలుదేరాడు. దారిలో అడవిని దాటి వెళ్లాలి. అక్కడ దొంగల బెడద వుంది. దొంగల భయంతో నడుస్తున్న సుబ్బయ్యకు కాస్త దూరం వెళ్లేసరికి వెర్రి బాగుల వెంకన్న కనిపించాడు. వెంకన్న కాళ్ళు బాగున్నా, మూతి వంకర, చేతులు వంకర. దానితో అతన్ని వెర్రి బాగుల వెంకన్న అని పిలుస్తారు.

వెంకన్న ఎవరు చెప్పినా బాగా వింటాడు. ఏ పని అప్పజెప్పినా చేస్తాడు. బాగా మాట్లాడతాడు. వెంకన్నను చూడగానే 'ఒరే వెంకన్న .. పట్నం వరకు నాకు సాయంగా వస్తావా, నీకు మంచి భోజనం పెట్టిస్తాను' అన్నాడు సుబ్బయ్య. 'ఓ..వస్తాను' అన్నాడు వెంకన్న. వాడి మొలకి డబ్బుల సంచి కట్టి కనిపించకుండా వాడి చొక్కా సర్ది, ఇది ఇక్కడ వున్నట్టు ఎవరికీ చెప్పకు. పట్నం వెళ్లాక తీసుకుంటా' అన్నాడు సుబ్బయ్య. 'సరే అంటూ సుబ్బయ్యతో నడిచాడు వెంకన్న. కొంత దూరం పోగానే దొంగలు వాళ్ళని అటకాయించారు.

సుబ్యయ్య మీదకి దొంగలు తెగబడడం చూసిన వెంకన్న వాళ్లను ఎదిరించాడు. 'నా మెడ మీద కూడా కత్తి పెట్టండి. నా స్నేహితుని ఒక్కడ్నే చంపేస్తే, నేను ఒంటరి అయిపోతాను' అంటూ పదే పదే దొంగలతో కలబడ్డాడు. వెంకన్న చేష్టలకు విసుగెత్తిన దొంగలు 'ఛీ.. పో..' అని తిట్టి పంపేసారు. సుబ్బయ్య దగ్గర ఏమీ లేవని నిర్ధారించుకుని అతన్ని కూడా వదిలేశారు.

దొంగల బెడద నుండి తప్పించుకున్నానని ఊపిరి పీల్చుకున్న సుబ్బయ్య కాస్త దూరం వెళ్లాక వెంకన్న మీద విరుచుకుపడ్డాడు. 'నీకేమైనా బుద్ధి ఉందా! నా మీద కత్తి పెట్టు, నన్ను చంపు' అని పదే పదే అలా అన్నావు. వాళ్లు నిన్ను ఏమైనా చేస్తే, నీ దగ్గరికి వస్తే, నా డబ్బులన్నీ పోయేవి కదా! తెలివితక్కువ దద్దమ్మ!' అంటూ బాగా తిట్టాడు.

'నేను వెర్రివాడినని తెలిస్తేనే కదా వాళ్లు నన్ను వెతక్కుండా ఉంటారు. వాళ్లు నీ మీద పడగానే, నేను తప్పించుకుంటే మాత్రం, వాళ్లు నా మీద కూడా దాడి చేసేవారు. అందుకే అలా చేశాను' అన్నాడు వెంకన్న అమాయకంగా ముఖం పెట్టి. వెంకన్న తెలివికి సుబ్బయ్య ఆశ్చర్యపోయాడు. సహాయం చేసిన వెంకన్నకి తృప్తిగా భోజనం పెట్టించి, ఖర్చులకు కొంత డబ్బు ఇచ్చి, ఎరువులతో తిరుగు ప్రయాణం అయ్యాడు.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో బయట ఉన్న పురుగు, ఆకు దగ్గరకు చేరుకోవాలి. కొంచెం దారి చూపించరూ?

నేను గీసిన బొమ్మ

కె.ధనుష్,
ఏడో తరగతి,
పెద్ద గొట్టి ముక్కల,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రోజూ మనం ఎంత నీరు తాగాలి?

వేసవిలో చిన్నా, పెద్ద తగినంత నీరు తాగాలి. దాహం వేసినప్పుడు దప్పిక తీర్చుకోవడం కాదు. తరచూ కొంత పరిమాణంలో నీటిని తాగుతూ ఉండాలి. ఇలా చేస్తూ ఉంటే వేసవిలో డీహైడ్రేషన్ వల్ల సంభవించే అనేక సమస్యల నుంచి బయటపడొచ్చు. అయితే శరీరానికి తగినంత హైడ్రేషన్ ఎందుకు అవసరం? శరీరానికి ఎంత నీరు అవసరం? నీటి ప్రయోజనాలు నీరు తాగడానికి ఆసక్తి లేనప్పుడు ఏం చేయాలి? వంటి విషయాలపై కనీస అవగాహన పెంచుకోవాలి.

నీరు ఎందుకు తాగాలి?

వేసవి కాలంలో చెమట ద్వారా శరీరం నుండి చాలా నీరు బయటికి పోతుంది. దీంతో శరీర సమతుల్యతకు అవసరమైన ఎలక్ట్రోలైట్‌లను కోల్పోతుంది. ఎలక్ట్రోలైట్‌లు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం, చల్లబరచడం అనే సహజ ప్రక్రియలో ఉపయోగపడతాయి. వీటిని కోల్పోవడం అంటే శరీరం వేడెక్కి, విపరీతమైన అలసట లేదా వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. సమయానికి చికిత్స చేయకపోతే ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. కోల్పోయిన నీటిని శరీరానికి తిరిగి అందించాలన్నా, నిర్జలీకరణాన్ని నివారించాలన్నా తగినంత నీటిని తీసుకోవడం అవసరం.

ఎంత నీరు తాగాలి?

వ్యక్తులు వారి వయస్సు, బరువు, లింగం, అనారోగ్యాలను బట్టి వేర్వేరు కొలతల్లో నీరు తీసుకోవాలి. ఎవరికి ఎంత నీరు కావాలి? రోజుకు ఎంత నీరు అవసరమో చూద్దాం.

పిల్లలు వయసుల వారీగా.. (రోజుకు)

4 - 8 ఏళ్ల మధ్య వయస్సు : 5 నుండి 6 గ్లాసులు లేదా 1000–1200 మి.లీ

9 - 13 ఏళ్ల మధ్య వయస్సు : 7 నుండి 8 గ్లాసులు 1400 నుండి 1600 మి.లీ

14 - 18 ఏళ్ల మధ్య వయస్సు : 8 నుండి 11 గ్లాసులు లేదా 1600–2200 మి.లీ

పెద్దలు వయసుల వారీగా.. (రోజుకు)

మహిళలు (19, అంతకంటే ఎక్కువ వయసు) 8–10 గ్లాసులు లేదా 1600 –2000 మి.లీ

పురుషులు (19, అంతకంటే ఎక్కువ వయసు)- 8–13 గ్లాసులు లేదా 1600 – 2600 మి.లీ

పాలు ఇచ్చే స్త్రీలు- 10–15 గ్లాసులు లేదా 2000 నుండి 3000 మి.లీ

గర్భిణీలు- 10–11 గ్లాసులు లేదా 2000–2200 మి.లీ

మూత్రపిండ వ్యాధులు, మూత్ర నాళాల రుగ్మతలు లేదా ఇతర రుగ్మతలు ఉన్న వ్యక్తులు- వైద్యులు సూచించినట్లు నీటిని తీసుకోవాలి. ఈ పరిమాణం కూడా వ్యక్తికి వ్యక్తికి మారుతూ ఉంటుంది. మూత్రం రంగు ముదురు పసుపు రంగులోకి మారడం నీటిని తక్కువగా తీసుకోవడానికి సంకేతం. కాబట్టి తగినంత నీటిని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలి.

నీటి ప్రయోజనాలు

తరచూ తగినంత నీటిని తీసుకోవడం వల్ల హైడ్రేషన్ కాకుండా ఉంటుంది. మలబద్ధకం బాధల నుంచి ఉపశమనం కలుగుతుంది. కిడ్నీలోని టాక్సిన్‌లను బయటకు పంపుతుంది. మొటిమలు, ఇతర చర్మ సమస్యల సంభవనీయతను తగ్గించవచ్చు. జీర్ణక్రియ ప్రక్రియకు తోడ్పడుతుంది. స్పష్టమైన, హైడ్రేటెడ్ ఛాయను ఇస్తుంది. శరీర ఉష్ణోగ్రత, రక్తపోటును నియంత్రిస్తుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్ (సోడియం, పొటాషియం) సమతుల్యతను కాపాడుతుంది మూత్రాశయంలో బాక్టీరియా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. కణజాలం, అవయవాలను రక్షిస్తుంది. అయితే ఈ నీటిలో దాదాపు 20 శాతం నీరు అధికంగా ఉండే పండ్లు మరియు కూరగాయలు ద్వారా కూడా పొందవచ్చు.

నీరు తాగడానికి ఆసక్తి లేదా?

కొంతమందికి దాహం వేస్తే తప్ప మిగతా సమయంలో నీరు తాగే అలవాటు ఉండదు. ఈ అలవాటు అంత మంచిది కాదు. తగినంత హైడ్రేషన్ స్థాయిలను నిర్వహించడం చాలా కష్టం. ఈ సమస్యను బయటపడాలంటే నీటి శాతం అధికంగా ఉండే పానీయాలు తీసుకోవాలి.

మజ్జిగ : వేసవిలో శరీరాన్ని చల్లగా, హైడ్రేట్‌గా ఉంచడంలో మజ్జిగ బాగా సహాయపడుతుంది.

నిమ్మరసం : ఒక చల్లని గ్లాసు నిమ్మరసం రిఫ్రెష్, హైడ్రేటింగ్, శరీరానికి అవసరమైన విటమిన్ సిని కలిగి ఉంటుంది.

కొబ్బరి నీరు : లేత కొబ్బరి నీరు ఒక అద్భుతమైన బాడీ ఎలక్ట్రోలైట్ బ్యాలెన్సింగ్ ద్రావణం.

గ్రీన్ టీ : గ్రీన్ టీలో మన శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి అవసరమైన అనేక యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ప్రతిరోజూ మితమైన పరిమాణంలో తీసుకుంటే ఇది హైడ్రేషన్‌కు బాగా సహాయపడుతుంది.

పండ్ల రసాలు : సీజనల్ పండ్ల రసాలు అన్ని పోషకాలను కలిగి ఉంటాయి. తగినంత మొత్తంలో నీరు త్రాగలేని వారికి ఇది మంచి ప్రత్యామ్నాయం. (మధుమేహం లేని వారికి).

శరీరంలోని అన్ని అవయవ వ్యవస్థలు సమర్ధవంతంగా పనిచేస్తున్నాయని నిర్ధారించుకోవడానికి తగిన పరిమాణంలో నీరు తాగడం చాలా అవసరం.

ఎండు ద్రాక్ష ఎంతో మేలు

ఎండు ద్రాక్షలో పీచు పదార్థాలు యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఏ, బీ, సి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతతో బాధపడుతున్న వారు వీటిని తరచూ తింటే మంచిది.

- ఎండు ద్రాక్షలో కాపర్, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్, ఫాస్పరస్, మాంగనీస్ వంటి ఖనిజ లవణాల వల్ల నీరసం దరిచేరదు.
- బరువు తగ్గాలనుకునే వారు ఎండు ద్రాక్షను తీసుకుంటే ఫలితం కనిపిస్తుంది. జ్వరంతో బాధపడే వారు వీటిని తీసుకుంటే శక్తి వస్తుంది.
- చిన్నపిల్లల్లో జీర్ణశక్తి బాగా పెరిగేందుకు ఇది బాగా ఉపయోగపడుతుంది.
- ఇందులోని యాంటి ఆక్సిడెంట్లు బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయి.
- విటమిన్ బి ఆహారాన్ని విచ్ఛిన్నం చేసి శరీరానికి పోషకాలు గ్రహించడంలో తోడ్పడుతుంది.
- కాపర్ మెలనిన్ ఉత్పత్తిలో కీలకం. కేశాలు నల్లగా మెరవాలంటే కాపర్ కలిగి ఉండే ఎండు ద్రాక్ష తినాల్సిందే.
- ఇందులోని ఐరన్ రక్తహీనతను తగ్గించడంతో మధుమేహాన్ని అదుపు చేస్తుంది. బీటా కెరోటిన్ కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- నానబెట్టిన కిస్‌మిస్‌లను తింటే బాడీ మెటబాలిజం సమతుల్యం అవుతుంది. జీవక్రియలు చురుగ్గా ఉంటాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

4.13 కోట్ల మందికి 'ఆయుష్మాన్ భారత్' అకౌంట్స్

- ఎబిడిఎం రాష్ట్ర నోడల్ అధికారి బివి రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర జనాభాలో 4.13 కోట్ల మందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్స్‌ను ఓపెన్ చేశామని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎబిడిఎం) రాష్ట్ర నోడల్ అధికారి బివి రావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రుల్లోని డాక్టర్లు, నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు మాస్టర్ ట్రైనింగ్ కార్యక్రమం సోమవారం మంగళగిరిలో ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమంలో సిబ్బంది అందరికీ వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా బివి రావు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతో అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్ని ఎబిడిఎంతో లింక్ చేసేందుకు రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని పెద్దయెత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని ఆరోగ్య సంస్థల్లో రికార్డులను డిజిటలైజ్ చేయటంలో రాష్ట్రం దూసుకెళుతోందని బివి రావు వివరించారు.

లెనిన్ స్ఫూర్తితో ముందుకు

- జయంతి కార్యక్రమంలో బివి రాఘవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బివి రాఘవులు తదితరులు

దోపిడీ రహిత సమాజమైన సోషలిజం కోసం లెనిన్ చూపిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పిలుపునిచ్చారు. విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో వామపక్ష పార్టీలు లెనిన్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించాయి. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బివి రాఘవులు మాట్లాడుతూ సమాజం మార్పును కోరుకునే వారికి లెనిన్ జీవితం నుంచి ఎన్నో నేర్చుకోవాల్సిన అంశాలు ఉన్నాయన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా పోరాట పంథాను వదలకూడదు అనేది లెనిన్ ఆశయమన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా లెనిన్ పోరాట పంథాను వదలలేదన్నారు. ఆయన సన్నిహితులు నిరుత్సాహంతో పోరాటానికి దూరం అయినా లెనిన్ మనోస్థైర్యంతో కొనసాగించారని తెలిపారు. పోరాటం లేకుండా ఏదీ సాధ్యం కాదని, పోరాటమే ఊపిరిగా పనిచేయాలని కోరారు. ప్రకృతిలో, ప్రజల్లో, సమాజంలో ప్రతిచోటా పోరాటం వుంటుందని, వీటన్నింటి కంటే ముఖ్యమైంది వర్గ పోరాటమని అన్నారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త వర్గపోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి నాయకులు పోలారి, శాంతి సంఘం నాయకులు అరుణ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ సమసమాజం మార్క్సిజం ద్వారానే సాధ్యమని నమ్మడమే కాదు ఆచరణలో పోరాటాల ద్వారా సాధించిన మహోన్నతుడు లెనిన్ అని చెప్పారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని మాట్లాడే పెట్టుబడిదారీ విధానానికే కాలం చెల్లిందని అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయని అన్నారు. అసమానతలు లేని సోషలిజం అజేయమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ నాయకులు జయరామ్, సిపిఐ నాయకులు పి జమలయ్య, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతోన్న ఎండ తీవ్రత

- నేడు 147 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఎండ తీవ్రత రోజురోజుకూ అధికమవుతోంది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా విజయనగరం జిల్లా జామిలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తవలసలో 44.4, వేపాడలో 44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో దాదాపు పది మండలాల్లో 42.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక ఎండ వేడిమికి విపరీతమైన ఉక్కపోత తోడుకావటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలోనూ వేడి తగ్గడం లేదు. ప్రధానంగా విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత చాలా తీవ్రస్థాయిలో ఉంటోంది. ఈ నేపథ్యంలోనే అనేక మంది ప్రజలు వడదెబ్బకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. కాగా, సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 65 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీయగా.. 98 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. మంళవారం 43 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 104 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ప్రజలు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఆరుగురు మావోయిస్టులు లొంగుబాటు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

సిపిఐ మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో పని చేస్తున్న ఆరుగురు మావోయిస్టులు సోమవారం ఉదయం విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా విశాల్‌గున్ని, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా విశాఖలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాకు చెందిన ఆరుగురు మావోయిస్టులు తమ వద్ద లొంగిపోయారని, ప్రస్తుతం దళాల్లో రోజురోజుకూ పరిస్థితులు బలహీనంగా మారడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతిఫలాలు అందేలా చూస్తామని అన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులు వీరే..

కిష్టారం ఏరియా కమిటీ సెక్రటరీ కుహరం మిదిలేష్ అలియాస్ రాజు, ఏరియా కమిటీ సభ్యులు బరసే మాసా, వంజం రామే అలియాస్ కమల, మడక్కం సుక్కి, దుడి సోని, కొంట ఏరియా కమిటీ సభ్యులు వేట్టి బీమా ఉన్నారు. వీరు పోలీసులను లక్ష్యంగా చేసుకుని పలు దాడుల్లో పాల్గొన్నట్టు అధికారులు తెలిపారు. వారిపై ఉన్న రివార్డులను తెలియజేశారు.

ఎటిఎం డబ్బు చోరీ నిందితుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-సంతనూతలపాడు (ప్రకాశం జిల్లా)

మహేష్ (ఫైల్)

ఎటిఎం వాహనంలో రూ.64 లక్షల చోరీ కేసులో నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలంలోని కామేపల్లివారిపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సన్నమూరి మహేష్ (23) ఐటిఐ చదివాడు. మహేష్ చదువు పూర్తయిన తరవాత ఎటిఎంలలో డబ్బు నింపే సిఎంఎస్‌లో పనిచేసి.. మానేశాడు. ఈ నేపథ్యంలో సిఎంఎస్ మేనేజర్, మరో వ్యక్తి ప్రోత్సాహంతో మహేష్ సిఎంఎస్‌లో రూ.64 లక్షలు చోరీ చేసి.. పోలీసులకు దొరికిపోయి బెయిల్‌పై బయటకు వచ్చాడు. జైలుకు వెళ్లి వచ్చాననే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై ఎం దేవకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోరాట నాయకులకు అవకాశమివ్వండి

- సిపిఎం నేతల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకులకు ఈ ఎన్నికల్లో ప్రజలు మద్దతు పలికి గెలిపించాలని కోరుతూ సిపిఎం నేతలు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఎం నేతల లక్ష్యమని తెలిపారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు అప్పనంగా దోచిపెడుతున్న బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు నిరంతరం పోరాడతాయని కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని, దానికి మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేన పార్టీలను, రాష్ట్రంలో మోడీ విధానాలను అమలు చేస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ 29వ డివిజన్‌లోని మధురానగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ అవినీతిపరులు, కబ్జాకోరులైన నాయకుల నుండి విజయవాడను కాపాడాలన్నారు. అభివృద్ధిని విస్మరించి, అవినీతిపై దృష్టి పెట్టిన నేతలను తిరస్కరించాలని కోరారు. ఫిరాయింపుదారులతో నిండిపోయిన బిజెపి, వైసిపి, టిడిపిలను ఓడించాలన్నారు. విజయవాడను, మధురానగర్ ప్రాంతాన్ని తిరోగమంలో నెట్టిన నేతలకు బుద్ధి చెప్పాలని, ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని

నెల్లూరు నగరంలోని కోటమిట్టలో ప్రచారం చేస్తున్న మూలం రమేష్

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలంలో ప్రచారం చేస్తున్న మండంగి రమణ

కోరారు. కృష్ణా జిల్లా విజయవాడ రూరల్‌లోని నున్న గ్రామంలో గన్నవరం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు రంగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. నిరుద్యోగం పెరిగిందని, ప్రజల ఆకలి బాధలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు నగరంలోని కోటమిట్ట ప్రాంతంలో ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ గతంలో సిపిఎం చేసిన పోరాటాలు, ఉద్యమాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం సాగించారు. నగర నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న తనను మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి, ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బిజెపి కుటిల ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖలోని జివిఎంసి 67వ వార్డు గణేష్‌నగర్, పెంటయ్యనగర్, సాయిరాంనగర్, జోగవానిపాలెం తదితర ప్రాంతాల్లో గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ఇంటింటా కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని డుంబ్రిగుడ మండలం కూనపుట్టు, పంచాయతీ బుడ్డపుట్టు, జాముగుడ, హుకుంపేట మండలం భీమవరం ప్రాంతాల్లో సిపిఎం నేతలు ప్రచారం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని బాసంగి, సంధిగూడ, కె.శివడ, ఎస్‌కె పాడు, కొమరాడ మండలంలోని పాలెంలో కురుపాం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మండంగి రమణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వలంటీర్లతో ఎన్యూమరేషనా?

- ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మత్స్యశాఖ అధికారి

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అధికార యంత్రాంగం మొత్తం ఎన్నికల పనిలో నిమగ్నమై ఉంది. అధికారులు ఎన్నికల వ్యవహారం తప్ప మరో పనిలో లేరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులు సముద్రంలో చేపల వేటపై నిషేధం అమలు చేశాయి. ఈ నేపథ్యంలో మత్స్యకారులకు పరిహారం ఇచ్చేందుకు ఎన్యూమరేషన్ చేయాలని ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, శింగరాయకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, తహశీల్దార్లకు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని పంచాయతీ సెక్రటరీతో పాటు వలంటీర్లతో చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటి నుంచి వలంటీర్లను దూరం పెట్టాలని ఎన్నికల కమిషనర్‌తో పాటు కోర్టు సైతం చెప్పినప్పటికీ చంద్రశేఖర్ రెడ్డి మాత్రం ఇదేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ వలంటీర్లను ఉపయోగించుకోమనడం చర్చనీయాంశమైంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
మత్స్యశాఖ

నుండి
శ్రీ ఎ.చంద్రశేఖర రెడ్డి, M.Sc., M.Phil.,
జిల్లా మత్స్యశాఖ అధికారి
ఒంగోలు.

వరకు
మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
ఒంగోలు, కొత్తపట్నం, N.G పాడు,
టంగుటూరు, సింగరాయకొండ.

లేఖ సం. 120/C/2024, తేది. 10.04.2024

విషయం:- మత్స్యశాఖ – ప్రకాశం జిల్లా – సముద్రములో చేపలవేట నిషేధము తేది. 15.04.2023 వ తేది. నుండి 14.06.2023 వరకు (61 రోజులు) వేట నిషేధమూ రాష్ట్ర ప్రభుత్వము ఉత్తర్వులు జారీచేయటమైనది – పంచాయతి సెక్రటరీలను మరియు వాలంటీర్లను ఎన్యుమరేషన్ చేయుటకు తగు ఉత్తర్వులు ఇవ్వవలసినదిగా కోరుట – గురించి.

సూచిక:- 1.G.O.Rt.No.81 AHDD&F(Fish) department, dt. 15.03.2024.
22.Memo.No.63/J1/2024, dt. 03.04.2024 of the Commissioner of Fisheries, A.P., Vijayawada

@@@

పై నిర్దేశము ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం G.O.Rt.No.81 AHDD&F(Fish) department, dt. 15.03.2024. ఉత్తర్వులు ప్రకారము సముద్రంలో వేట నిషేధము విధించడమైనది. ఈ నెల అనగా తేది. 15.04.2024 వ తేది. నుండి 14.06.2024 వరకు (61 రోజులు) సముద్రంలో చేపలవేట నిషేధ కాలము అమలులో ఉండును. ఈ సమయంలో సముద్రంలోని చేపలు (పునరుత్పత్తి) గుడ్లు పెట్టె సమయము అయి ఉన్నందున మరబోట్లు యంత్రీకరణ తెప్పలపై పూర్తి నిషేధము తెప్పలపై పూర్తి నిషేధము అమలులో ఉండును. ఈ యొక్క సమయంలో సముద్రం లోపలి భాగములో కోస్ట్ గార్డ్ సిబ్బంది మరియు తీరప్రాంతమందు మత్స్యశాఖ అధికారులు పూర్తి పర్యవేక్షణ గావించెదరు, కావున మీరు సహకరించవలసినదిగా కోరడమైనది.

భవదీయ
జిల్లా మత్స్యశాఖ అధికారి, 10/4/24
ప్రకాశం జిల్లా.

నకలు:- ముఖ్యకార్యనిర్వహణ, జిల్లా ప్రజాపరిషత్, ఒంగోలు వారికి తగు సమాచారము నిమిత్తము సమర్పించడమైనది.

ఎంపిడిఒలకు పంపిన లేఖ


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
మత్స్యశాఖ

నుండి
శ్రీ ఎ.చంద్రశేఖర రెడ్డి, M.Sc., M.Phil.,
జిల్లా మత్స్యశాఖ అధికారి
ఒంగోలు.

వరకు
మండల తహసిల్దార్,
ఒంగోలు, కొత్తపట్నం, N.G పాడు,
టంగుటూరు, సింగరాయకొండ.

లేఖ సం. 120/C/2024, తేది. 10.04.2024

విషయం:- మత్స్యశాఖ – ప్రకాశం జిల్లా – సముద్రములో చేపలవేట నిషేధము తేది. 15.04.2023 వ తేది. నుండి 14.06.2023 వరకు (61 రోజులు) వేట నిషేధమూ రాష్ట్ర ప్రభుత్వము ఉత్తర్వులు జారీచేయటమైనది – పంచాయతి సెక్రటరీలను మరియు వాలంటీర్లను ఎన్యుమరేషన్ చేయుటకు తగు ఉత్తర్వులు ఇవ్వవలసినదిగా కోరుట – గురించి.

సూచిక:- 1.G.O.Rt.No.81 AHDD&F(Fish) department, dt. 15.03.2024.
22.Memo.No.63/J1/2024, dt. 03.04.2024 of the Commissioner of Fisheries, A.P., Vijayawada

@@@

పై నిర్దేశము ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం G.O.Rt.No.81 AHDD&F(Fish) department, dt. 15.03.2024. ఉత్తర్వులు ప్రకారము సముద్రంలో వేట నిషేధము విధించడమైనది. ఈ నెల అనగా తేది. 15.04.2024 వ తేది. నుండి 14.06.2024 వరకు (61 రోజులు) సముద్రంలో చేపలవేట నిషేధ కాలము అమలులో ఉండును. ఈ సమయంలో సముద్రంలోని చేపలు (పునరుత్పత్తి) గుడ్లు పెట్టె సమయము అయి ఉన్నందున మరబోట్లు యంత్రీకరణ తెప్పలపై పూర్తి నిషేధము తెప్పలపై పూర్తి నిషేధము అమలులో ఉండును. ఈ యొక్క సమయంలో సముద్రం లోపలి భాగములో కోస్ట్ గార్డ్ సిబ్బంది మరియు తీరప్రాంతమందు మత్స్యశాఖ అధికారులు పూర్తి పర్యవేక్షణ గావించెదరు, కావున మీరు సహకరించవలసినదిగా కోరడమైనది.

భవదీయ
జిల్లా మత్స్యశాఖ అధికారి, 10/4/24
ప్రకాశం జిల్లా.

నకలు:- జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, ఒంగోలు వారికి తగు సమాచారము నిమిత్తము సమర్పించడమైనది.

తహసిల్దార్లకు పంపిన లేఖ

అట్టహాసంగా కోదండరాముని కల్యాణం

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన టిటిడి ఇఒ ధర్మారెడ్డి

ప్రజాశక్తి- ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)


సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్టలో సోమవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని కనురాల తిలకించేందుకు జిల్లా, రాష్ట్ర నలుమూల నుండి సందర్శకులు విచ్చేశారు. కడప రోడ్డులో విశాలమైన మైదానంలో పందెళ్లు వేసి పూలతో అలంకరించారు. విద్యుత్ కాంతులు, కోలాటాలు, దీపాలతో కూడిన కల్యాణ వేదికను తీర్చిదిద్దారు. శ్రీ సీతారాముల స్వామివారిని ఆలయం నుండి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. మా వంశం గొప్పదంటే, మా వంశమే గొప్పదని వేదపండితులు కొంతమంది సీతమ్మ వైపు, మరి కొందరు రామయ్య వైపు చేరి వేడుక చేశారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు ఈ కార్యక్రమం నిర్వహించారు. జగదభిరాముని కల్యాణానికి టిటిడి ఇఒ ధర్మారెడ్డి దంపతులు బంగారు అభరణాలు, పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. టిటిడి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ వేదిక వద్ద సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక సిఎస్‌లు కరికాలవల్లన్, ఎస్ఎస్.రావత్, ప్రిన్సిపల్ సెక్రటరీ గిరిజ శంకర్, వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఉప లోకాయుక్త రజని, జిల్లా జడ్జి శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ తదితరులు పాల్గొన్నారు.

శివధనుర్బాలంకారంలో కోదండరాముడు

ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం ఉదయం శివధనుర్బాలంకారంలో రాముల వారు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. స్వయంవరం సమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తు చేసేది శివధనురరేగాలంకారం. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వారిది కూటమి కాదు.. అతుకుల బొంత

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి అతుకుల బొంతలా తయారైందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సిఎం జగన్‌ను దూషించడం తప్ప ప్రజలకు చెప్పుకునేందుకు వారికి ఒక విధానం అంటూ లేదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ మూడు పార్టీలు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి 2014 నుంచి 2019 వరకు ఏం చేశాయో చెప్పాలన్నారు. చంద్రబాబు టిడిపి వారినే బిజెపి, జనసేన పార్టీల్లోకి పంపి టికెట్లు ఇప్పించుకుంటున్నారని అన్నారు. పవన్‌కల్యాణ్‌కు కనీసం రెండేళ్లయినా సిఎం పదవి ఇవ్వాలన్నది జనసైనికుల కోరికైతే, అది నెరవేరే అవకాశం లేకుండా టికెట్లలో కోతలు పెట్టారని విమర్శించారు. ఇచ్చిన 21 సీట్లలో పది నుంచి 12 మంది ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లేనని అన్నారు. లాస్ట్ ఛాన్స్ అనే చంద్రబాబు మాటలను ప్రజలు పెద్దగా పట్టించుకోనందునే అదుపు తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. చిరంజీవి మంచి సినిమా నటుడని, ఆయన రాజకీయాల్లోకి వస్తే రావచ్చు కాని బ్యాంకులను ముంచిన వారికి అండగా నిలవడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో వైఎస్ షర్మిల కూడా చంద్రబాబు కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు.

మాగుంట విజయబాబు కన్నుమూత

- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

విజయ్‌బాబు (ఫైల్)

ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంపి మాగుంట సుబ్బిరామిరెడ్డి కుమారుడు మాగుంట విజయబాబు (55) మరణించారు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో స్థానిక అపోలో ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. గత కొంత కాలంలో షుగర్ వ్యాధితో ఆయన బాధపడుతున్నారు. విజయబాబు తండ్రి సుబ్బిరామిరెడ్డి ప్రముఖ కాంగ్రెస్‌పార్టీ నేత, ఎంపిగా పనిచేశారు. నక్సల్ కాల్పుల్లో ఆయన మరణించారు. సుబ్బిరామిరెడ్డి సతీమణి మాగుంట పార్వతమ్మ కావలి ఎమ్మెల్యేగా పనిచేశారు. వారి ఏకైక సంతానం మాగుంట విజయబాబు. విజయబాబు కుమారుడు సుబ్బిరామిరెడ్డి ప్రస్తుతం విదేశాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. ఆయన మంగళవారం స్వదేశానికి చేరుకున్న తరువాత నగరంలోని సరస్వతినగర్‌లోని మాగుంట ఇంటి నుంచి పెన్నా తీరం బోడిగాడి తోట వరకు అంతిమ యాత్ర, అక్కడే దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విజయబాబు భౌతికకాయాన్ని నగరంలోని పలువురు సందర్శించి నివాళులర్పించారు.

భయపడే ప్రసక్తే లేదు

- 24నే నామినేషన్ వేస్తా
- జైభీమ్ భారత్ పార్టీ పులివెందుల అభ్యర్థి దస్తగిరి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ (వైఎస్ఆర్ జిల్లా)

భయభ్రాంతులకు గురిచేసిన భయపడే ప్రసక్తే లేదని, సిద్ధం సభలకు ప్రజలను భయపెట్టి పిలిపించుకుంటున్నారని జైభీమ్ భారత్ పార్టీ పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి దస్తగిరి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల భాక్రాపురంలోని జై భీమ్ భారత్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేయాలనుకున్నానని తెలిపారు. కానీ అదే రోజు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నామినేషన్ వేస్తున్నారని, ఈ దృష్ట్యా ముందే రోజే నామినేషన్ వేసుకోవాలని అధికారులు సూచించారని చెప్పారు. 24న జై భీమ్ భారత్ పార్టీ తరఫున నామినేషన్ వేస్తానని, ప్రజలందరూ తరలివచ్చి మద్దతు పలకాలని కోరారు. జగన్ నామినేషన్ వేసే రోజు ఎవరూ నామినేషన్ వేయకూడదనడం దారుణమన్నారు. ప్రతి ఇంటికీ వచ్చి ఓటు అడుగుతానని, ప్రతి ఒక్కరూ సహకరించి గెలిపించాలని కోరారు. జై భీమ్ పార్టీ కార్యాలయాన్ని మూసివేయాలని అధికారుల నుంచి ఒత్తిడి వస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ కార్యాలయాన్ని మూసివేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. జగన్ ఇంటికి సమీపంలో తమ పార్టీ కార్యాలయం పెడితే వైసిపి నాయకులకు ఎందుకంతలా భయపడు తున్నారో చెప్పాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరికి ఏ లాభమూ జరగలేదని, ఉద్యోగులకు ఎటువంటి బెనిఫిట్లు రాలేదని విమర్శించారు.

భారత్‌లోకి టొయోటా ఫార్చునర్ లీడర్ ఎడిషన్

బెంగళూరు : ప్రముఖ ప్రీమియం కార్ల తయారీ కంపెనీ టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) కొత్తగా భారత మార్కెట్లోకి తన ఫార్చ్యునర్ లీడర్ ఎడిషన్‌ను విడుదల చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఎస్‌యువిని 2.8 లీటర్ టర్బో డీజిల్ ఇంజిన్‌తో 201 హెచ్‌పి పవర్‌తో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఫార్చ్యునర్ లీడర్ ఎడిషన్‌లో అనేక కొత్త ఫీచర్లను జోడించినట్లు టికెఎం సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. కాగా దీని ధరను ఆ కంపెనీ వెల్లడంచలేదు.

జొమాటో ప్లాట్‌ఫామ్ ఫీజు 25% పెంపు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో తన ఫుడ్ డెలివరీ ఫీజు 25 శాతం పెంచింది. ప్రతి ఫుడ్ ఆర్డర్ మీద ఇకపై రూ.5 చొప్పున వసూలు చేయనున్నట్లు వెల్లడించింది. పెంచిన ఫీజు ఈ నెల 20 నుంచే అమల్లోకి వచ్చిందని తెలిపింది. ప్రారంభంలో ప్రతి ఆర్డర్ మీద రూ.2 చొప్పున వసూలు చేసిన ఫీజును గతేడాది అక్టోబర్‌లో రూ.3, జనవరిలో రూ.4లకు పెంచేసింది. తాజాగా రూ.5కు చేర్చింది. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, లక్నో నగరాల్లో పెంచిన ఫీజును అమలు చేస్తున్నట్లు పేర్కొంది. ఏడాదికి దాదాపు 90 కోట్ల ఆర్డర్లను డెలివరీ చేస్తోంది.

ఎవరెస్ట్, ఎండిహెచ్ మసాలాలపై నిషేధం

- హాంకాగ్ ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన ప్రముఖ మసాలల తయారీ సంస్థలు ఎవరెస్ట్ ఫుడ్స్, ఎండిహెచ్‌లకు హాంకాంగ్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. ఆ రెండు కంపెనీలకు చెందిన మసాల ఉత్పత్తుల్లో క్రిమిసంహారకాలు మోతాదుకు మించి ఉన్నాయని స్పష్టం చేసింది. ఎవరెస్ట్ మసాల దినుసుల్లో ఇథిలీన్ ఆక్సైడ్ మోతాదుకు మించి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని సింగపూర్ ప్రభుత్వం గత వారం తెలిపింది. తాజాగా హాంకాంగ్ సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్టీ (సిఎస్ఎఫ్)అథారిటీ విభాగం ఏప్రిల్ 5న నిర్వహించిన సాధారణ తనిఖీల్లో ఎండిహెచ్ గ్రూప్ తయారు చేసిన మద్రాస్ కర్రీ ఫౌడర్, సాంబార్ మసాల్ ఫౌడర్, కర్రీ ఫౌడర్‌లలో ఇథిలీన్ ఆక్సైడ్ గుర్తించామని అధికారికంగా ప్రకటించింది. దీంతో మసాల దినుసుల్ని అమ్మకాల్ని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టం చేసింది. ఎవరెస్ట్ గ్రూప్ తయారు చేసిన కూరల మసాలల్లో పురుగుమందుల్ని గుర్తించినట్లు తెలిపింది. ఎవరెస్ట్ ఫిష్ కర్రీ మసాలా వాడొద్దని అక్కడి ప్రజలకు సింగపూర్ ఫుడ్ ఏజెన్సీ సూచించింది.

ఎల్‌జికి 10 లక్షల ఎసిల ఆర్డర్

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ ఎల్‌జి ప్రస్తుత ఏడాదిలో 10 లక్షల యూనిట్ల ఎసి ఆర్డర్లను పొందినట్లు తెలిపింది. వివిధ శ్రేణీల్లోని తమ పోర్టుపోలియోలోని 77 మోడల్స్ ద్వారా ఈ విజయాన్ని సాధించినట్లు తెలిపింది. తమ ఉత్పత్తులు అధికంగా విద్యుత్‌ను ఆదా చేస్తాయని ఆ సంస్థ పేర్కొంది.

టాటా మ్యాజిక్ 4 లక్షల యూనిట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ : టాటా మోటార్స్ తన టాటా మ్యాజిక్ అమ్మకాలను 4 లక్షల యూనిట్ల మైలురాయికి చేరినట్లు తెలిపింది. ఈ రెండు ఇంధనాల వాహనాన్ని 60 లీటర్ల సిఎన్‌జి, 5 లీటర్ల పెట్రోల్ ట్యాంక్‌తో ఆవిష్కరించింది. 694 సిసి ఇంజిన్, పది సీటర్ల ఈ వాహనానికి 2 ఏళ్లు లేదా 72వేల కిలోమీటర్ల వారంటీతో అందిస్తుంది. గత కొన్నేళ్లుగా ఈ వాహనాలు విజయవంతంగా రాణిస్తున్నాయని టాటా మోటార్స్ ప్యాసింజర్స్ బిజినెస్ హెడ్ ఆనంద్ ఎస్ తెలిపారు.

జియోకు భారీ లాభాలు

న్యూఢిల్లీ : 2023-24 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్ జియో లాభాలు 13.2 శాతం పెరిగి రూ.5,337 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.4,716 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ4లో కంపెనీ రెవెన్యూ 11 శాతం పెరిగి రూ.25,394 కోట్లుగా చోటు చేసుకుంది. 2023-24లో జియో స్థూల రెవెన్యూ 10.4శాతం పెరిగి రూ.1 లక్ష కోట్లను చేరగా.. నికర లాభాలు 11.48 శాతం పెరిగి రూ.20,607 కోట్లుగా నమోదయ్యాయి.

రిలయన్స్ లాభాల్లో 2 శాతం తగ్గుదల

ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) లాభాలు తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లోని మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 18,951 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.19,299 కోట్ల నికర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గడిచిన క్యూ4 లాభాల్లో 1.8 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. కంపెనీ రెవెన్యూ 11.3 శాతం పెరిగి రూ.2,40,715 కోట్లకు చేరింది. కంపెనీ మొత్తం వ్యయాలు 11.45 శాతం పెరిగి రూ.2,17,529 కోట్లుగా నమోదయ్యాయి.

ఆర్ఐఎల్ 2023-24కు గాను రెండో సారి డివిడెండ్‌ను ప్రకటించింది. ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.10 డివిడెండ్ చెల్లింపునకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇంతక్రితం రూ.9 డివిడెండ్‌ను చెల్లించింది. ఆర్థిక సంవత్సరం 2023-24లో మొత్తంగా 2.6 శాతం వృద్ధితో రూ.9,14,472 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.8.91 లక్షల కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8.09 కోట్లుగా ఉన్న వ్యయాలు.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.9.14 లక్షల కోట్లకు పెరిగాయి. 2023-24లో రూ.79,020 కోట్ల నికర లాభాలు నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది రూ.73,670 కోట్ల లాభాలు ఆర్జించింది.

కానరాని 'నారీ శక్తి'

- మోడీ పాలనలో పెరిగిన లింగ అసమానతలు
- పేద గర్భిణులకు లభించని ఆరోగ్య సేవలు
- పాఠశాల విద్యకు బాలికలు దూరం
- ఉపాధి అవకాశాలూ అంతంతే

పెరుగుతున్న నేరాలు

న్యూఢిల్లీ : దేశ జనాభాలో యాభై శాతంగా ఉన్న మహిళలు ఇంటి పనికే పరిమితమైతే విజయాలు ఎలా సాధించగలమని గత సంవత్సరం మార్చిలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రశ్నించారు. పోయిన ఏడాది మన దేశంలో జరిగిన జి-20 సదస్సులో కూడా 'మహిళల నేతృత్వంలో అభివృద్ధి' పైన చర్చ జరిగింది. అయితే పాలకుల మాటలకు, చేతలకు ఏ మాత్రం పొంతన ఉండదని గణాంకాలు రుజువు చేస్తున్నాయి. 2022లో విడుదలైన లింగ అసమానతల సూచికలో 193 దేశాల్లో భారత్ 108వ స్థానంలో నిలిచింది.

దేశంలో సార్వత్రిక ఎన్నికల సమరం ఇప్పటికే ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మహిళలు, బాలికల పరిస్థితిని 'న్యూస్‌లాండ్రీ' పోర్టల్ అధ్యయనం చేసింది. గర్భిణులైన పేద మహిళల ఆరోగ్య పరిరక్షణపై పాలకులు ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదు. పేద కుటుంబాల్లో జన్మించిన బాలికలు సెకండరీ స్థాయిని దాటి చదువుకోవడం లేదు. డ్రాపవుట్ల సంఖ్య తగ్గుతున్నప్పటికీ 16-18 సంవత్సరాల మధ్య వయసున్న బాలికల్లో ప్రతి ఐదుగురిలో ముగ్గురు ఇప్పటికీ పాఠశాల విద్యకు నోచుకోవడం లేదు. ఇక ప్రతి ఐదుగురు మహిళల్లో ముగ్గురికి ఉపాధి లేదు. మహిళలపై నేరాల సంఖ్య పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు.

ఆరోగ్య సేవలకు దూరంగా...

2005-06, 2019-20 మధ్య కాలంలో గర్భిణుల ఆరోగ్య సేవలు మెరుగుపడిన మాట వాస్తవం. పేద మహిళలకు ఈ సేవలు సరిగా అందడం లేదు. ప్రతి నలుగురు పేద మహిళల్లో ఒకరు ఆరోగ్య కేంద్రంలో పురుడు పోసుకోవడం లేదు. వారిలో చాలా మందికి ఇప్పటికీ ఇంటి వద్దే కాన్పు జరుగుతోంది. పేదలైన గర్భిణుల్లో 42% మంది మాత్రమే వైద్య పరీక్షల నిమిత్తం నాలుగు లేదా అంతకంటే ఎక్కువ సార్లు ఆస్పత్రులకు వెళుతున్నారు. ధనికుల పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటోంది. సంపన్న మహిళలు తరచూ ఆస్పత్రుల్లో ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ, అక్కడే శిశువుకు జన్మనిస్తున్నారు.

పడిపోతున్న లింగ నిష్పత్తి

2014-2020 మధ్యకాలంలో గర్భిణుల మరణాల సంఖ్య తగ్గింది. లక్ష మంది శిశువులకు జన్మనిస్తున్న మహిళల్లో 97 మంది మరణిస్తున్నారు. ఆరు సంవత్సరాల కాలంలో గర్భిణుల మరణాలు పాతిక శాతం మేర తగ్గాయి. కానీ అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న మరణాల నిష్పత్తితో పోలిస్తే ఈ ఆరేళ్లలో మన దేశంలో గర్భిణుల మరణాల్లో మూడు శాతం తగ్గుదల మాత్రమే కన్పిస్తోంది. 2014-15లో ప్రతి వెయ్యి మంది బాలురకు 918 మంది బాలికలు జన్మించగా, 2022 నాటికి ఆ సంఖ్య 934కు పెరిగింది. బీహార్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి పెద్ద రాష్ట్రాల్లో 2021-22లో లింగ నిష్పత్తి పడిపోయింది. బీహార్‌లో ప్రతి వెయ్యి మంది బాలురకు అతి తక్కువగా 898 మంది బాలికలు జన్మించారు. హర్యానా (920), ఢిల్లీ, నాగాలాండ్ (924), గుజరాత్ (927) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మిజోరంలో మాత్రం అత్యధికంగా ప్రతి వెయ్యి మంది బాలురకు 994 మంది బాలికలు జన్మించగా, సిక్కిం (981), కేరళ (968) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

అందని ద్రాక్షపండులా విద్య

సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయి విద్యలో బాలికల ప్రవేశాలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ 2021-22లో 14-16 సంవత్సరాల మధ్య వయసున్న బాలికల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు పాఠశాలలో చేరలేదు. 16-18 సంవత్సరాల మధ్య వయస్కుల్లో ప్రతి ఐదుగురిలో ఇద్దరు పాఠశాల విద్యకు నోచుకోలేదు.

నేరాలు-ఘోరాలు...

జాతీయ నేర రికార్డుల బ్యూరో సమాచారం ప్రకారం 2015 నుండి మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. 2012లో దేశ రాజధానిలో జరిగిన సామూహిక అత్యాచార ఘటన (నిర్భయ కేసు) తర్వాత మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు పెరిగాయి. నిందితుల అరెస్టులు, వారికి విధించిన శిక్షలు దుండగులపై ఏ మాత్రం ప్రభావం చూపలేకపోతున్నాయి. 2015లో ప్రతి లక్ష మంది మహిళల్లో 53.9 మందిపై నేరాలు జరగ్గా 2022 నాటికి ఆ రేటు 66.4కు పెరిగింది. ముఖ్యంగా తగిన వయసు రాకుండానే వివాహాలు చేసుకున్న బాలికలపై ఇలాంటి దాష్టీకాలు, అకృత్యాలు ఎక్కువగా జరిగాయి. మహిళలపై లైంగిక దాడుల కారణంగా వారికి ఉద్యోగాలు కల్పించేందుకు యాజమాన్యాలు విముఖత ప్రదర్శిస్తున్నాయని మీడియాలో వార్తలు వస్తున్నాయి.

ఉద్యోగాలు అంతంత మాత్రమే

దేశంలో మహిళా ఉద్యోగుల సంఖ్యలో ఏ మాత్రం పెరుగుదల కన్పించడం లేదు. మహిళల్లో కేవలం 37% మంది మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారు. అంటే దీనర్థం ప్రతి ఐదుగురిలో ముగ్గురి కంటే ఎక్కువ మంది పని చేయకపోవడమో లేదా పని కోసం వెతక్కపోవడమో జరుగుతోంది. 2017-18లో మహిళల్లో 23.3% మంది మాత్రమే ఉద్యోగులు. 2022-23 నాటికి అది 37%కి పెరిగింది. మహిళల్లో నిరుద్యోగ రేటు తగ్గుతున్నప్పటికీ అది ఆశించిన స్థాయిలో లేదు.

శాంతిభద్రతలు సరిగ్గా లేవు

- ఇసికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగ్గా లేవని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు టిడిపి ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, లీగల్ సెల్ సభ్యులు పోసాని వెంకటేశ్వర్లు సోమవారం సచివాలయంలో మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల మీడియాతో మాట్లాడుతూ.. అధికార పార్టీకి డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి అనుకూలంగా పనిచేస్తున్నారని, పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడానికి ఇసి మీనమేశాలు లెక్కేస్తోందని అన్నారు. జగన్‌కు అనుకూలంగా పనిచేస్తున్న పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కడప జిల్లాలో శాంతిభద్రతలపై దృష్టి సారించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను వైసిపి నేతలు తుంగలో తొక్కుతున్నారని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. ఎన్‌ఆర్‌ఐలను టెర్రరిస్టులుగా వైసిపి చిత్రీకరిస్తుందని ఎన్‌ఆర్‌ఐ టిడిపి కో-ఆర్డినేటరు కోమటి జయరామ్ ఒక ప్రకటనలో ఆరోపించారు.

కేంద్రం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు జగన్ ఆదేశాలను అమలు చేస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో జగన్ భారీ దోపిడీకి పాల్పడి పేదల పొట్ట కొట్టారని ఎన్‌డిఎ కూటమి నేతలు ఎం శ్రీనివాసరెడ్డి, లంకా దినకర్, శివశంకర్ విమర్శించారు.

29 వరకు కాలువల ద్వారా నీరు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తాగునీటి సమస్యను అధిగమించేలా అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపే వరకు కాలువల ద్వారా నీటి సరఫరా కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. ప్రకాశం బ్యారేజీ పరిధిలో ఉన్న అన్ని జిల్లాలకూ ఈ నెల 29 వరకు, నాగార్జున కుడి కాలువ ద్వారా ఈ నెల 25 వరకు నీటి సరఫరా ఉంటుందని వివరించారు. రాష్ట్రంలోని తాగునీటి ఎద్దడిపై సోమవారం సచివాలయం నుంచి సమీక్ష నిర్వహించిన ఆయన, తాగునీటి అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల సమ్మర్ స్టోరేజీలను పూర్తిగా నీటితో నింపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న 1,046 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు గానూ ఇప్పటి వరకు 680 ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండాయని, మిగిలిన ట్యాంకులను నింపేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే నీటి ఎద్దడి గల ఆవాసాలకు జూన్ నెలాఖరు వరకూ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 234 ఆవాసాలకు ట్యాంకుల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూగర్భ జల మట్టాలపైనా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకంపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో రోజుకు 22 లక్షల 59 వేల మందికి పని కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఎన్‌సి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జివి హత్యకు టిడిపి కుట్ర

- పోసాని మురళీకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ హత్యకు టిడిపి కుట్ర పన్నిందని ఎపి ఎఫ్‌డిసి ఛైర్మన్ పోసాని మురళీకృష్ణ ఆరోపించారు. రామ్‌గోపాల్ వర్మ హత్యకు చంద్రబాబు నో చెప్పడంతో ఆగిపోయిందని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడలో జగన్‌ను అంతమొందించేందుకు టిడిపి కుట్ర పన్నిందని, దీనివెనుక చంద్రబాబు హస్తం వుందని అన్నారు. మహాటీవి అనిల్, కిలారు రాజేష్, నారా లోకేష్ కలిసి ఆర్‌జివి హత్యకు కుట్ర చేస్తే చివరి నిమిషంలో చంద్రబాబు నో చెప్పడంతో ఆగిపోయిందని విమర్శించారు. ఈ అంశాన్ని కిలారు రాజేష్, కిలారు మనుషులే తనతో చెప్పారని అన్నారు. ఈ అంశంపై పోలీసుల విచారణ జరగాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రజల కోసం పార్టీ పెడితే, మెగా ఫ్యామిలీ పైసల కోసం పార్టీలు పెట్టాయని విమర్శించారు. ప్రతి ఎన్‌ఆర్‌ఐ కనీసంగా వేయి ఓట్లను కొనుగోలు చేయాలని టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు కోమటి జయరామ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తానా మాజీ ఛైర్మన్ యార్లగడ్డ వెంకట రమణ డిమాండ్ చేశారు. బ్రాహ్మణ సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. నవరత్నాలపై దుష్ప్రచారం తగదని నవరత్నాల అమలు కమిటీ వైస్ ఛైర్మన్ నారాయణ మూర్తి అన్నారు. సిఎం జగన్‌పై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భాషను మార్చుకోవాలని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు.

విద్వేషం మరోస్థాయికి చేరింది

మోడీపై తొలిసారి అకాలీదళ్ విమర్శలు

అమృత్‌సర్ : రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోపై చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి) (బాదల్) కూడా ఈ విషయంలో ప్రధాని మోడీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్ఎడి (బి) మోడీపై విమర్శలు చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. రాజస్థాన్‌లో మోడీపై వ్యాఖ్యలపై ఎస్ఎడి తీవ్రంగా స్పందిస్తూ 'విద్వేషం మరోస్థాయికి చేరింది' అని విమర్శించింది. 'భారత్ ఎప్పుడూ కూడా 'సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రంగా' ఉండాలి. కానీ మనందరి తప్పు ఏమిటంటే... మనకు ఏదైనా వ్యతిరేకంగా జరిగినప్పుడు మాత్రమే మనం అన్యాయం గురించి ఆలోచించడం. ఈ రోజు వాళ్లయితే.. రేపు మనం' అని తెలిపింది. మోడీ వ్యాఖ్యలు చాలా అవమానకరం, ఆందోళనకు గురిచేసేవి అని విమర్శించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఎస్ఎడి (బి) అధికార ప్రతినిధి పరంబన్స్ సింగ్ రోమన పోస్ట్ చేశారు. మాజీ మంత్రి, ఎస్ఎడి(బి) నాయకులు బిక్రామ్ సింగ్ మజితై కూడా ఈ అంశంపై ఒక ప్రకటన విడుదల చేశారు. 'శ్రీ గురునానక్ దేవ్ జీ మానవులందరినీ సమానంగా చూడాలని, 'సర్బత్ ద భలా' అంటూ అందరికీ మేలు చేయాలని బోధించారు. ప్రజలందరినీ సమానంగా చూసే ఎస్ఎడి(బి) ఎల్లప్పుడూ మైనారిటీలు, పంజాబ్, పంజాబీలకు అండగా ఉంటుంది. ప్రధాని మోడీ నిన్న చేసిన వ్యాఖ్యలు దేశం కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రూపొందించిన మన రాజ్యాంగానికి ముప్పు తెచ్చేవిగా ఉన్నాయి. ఇది మన మోడీ జీ 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అని మజితై ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మీరు భారతదేశానికి ప్రధానమంత్రి. భారతదేశం లౌకిక దేశం కాబట్టి మీ వ్యాఖ్యలు చాలా సిగ్గుచేటు. ఓటర్ల మధ్య విభేదాలు తెచ్చే ఉద్దేశంతోనే మోడీ ప్రవర్తించడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. మోడీ మాటలు వారు (బిజెపి) ఎన్నికల్లో ఓడిపోతున్నారనే విషయాన్ని సూచిస్తోంది' అని తెలిపారు.



మే 17న కాజల్ అగర్వాల్ 'సత్యభామ'

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న 'సత్యభామ' సినిమా మే 17న విడుదల కానుంది. ఈ సినిమాలో కాజల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. నవీన్‌చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల ఈ సినిమాని రూపొందించారు.

అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మైథాలజీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఎడి'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ నటిస్తున్నారు. తాజాగా ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఓ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో అమితాబ్ అశ్వత్థామగా నటించనున్నారు. మధ్యప్రదేశ్‌లోని నెమావార్‌లో ప్రొజెక్షన్ ద్వారా ఈ గ్లింప్స్ లాంచ్ చేశారు. అమితాబ్ బచ్చన్ తన పాత్ర గ్లింప్స్‌ని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ 'అత్యాధునిక సాంకేతికతతో రూపొందిన ఈ చిత్రం మరెవ్వరికీ లేని అనుభవాన్ని తనకు పంచింది' అని ట్వీట్ చేశారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశా పటానీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం గత సంవత్సరం శాన్ డియాగో కామిక్-కాన్‌లో గ్లింప్స్‌ని లాంచ్ చేసి ప్రపంచవ్యాప్త ప్రశంసలు అందుకుంది. వైజయంతి మూవీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.

శర్వానంద్ సినిమాలో రాజశేఖర్



యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో శర్వానంద్, రాజశేఖర్ కలిసి నటించనున్నారు. గతంలో ఈ బ్యానర్‌లో శర్వానంద్ హీరోగా రన్ రాజా రన్, ఎక్స్‌ప్రెస్ రాజా, మహానుభావుడు వంటి సూపర్ హిట్ చిత్రాలు వచ్చాయి. గత నెలలో 'శర్వా-36' పేరుతో ఈ చిత్రం ప్రారంభమైంది. లూజర్ అనే వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపును తెచ్చుకున్న అభిలాష్ రెడ్డి కంకర ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మాళవికా నాయర్ కథానాయికగా చేస్తున్నారు. జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు.

ఈ వారం ఓటీటీల్లోకి 17 సినిమాలు

ఈ వారంలో వస్తాయని ఫిక్సయిన 'లవ్ మీ', 'లవ్ మౌళి' లాంటి చిన్న సినిమాలు ఎన్నికలు, ఐపీఎల్ హడావుడి వల్ల వాయిదా పడ్డాయి. దీంతో విశాల్ హీరోగా చేసిన 'రత్నం' అనే డబ్బింగ్ మూవీ తప్పితే పేరున్న మూవీస్ ఏం థియేటర్లలోకి రావట్లేదు. మరోవైపు ఓటీటీల్లోనూ అలాంటి డల్ పీరియడే నడుస్తోంది. ఓవరాల్‌గా చూసుకుంటే ఈనెల 22 నుంచి 28 వరకూ ఓటీటీల్లో 17 సినిమాలు విడుదలవుతున్నాయి.



నెట్‌ఫ్లిక్స్: బ్రిగంటి (ఇటాలియన్ సిరీస్) - 23న
ఫైట్ ఫర్ ప్యారడైజ్ (జర్మన్ సిరీస్) - 23న
డెలివర్ మీ (స్వీడిష్ సిరీస్) - 24న
సిటీ హంటర్ (జపనీస్ సినిమా) - 25న
డెడ్ బాయ్ డిటెక్టివ్స్ (ఇంగ్లీష్ సిరీస్) - 25న
టిల్లు స్క్వేర్ (తెలుగు మూవీ) - 26న
గుడ్ బాయ్ ఎర్త్ (కొరియన్ సిరీస్) - 26న
ద అసుంత కేస్ (స్పానిష్ సిరీస్) - 26న

అమెజాన్ ప్రైమ్
దిల్ దోస్తీ డైలమా (హిందీ సిరీస్) - 25న

హాట్‌స్టార్
భీమా (తెలుగు సినిమా) - 25న
థ్యాంక్యూ, గుడ్ నైట్ (ఇంగ్లీష్ సిరీస్) - 26న
క్రాక్ (హిందీ మూవీ) - 26న

జియో సినిమా
ద జింక్స్ పార్ట్ 2 (ఇంగ్లీష్ సిరీస్) - 22న
వుయ్ ఆర్ హియర్ సీజన్ 4 (ఇంగ్లీష్ సిరీస్) - 27న

బుక్ మై షో
కుంగ్ ఫూ పాండా 4 (ఇంగ్లీష్ సినిమా) - 26న

ఆపిల్ ప్లస్ టీవీ
ద బిగ్ డోర్ ప్రైజ్: సీజన్ 2 (ఇంగ్లీష్ సిరీస్) - 24న

లయన్స్ గేట్ ప్లే
ద బీ కీపర్ (ఇంగ్లీష్ మూవీ) - 26న ప్రసారం కానున్నాయి.

రావు రమేష్ కొత్త సినిమా 'బ్యూటీ'

క్యారెక్టర్ ఆర్టిస్ట్ రావు రమేష్ మరో కొత్త సినిమాలో నటించబోతున్నారు. రావు రమేష్ ప్రధాన పాత్రలో ఆ సినిమా మంగళవారం ప్రారంభం కానుంది. సందీప్ కిషన్ కథానాయకుడు, నక్కిన త్రినాథరావు, దర్శకుడు. రాజేష్ దండా నిర్మాత.

రావు రమేష్ నటించిన 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' సినిమా విడుదలకి సిద్ధంగా ఉంది. ఇందులో రావు రమేష్ ప్రధాన పాత్ర పోషిస్తే, లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. ఆ సినిమా తరువాత దర్శకుడు మారుతి టీమ్ ప్రొడక్ట్, వానరా సెల్యూలాయిడ్ సంయుక్త నిర్మాణంలో రావు రమేష్ ప్రధాన పాత్రలో 'బ్యూటీ' సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. అంకిత్ కొయ్య, విశాఖ ధిమన్ ఇందులో జంటగా నటిస్తుండగా, బాల సుబ్రహ్మణ్యమ్ దర్శకుడు, ఎ విజయ్ పాల్ రెడ్డి నిర్మాత. దర్శకుడు మారుతి క్లాప్ కొట్టగా, మరో దర్శకుడు బుచ్చిబాబు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీరశంకర్, సుబ్బు మంగాదేవి, డార్లింగ్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఇది ఒక ప్రేమ, కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కబోతున్న చిత్రం అని చిత్ర నిర్వాహకులు తెలిపారు. మే 2 నుంచి చిత్రీకరణ ప్రారంభం అవుతుందని తెలిపారు.

గుకేశ్‌కు టైటిల్

అతి పిన్న వయస్కుడిగా రికార్డు

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ టైటిల్‌ను 17ఏళ్ల భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ చేజిక్కించుకొని సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రపంచ టైటిల్‌ను చేజిక్కించుకున్న అతి పిన్న వయస్కుడిగా గుకేశ్ చరిత్రపుటల్లో నిలిచాడు. గుకేశ్ కంటే ముందు 1984లో రష్యా ఆటగాడు గ్యారీ కాస్పరోవ్ ఈ టోర్నమెంట్‌ను 22 ఏళ్ల అతి పిన్న వయసులో గెలుచుకున్నాడు. సోమవారం జరిగిన 14వ, చివరి రౌండ్‌లో గుకేశ్.. అమెరికాకు చెందిన హికారు నకమురాతో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. దీంతో 9పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచాడు. అదే సమయంలో, అతను ఫ్రాన్స్‌కు చెందిన ఫిరోజా అలిరెజాను ఓడించడం ద్వారా తన పాయింట్లను 8.5కి పెంచుకున్నాడు. అలీరెజా ఓటమితో, గుకేష్ టోర్నమెంట్‌లో నెపోమ్నియాచి, నకమురా, అమెరికాకు చెందిన ఫాబియానో కరువానాపై అర పాయింట్ ఆధిక్యం సాధించాడు. ప్రపంచ ఛాంపియన్ టైటిల్ కోసం చైనాకు చెందిన డింగ్ లిరెన్‌తో తలపడనున్నాడు. ఇక మహిళల టైటిల్‌ను టాంగ్ జోంగీ(చైనా) 7.5పాయింట్లు చేజిక్కించుకుంది. చివరి రౌండ్ గేమ్‌ను ఆమె డ్రా చేసుకొంది. ఇక భారత మహిళా గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి(2546 పాయింట్లు) 2వ స్థానంలో, ఆర్. వైశాలి (2475 పాయింట్లు) 6.5పాయింట్లతో 7వ స్థానంలో నిలిచారు.

రెండో భారతీయుడిగా రికార్డ్..

ఈ టోర్నీ గెలిచిన రెండో భారతీయుడు గుకేశ్ రికార్డ్ నెలకొల్పాడు. అతనికి ముందు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ 2014లో ఈ టోర్నీని గెలుచుకున్నాడు. అప్పుడు అతని 45ఏళ్లు. విజయం అనంతరం గుకేశ్ మాట్లాడుతూ.. 'నేను చాలా సంతోషంగా ఉన్నాను. నేను ఆ ఉత్తేజకరమైన గేమ్‌ను చూస్తున్నాను (ఫ్యాబియో కరువానా, ఐయోన్ నెపోమ్నియాచ్చి మధ్య), అప్పుడు నేను నా సహోద్యోగి (గ్రిగరీ గజెవ్‌స్కీ)తో కలిసి నడకకు వెళ్లానంటూ చెప్పుకొచ్చాడు. అది సహాయపడిందని నేను భావిస్తున్నాను అని తెలిపాడు.

ప్రధాని, విశ్వనాథన్ ఆనంద్ అభినందనలు..

క్యాండిడేట్ చెస్ టైటిల్ నెగ్గిన గుకేశ్‌కు దేశ ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు. టొరంటోలో జరిగిన అభ్యర్థుల చెస్ టోర్నమెంట్‌లో గుకేశ్ విజయం అతని ప్రతిభను, అంకితభావాన్ని తెలియజేస్తుందని అంటూ ప్రధానమంత్రి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అతని ఆట లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఇక విశ్వనాథన్ ఆనంద్, 'పిన్నవయస్కుడైన ఛాలెంజర్‌గా నిలిచినందుకు డి గుకేష్‌కు అభినందనలు. మీరు సాధించినందుకు చాలా గర్వంగా ఉంది. క్లిష్ట పరిస్థితులను ఎలా నిర్వహించారో నేను వ్యక్తిగతంగా చాలా గర్వపడుతున్నాను. ఈ క్షణం ఆనందించండి.' అంటూ ట్వీట్ చేశాడు.

బొప్పన్నకు పద్మశ్రీ ప్రదానం

- మరో ఆరుగురికి కూడా...

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల అందుకున్న క్రీడాకారులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన 'పద్మ' అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రోహన్ బొప్పన్న(టెన్నిస్) పారా స్విమ్మర్ సతేంద్ర సింగ్ అందుకున్నారు. వీరితోపాటు మరో ఐదుగురికి క్రీడారంగంలో గత ఏడాదికి గాను అవార్డులు దక్కాయి. 44ఏళ్ల వయసులో రోహన్ బొప్పన టెన్నిస్ డబుల్స్‌లో టాప్‌ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

క్రీడారంగంలో పద్మశ్రీ అవార్డు దక్కినవారు..

రోహన్ బొప్పన్న : టెన్నిస్
జోష్న చిన్నప్ప : స్క్వాష్
ఉదయ్ విష్ణువర్ధన్ : మల్లఖంబ్
గౌరవ్ ఖన్నా : బ్యాడ్మింటన్
సతేంద్ర సింగ్ లాహియా: పారా-స్విమ్మింగ్
పూర్ణిమ మహతో : ఆర్చరీ
హర్బిందర్ సింగ్ : హాకీ

జైస్వాల్ సెంచరీ

ముంబయిపై తొమ్మిది వికెట్ల తేడాతో రాజస్తాన్ గెలుపు

జైపూర్: సీజన్-17 ఐపిఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో సోమవారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయిను తిలక్ వర్మ ఆదుకోవడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 179పరుగులు చేసింది. హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ(65) అర్ధసెంచరీతో రాణించాడు. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు ఓపెనర్ యశస్వి జైస్వాల్(104) అజేయ సెంచరీతో రాణించడంతో 18.4ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన ముంబయ్‌ను సందీప్ శర్మ (5/18) అద్భుత స్పెల్‌తో కట్టడి చేశాడు. తొలుత డేంజరస్ ఇషాన్ కిషన్(0), సూర్యకుమార్ యాదవ్(10)లను వెనక్కి పంపి ముంబయిని కష్టాల్లోకి నెట్టాడు. తిలక్ వర్మ(65), నేహల్ వధేరా(49) ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు వీరు 99 పరుగులు జోడించారు. రాజస్తాన్ పేసర్ అనంతరం రాజస్తాన్ ఓపెనర్లు జైస్వాల్ సెంచరీకి తోడు బట్లర్(35), సంజు(38) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సందీప్ శర్మకు లభించింది.

స్కోర్‌బోర్డు..

ముంబయి ఇన్నింగ్స్: రోహిత్ (సి)సంజు (బి)బౌల్ట్ 6, ఇషాన్ (సి)సంజు (బి)సందీప్ 0, సూర్యకుమార్ (సి)పోవెల్ (బి)సందీప్ శర్మ 10, తిలక్ వర్మ (సి)పోవెల్ (బి)సందీప్ శర్మ 65, నబి (సి అండ్ బి) చాహల్ 23, వధేరా (సి)సందీప్ (బి)బౌల్ట్ 49, హార్దిక్ పాండ్యా (ఎల్‌బి) ఆవేశ్ ఖాన్ 10, టిమ్ డేవిడ్ (సి)రియాన్ పరాగ్ (బి)సందీప్ శర్మ 3, కోర్జే (సి)హెట్‌మైర్ (బి)సందీప్ శర్మ 0, చావ్లా (నాటౌట్) 1, బుమ్రా (నాటౌట్) 2, అదనం 10. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 179పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/6, 3/20, 4/52, 5/151, 6/170, 7/176, 8/176, 9/177 **బౌలింగ్:** బౌల్ట్ 4-0-32-2, సందీప్ 4-0-18-5, ఆవేశ్ 4-0-49-1, అశ్విన్ 4-0-31-0, చాహల్ 4-0-48-1.

రాజస్తాన్ ఇన్నింగ్స్: జైస్వాల్ (నాటౌట్) 104, బట్లర్(బి)చాహల్ 35, సంజు (నాటౌట్) 38, అదనం 6. (18.4ఓవర్లలో వికెట్ నష్టానికి) 183పరుగులు. **వికెట్ల పతనం:** 1/74, **బౌలింగ్:** హార్దిక్ 2-0-21-0, బుమ్రా 4-0-37-0, తుషారా 3-0-28-0, కోర్జే 2-0-25-0, నబి 3-0-30-0, చావ్లా 4-0-33-1, తిక్ వర్మ 0.4-0-8-0.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	8	7	1	14	0.69
కోల్‌కతా	7	5	2	10	1.20
సన్‌రైజర్స్	7	5	2	10	0.91
చెన్నై	7	4	3	8	0.52
లక్నో	7	4	3	8	0.12
గుజరాత్	8	4	4	8	-1.05
ముంబయి	8	3	5	6	-0.22
ఢిల్లీ క్యాపిటల్స్	8	3	5	6	-0.47
పంజాబ్‌కింగ్స్	8	2	7	4	-0.29
బెంగళూరు	8	1	7	2	-1.04

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్